www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

సోమవారం | 4-2-2019 | పేజీలు: 14 + 20 | వెల: రూ.6.50 | సంపుటి: 59 సంచిక: 290 | శ్రీవిళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య రా. 2.35 తదుపరి శు. పాడ్యమి; నక్షత్రం: శ్రవణం తె. 6.02 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: ఉ. 7.26-9.15; దుర్ముహూర్తం: మ. 12.52-1.37, మ. 3.07-3.52; అమృతఘడియలు: రా. 6.16-8.05; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.07 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai





హైకోర్టును లాంఛనంగా ప్రారంభిస్తున్న చీఫ్ జస్టిస్ గొగోయ్. చిత్రంలో జస్టిస్ రమణ, జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ సుభాష్, జస్టిస్ ప్రవీణ్‌కుమార్, సీఎం చంద్రబాబు తదితరులు

అమరావతిలో న్యాయ శకం

ఘనంగా హైకోర్టు ప్రారంభోత్సవం

శాశ్వత భవనానికీ శంకుస్థాపన

- సుప్రీం సీజే చేతుల మీదుగా శ్రీకారం
- రాష్ట్ర ప్రజలకు హైకోర్టు అంకితం
- చంద్రబాబు బాగా చేశారని సీజే వ్యాఖ్య
- రాజ్యాంగం సమర్థించేలా తీర్పులివ్వాలి
- జడ్జిలకు జస్టిస్ గొగోయ్ హితవు

ఆర్బిట్రేషన్‌కు అమరావతి చిరునామా

సీఎం చంద్రబాబు ఆకాంక్ష

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్ర రాజధాని అమరావతి చరిత్రలో కొత్త అధ్యాయం మొదలైంది. రాష్ట్ర హైకోర్టు ప్రారంభోత్సవం, శాశ్వత హైకోర్టు భవనం శంకుస్థాపన ఆదివారం ఘనంగా జరిగాయి. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ చేతుల మీదుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎన్వీ రమణ, జస్టిస్ లావు నాగేశ్వరరావు, జస్టిస్ సుభాష్‌రెడ్డి, ఏపీ హైకోర్టు తాత్కాలిక

మిగతా 11వ పేజీలో...

● **పోలీసుల చేతిలో సీబీఐకి పరాభవం!!**



ఆదివారం రాత్రి కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్‌కుమార్‌ను ప్రశ్నించడానికి వచ్చిన సీబీఐ అధికారులను బలవంతంగా లాక్కెళుతున్న బెంగాల్ పోలీసులు



మోదీ X దీదీ

బెంగాల్ యుద్ధం

కోల్‌కతాలో కేంద్ర రాష్ట్రాల వీధి పోరాటం

● **కేంద్ర అధికారులకు కేంద్రమే రక్షణ!!**



బెంగాల్ పోలీసుల వైఖరి నేపథ్యంలో ఆదివారం రాత్రి కోల్‌కతాలోని సీబీఐ కార్యాలయానికి రక్షణగా రంగంలోకి దిగిన కేంద్ర రిజర్వు బలగాలు

ఒక నగర పోలీసు కమిషనర్‌ను అరెస్టు చేసేందుకు సీబీఐ అధికారులు వెళ్లారు.

సీబీఐ అధికారులను రాష్ట్ర పోలీసులు చుట్టుముట్టి, జీప్‌లో వేసి ఠాణాకు తరలించారు.

'దెబ్బకు దెబ్బ' అన్నట్లుగా సీబీఐ కార్యాలయాన్ని రాష్ట్ర పోలీసులు దిగ్బంధించారు.

రాష్ట్ర పోలీసుల చుట్టూ కేంద్ర ప్రభుత్వ భద్రతా బలగాలు మోహరించాయి.

కేంద్రానికి వ్యతిరేకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి తన రాష్ట్ర రాజధానిలో నడిరోడ్డుపై ధర్నాకు దిగారు.

ఇది యుద్ధం. *ఈ యుద్ధానికి వేదిక కోల్‌కతా. ప్రధాని మోదీ-బెంగాల్ సీఎం మమత మధ్య యుద్ధం పతాక స్థాయికి చేరుకుంది.*

- ఆధారాలను సీపీ ధ్వంసం చేశారు.. సుప్రీంకెళ్తాం: సీబీఐ
- సీపీ రాజీవ్ కుమార్ ప్రపంచంలోనే అత్యుత్తమ అధికారి
- మమత కితాబు.. సీపీ ఇంటికి వెళ్లి భరోసా.. అర్ధరాత్రి ధర్నా
- నేటి బడ్జెట్‌ను ఇక్కడ్నుంచే అసెంబ్లీకి సమర్పిస్తానని వెల్లడి
- మమతకు రాహుల్, బాబు, కేజ్రీ, అఖిలేశ్, తేజస్వి మద్దతు



అర్ధరాత్రి రాజ్యాంగ పరిరక్షణ దీక్షకు దిగిన మమత. చిత్రంలో కమిషనర్ రాజీవ్‌కుమార్

నడిబజార్లో సీబీఐతో తలపడిన పోలీసులు

కోల్‌కతా/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: దేశంలోనే కనీ వినీ ఎరుగని సంఘటన. ఇప్పటి వరకూ ఎక్కడా జరగని యుద్ధం! బెంగాల్ నడి వీధుల్లో కోల్‌కతా సిటీ పోలీసులు, సీబీఐ అధికారులు ఘర్షణ పడ్డారు. బాహాబాహీ తలపడ్డారు. సీబీఐ అధికారులను కోల్‌కతా సిటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసు జీపుల్లో ఎత్తి పడేశారు. జీపులు ఎక్కడానికి నిరాకరిస్తే లోపలికి తోసేశారు. పోలీసు స్టేషన్లకు తరలించారు. కోల్‌కతాలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్న హైటెన్షన్ హైడ్రామా ఇది. రోజ్ వ్యాలీ, శారదా పోంజీ స్కామ్ కేసుల్లో నిందితుడిగా పేర్కొంటూ కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను విచారించడానికి వచ్చిన సీబీఐ అధికారులనే

మిగతా 12వ పేజీలో...

- స్కాముల కేసుల విచారణపై రణరంగం
- కోల్‌కతా పోలీసు కమిషనర్ ఇంటికి సీబీఐ
- ప్రశ్నించేందుకు 40 మందికిపైగా అధికారులు
- లోపలికి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసు సెంట్రీ
- అంతలోనే భారీగా నగర పోలీసుల రాక
- సీబీఐ అధికారులతో బాహాబాహీ.. ఘర్షణ
- అదుపులోకి తీసుకుని జీపుల్లోకి తోసివేత
- వాటిల్లో కుక్కేసి పోలీసు స్టేషన్లకు తరలింపు
- విచారణ అనంతరం ఎట్టకేలకు రాత్రి విడుదల
- సీబీఐ ఆఫీసు చుట్టూ పోలీసుల మోహరింపు
- జాయింట్ డైరెక్టర్ నివాసం చుట్టూ కూడా
- పోలీసుల చుట్టూ సీఆర్పీఎఫ్ మోహరింపు
- కోల్‌కతా నడి రోడ్లపై హైటెన్షన్.. హైడ్రామా

ఏమిటిది కామ్రేడ్!? 9

- 10 టీవీ పేరిట ఫక్తు వ్యాపారం
- సొంత నియమావళికే తూట్లు
- నష్టం వచ్చిందనడం బూటకం

రెండో రోజూ అదే సంబరం

- జోరుగా పసుపు-కుంకుమ, పింఛన్లు
- వాడవాడలా చెక్కులు, నగదు పంపిణీ
- కొన్ని చోట్ల 6వ తేదీ వరకు పంపిణీ

తొలివిడత డబ్బు రెడీ!

- 36 బ్యాంకుల్లో రూ.2,345 కోట్లు
- 'పసుపు-కుంకుమ'పై ప్రభుత్వం జాగ్రత్తలు
- కొత్త సభ్యులకూ వారంలో చెక్కులు



తాడేపల్లిగూడెంలో సీఎం విగ్రహానికి మహిళల పాలాభిషేకం

'పసుపు-కుంకుమ' భగ్నానికి కుట్ర 10

- చెక్కులు చెల్లవనే దుష్ప్రచారం నమ్మొద్దు
- నేటి నుంచే డబ్బులు తీసుకోవచ్చు
- నేను ప్రజల్లోకి.. జగనేమో కోర్టుకు: సీఎం

అగ్రిగోల్డ్ బాధితులకు రూ.300 కోట్లు! 2

అర్చక స్వాముల పనేనా?

- గోవిందరాజస్వామి గుడిలో 3 కిరీటాల చోరీ
- నిందితుడిని గుర్తించిన పోలీసులు
- సీసీ ఫుటేజీలో అతడి కదలికలు రికార్డు
- అర్చకులు సహకరించారని అనుమానం
- ప్రత్యేక బృందాలతో ముమ్మరంగా దర్యాప్తు
- చోరీ అయిన కిరీటాల విలువ 40 లక్షలు
- 2-3 రోజుల్లో పట్టుకుంటాం: టీటీడీ ఈవో

2



గోవిందరాజ స్వామి ఆలయం నుంచి పరుగున వెళ్తున్న అనుమానితుడి చిత్రం



10

దేశంలో రైతులందరికీ రుణ మాఫీ!

కాంగ్రెస్ అధ్యక్షుడి అతిపెద్ద హామీ

- బిహార్ సభలో ప్రకటించిన రాహుల్ గాంధీ
- మోదీ సర్కారు రూ.6 వేల హామీకి కౌంటర్!
- రైతులను మోదీ అవమానించారు: రాహుల్



'మాఫీ' మోసం!

ఎన్నికలప్పుడే కాంగ్రెస్‌కు ఈ జ్వరం

- 2009లోనూ ఇంతే.. 52 వేల కోట్లే మాఫీ
- 35 లక్షల మంది అనర్హులకూ లబ్ధి
- మా పథకంలో 90% మంది: ప్రధాని మోదీ

10

ఈ నెలలోనే రైతులకు 2 వేలు

పీఎం-కిసాన్ తొలి విడత సాయానికి రంగం సిద్ధం

పట్టాలు తప్పిన

సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ 14

ఆరుగురి మృతి.. 29 మందికి గాయాలు

కాంగ్రెస్‌కు కురువృద్ధులు గుడ్‌బై

మొన్న కోట్ల .. ఇప్పుడు కిశోర్ చంద్రదేవ్

- పార్టీలో సీనియర్లకు గౌరవం లేదు.. అందుకే రాజీనామా చేస్తున్నా: దేవ్

షెడ్యూల్ వచ్చాకే జాబితా.. అభ్యర్థులపై టీడీపీ నిర్ణయం



కిశోర్ చంద్రదేవ్ 11



పరంజ్యోతి



నిజమైన వైరాగ్యంతోనే శాశ్వత సుఖం

సర్వసంపదలతో తులతూగే ధనవంతులు, అధికార దర్పంతో వెలిగే గొప్పగొప్ప ఉద్యోగులు, పెద్ద పెద్ద పారిశ్రామికవేత్తలు, కొండలను పిండి కొట్టగల బలవంతులు, విద్యావంతులు, పండితులు సుఖాలను అనుభవిస్తూనే దుఃఖాలు పడుతున్నారు. ఆందోళనలు, ఆదుర్దాలు, ఉద్రేకాలు చెందుతున్నారు. ఇక పేదలు, మధ్యతరగతివారి సంగతి సరే సరి. వారూ తమ జీవితాలను ఇతరులతో పోల్చుకొని బాధలు పడుతున్నారు. ఎవరిని అడిగినా తాము చాలా కష్టాల్లో ఉన్నామని, ఇతరులంతా హాయిగా ఉన్నారని చెబుతారే గానీ తాము హాయిగా, ఆనందంగా జీవిస్తున్నామని చెప్పేవారు ఒక్కరు కూడా కనిపించరు. దీన్ని బట్టి ఎవరూ కూడా సుఖంగా లేరని స్పష్టమవుతుంది. మరి సుఖం ఎవరికి ఉంటుందన్న ప్రశ్న మనందరికీ వస్తుంది.

సుర మందిర తరుమూల నివాసః
శయ్యా భూతల మజినం వాసః
సర్వ పరిగ్రహ భోగ త్యాగః
కస్య సుఖం న కరోతి విరాగః

సురేశ్వరాచార్యుల వారు చెప్పిన ఈ శ్లోకాన్ని అర్థమేమిటంటే.... దేవాలయాల్లోనూ, చెట్ల మొదళ్లలోనూ నివసిస్తూ, కటిక నేల మీద పడుకుని నిద్రిస్తూ, చర్మాన్ని వస్త్రంగా ధరిస్తూ దేనినీ గ్రహించకుండా ఏమీ కావాలని కోరుకోకుండా ఉండే విరాగికి సుఖమే తప్ప దుఃఖం ఉండదు.

తమ అంతరాంతరాలలో కోరికలను పూర్తిగా తుడిచిపెట్టి, ఎటువంటి భోగాల పట్లా ఆసక్తి లేకుండా ఉండి అతి సాధారణ జీవితాన్ని గడుపుతున్న వైరాగ్యవంతులకే పూర్తి సుఖం. అనిత్యమైన ప్రాపంచిక వస్తువులపై వ్యామోహపడకుండా, నిత్యవస్తువైన పరమాత్మలో ఎవడు మనస్సు నిల్పి ఉంటాడో అట్టివానికే అసలైన సుఖం లభిస్తుంది. స్వంతంగా ఇల్లు లేకపోయినా ఎక్కడో ఓ చోట కటిక నేల మీద పడుకుంటాడు. శరీరం మీద దుస్తుల విషయంలో ప్రాధాన్యం ఉండదు. ఎవరో ఏదో తనకు ఇవ్వాలని కోరుకోడు, ఇచ్చినా తీసుకోడు, తీసుకున్నా ఆ వస్తువు మీద మమకారం ఉండదు. దాన్ని అనుభవించాలనుకోడు. అతనికెప్పుడూ స్వయం సమృద్ధే. తన అంతరాంతరాలలో ఉన్న ఆనంద మనే ఊటబావిని కనిపెట్టిన జ్ఞాని అతడు. లోపల అనంతమైన ఆనందం లభిస్తూంటే బయట దొరికే అల్పమైన సుఖాల కోసం ఎందుకు వెంపర్లాడుతాడు? లోపల ఉండే ఆనందాన్ని గుర్తించనివారు, పొందలేనివారు మాత్రమే ప్రాపంచిక వస్తువుల వెంటబడతారు. నిజమైన వైరాగ్యవంతుడు ఎక్కడ, ఎలా ఉన్నప్పటికీ అతడు నిత్య సంతోషి, పరమ శాంతమూర్తి. మనం కూడా ప్రాపంచిక వస్తువులపై దృష్టి పెట్టకుండా, కోరికలను జయించి మనలోనే ఉన్న పరమాత్మ యందు మనస్సు లగ్నం చేసి నిజమైన వైరాగ్యం పొందే ప్రయత్నం చేయాలి. తద్వారా శాశ్వతమైన సుఖాన్ని పొందగలుగుతాము.

- దేవిశెట్టి చలపతిరావు

అసలు నిందితుడు రాకేశ్?

వీడిన జయరామ్ హత్య మిస్టరీ!.. కిరాయి హంతకులతో కలిసి కుట్ర.. ఆర్థిక వివాదాలే కారణం

- గుట్టు విప్పుతున్న శిఖా చౌదరి
- మొత్తం ఐదుగురిని ప్రశ్నిస్తున్న ఖాకీలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

అర్థంకాని అల్లిబిల్లి సంబంధాలు... ఆర్థిక వ్యవహారాలు... అనేక అనుమానాలు! తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ప్రవాసాంధ్రుడు, కోస్టల్ బ్యాంక్ డైరెక్టర్ చిగురుపాటి జయరాం హత్య కేసు దర్యాప్తులో వెలుగు చూసిన వివరాలివి! ఈ కేసులో మిస్టరీ వీడుతోంది. జయరాం మేనకోడలు శిఖా చౌదరి స్నేహితుడు రాకేశ్‌రెడ్డే ఈ హత్యకు ప్రధాన కారకుడని కృష్ణా జిల్లా పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. శిఖా చౌదరి, రాకేశ్ రెడ్డి, ఆయన స్నేహితుడు శ్రీకాంత్‌రెడ్డి, జయరాం మరో మేనకోడలు మనీషాతోపాటు, ఒక యాంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని నందిగామలో, కృష్ణా జిల్లా పోలీసు కార్యాలయంలో... ఎస్పీ త్రిపాఠీ ఆధ్వర్యంలో ప్రశ్నించి ఒక్కో విషయాన్ని రాబడుతున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం... జయరామ్ హత్యకు ఆర్థిక వివాదాలే కారణంగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఆయన బలహీనతలను వాడుకున్న రాకేశ్‌రెడ్డి హత్యకు ప్రణాళిక వేశాడని... జయరామ్‌కు పరిచయం ఉన్న యాంకర్ ద్వారా ఫోన్ చేయించి... హైదరాబాద్‌లో తన ఇంటికే రప్పించి, కిరాయి హంతకుల సహాయంతో పాయిజన్ ఇంజెక్షన్ ఇచ్చి చంపేశారని తెలుస్తోంది. ఆ తర్వాత... మృతదేహాన్ని కారులో తీసుకెళ్లి తెలంగాణ సరిహద్దులు దాటించారని తెలుస్తోంది. ఒక కారులో జయరాం మృతదేహాన్ని తరలించగా... మరో కారులో మిగిలిన నిందితులు అనుసరించినట్లు సమాచారం.

ఆ 31 గంటలు...: ఈనెల 30వ తేదీ మధ్యాహ్నం జయరామ్ హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి బయటికి వచ్చారు. ఆపై 31 గంటల తర్వాత హత్యకు గురయ్యారు. ఈ సమయంలో ఆయన ఎక్కడెక్కడ ఉన్నారనే విషయాన్ని పోలీసులు సెల్‌సిగ్నల్స్ ద్వారా గుర్తించారు. దీని ప్రకారం... జయరామ్ దసపల్లా హోటల్‌లోని ఓ గదిలో చాలాసేపు ఉన్నారు. ఆయనతోపాటు ఓ యాంకర్ ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 10లోని 'వివాహ భోజనంబు' హోటల్‌కు కూడా వెళ్లినట్లు నిర్ధారించుకున్నారు.



జయరామ్ అంత్యక్రియల్లో కుటుంబ సభ్యులు

గజిబిజి బంధాలు...: జయరామ్ కుటుంబమంతా ఫ్లోరిడాలో ఉంటోంది. తెలుగు రాష్ట్రాల్లో కొనుగోలు చేసిన ఆస్తులను ఆయన చాలా వరకు శిఖా పేరుమీద రిజిస్టర్ చేయించినట్టు తెలుస్తోంది. ఆ దస్తావేజులను మాత్రం తన వద్దే పెట్టుకున్నట్లు చెబుతున్నారు. రాకేశ్‌కు తాను ఇవ్వాల్సిన రూ.4 కోట్లను మామయ్య జయరాం చెల్లించినట్లు శిఖా చెప్పినట్లు తెలిసింది. జయరామ్‌తో ఆమెకు వివాహేతర సంబంధం ఉన్నట్లు కూడా గుర్తించినట్లు సమాచారం. జయరామ్ గత నెల 30వ తేదీ మధ్యాహ్నం బయటకు వచ్చిన తర్వాత, ఆ మర్నాడు శిఖా చౌదరి ఆయన ఇంటికి వెళ్లింది. రూమ్, బీరువా తాళాలు ఇవ్వాలని అక్కడున్న వాచమెన్ వెంకటేశ్వరరావుతో గొడవ పడింది. ఆ సమయంలో శిఖా అక్కడికి ఎందుకు వెళ్లిందన్నది ఒక ప్రశ్నగా ఉంది. ఆ తర్వాతే జయరామ్ హత్య జరిగింది. జయరామ్ ఆస్తుల గురించి తనకు తెలియదని, చెక్ పవర్ మొత్తం ఆయన భార్య పద్మశ్రీ చేతుల్లోనే ఉంటుందని శిఖా చౌదరి పోలీసులకు వివరించినట్లు తెలిసింది. మరోవైపు... రాకేశ్, శిఖా మధ్య చాలాకాలంగా సన్నిహిత సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఒక దశలో వాళ్లిద్దరూ వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తర్వాత ఇద్దరి మధ్య విభేదాలొచ్చాయి. శిఖా చౌదరికి నేపథ్యం తెలిసినందునే పెళ్లి ఆలోచన విరమించుకున్నట్లు రాకేశ్ చెప్పినట్లు తెలిసింది.

కుటుంబ సభ్యుల రాక

అమెరికా నుంచి జయరామ్ భార్య పద్మశ్రీ, ఇతర కుటుంబ సభ్యులు ఆదివారం హైదరాబాద్ చేరుకున్నారు. పద్మశ్రీని పోలీసులు ప్రశ్నించారు. తాము ఫ్లోరిడాలో ఉండిపోవడంతో ఇక్కడ జరుగుతున్న విషయాలేవీ తెలియదని ఆమె చెప్పారు. భర్త హత్య గురించి తెలియగానే షాక్‌కు గురైనట్టు చెప్పారు. ఎవరి మీద తనకు అనుమానం లేదని... హంతకులను శిక్షించి న్యాయం చేయాలని ఆమె పోలీసులకు విజ్ఞప్తి చేశారు. తన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. జయరామ్ అంత్యక్రియలు ఆదివారం హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో జరిగాయి.

కేసు బదిలీ?: చిగురుపాటి జయరామ్ హత్య తెలంగాణలో జరిగింది. ఆయన మృతదేహం మాత్రం కృష్ణా జిల్లా నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలో లభ్యమైంది. ప్రస్తుతం ఈ కేసును నందిగామ పోలీసులు దర్యాప్తు చేస్తున్నప్పటికీ తర్వాత దీనిని తెలంగాణ పోలీసులకు బదిలీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

రాణాకు కబాలి నిర్మాత: కబాలి చిత్ర నిర్మాత కేపీ చౌదరి నందిగామ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. శిఖా చౌదరి తనకు బంధువని ఆయన తెలిపారు. 'రాకేశ్‌కు శిఖాకు మధ్య ఉన్న సంబంధం గురించి నాకు తెలియదు. శిఖా, నేను తరచుగా కలుసుకునే వాళ్లం. ఆ సమయంలో రాకేశ్ ఎప్పుడూ మా వద్దకు రాలేదు. ఈ కేసులో శిఖా ప్రమేయం లేదని అనుకుంటున్నాను' అని కేపీ చౌదరి చెప్పారు.

నిరంతరం నాణ్యమైన విద్యుత్

- ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- ఎంబీసీలకూ 100 యూనిట్లు ఫ్రీ
- టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను శాశ్వత పథకంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. ఇంధనశాఖ అధికారులతో ఆదివారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంధన రంగంలో వస్తున్న సరికొత్త ఆవిష్కరణలు, సాంకేతికతలను అన్వేషించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఎనర్జీ ఇన్నోవేషన్-2019 పేరిట విజయవాడలో ఈనెల 5, 6 తేదీల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సు ఆంధ్రప్రదేశ్‌కు ఉపయోగకరంగా ఉంటుందని సీఎం తెలిపారు. అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ డాల్‌బర్గ్, భారత పరిశ్రమల సమాఖ్య, ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్, టీఈఆర్ఐ సహకారంతో ఈ సదస్సు నిర్వహించనున్నారు. ఏపీలో ఇలాంటి సదస్సు నిర్వహించడం ఇదే తొలిసారని, ఇంధన రంగంలో లక్ష్యాలను సాధించేందుకు ఈ సెమినార్ తోడ్పడుతుందని సీఎం ఆకాంక్షించారు. ఈ సదస్సులో చంద్రబాబు కీలకోపన్యాసం చేయనున్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి విద్యుత్ రంగం వెన్నెముక లాంటిదని సీఎం అన్నారు. వినియోగదారులను వందశాతం సంతృప్తిపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం తెలిపారు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నామని, దీన్ని ఎంబీసీలకూ అమలు చేస్తామని తెలిపారు. ఇక వ్యవసాయ రంగానికి ఉచిత కరెంట్ ఇచ్చేందుకు రూ.6030 కోట్లు సబ్సిడీగా భరిస్తున్నామని, దేశంలోని ఏ రాష్ట్రం కూడా ఇంత మొత్తాన్ని భరించడం లేదని వెల్లడించారు. టెలికాన్ఫరెన్స్‌లో ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి, ట్రాన్స్‌కో సీఎండీ కె.విజయానంద్, ట్రాన్స్‌కో జేఎండీ దినేశ్ పరుచూరి, డిస్కమ్‌ల సీఎండీలు ఎంఎం నాయక్, హెచ్‌వై దొర తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ వచ్చాకే జాబితా!

- అభ్యర్థులపై టీడీపీ నిర్ణయం
- ఈలోపు అన్ని కోణాల్లో పరిశీలన
- జమ్మలమడుగుపై కసరత్తు కొలిక్కి!
- ఎంపీగా ఆది.. ఎమ్మెల్యేగా రామసుబ్బారెడ్డి?
- కర్నూలులో కోట్ల చేరికతో మారుతున్న సమీకరణలు
- అసెంబ్లీ సమావేశాల తర్వాత జిల్లాల నేతలతో సీఎం చర్చలు

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాతే తన అభ్యర్థుల జాబితా ప్రకటించాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించినట్లు తెలిసింది. షెడ్యూల్ మార్చి మొదటి వారంలో వెలువడవచ్చని ప్రచారం జరుగుతోంది. దేశవ్యాప్తంగా ఎన్నికలు జరిగే తేదీలను ఈ షెడ్యూల్‌లో కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) ప్రకటిస్తుంది. నోటిఫికేషన్‌కు 40 రోజుల ముందు షెడ్యూల్‌ను విడుదల చేయడం ఆనవాయితీ. నోటిఫికేషన్ జారీఅయిన రోజు నుంచి నామినేషన్ల దాఖలు మొదలవుతుంది. షెడ్యూల్ ఎప్పుడు విడుదలైతే అప్పుడు అభ్యర్థుల జాబితా ప్రకటించాలని, ఈలోపు జాబితా సిద్ధం చేసుకోవాలని టీడీపీ నాయకత్వం యోచిస్తోంది. ఈ దిశగా ఆ పార్టీ అధినేత చంద్రబాబు ఇప్పటికే లోతైన కసరత్తు చేస్తున్నారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రతి నియోజకవర్గంలో రాజకీయ పరిస్థితి, సిటింగ్ ఎమ్మెల్యే లేదా ఇన్‌చార్జి బలాబలాలు, బలహీనతలు.. ప్రత్యర్థి శిబిరం నుంచి పోటీ చేసే అవకాశం ఉన్న వారి పరిస్థితి, సామాజిక సమీకరణలు తదితర అంశాలపై సమాచారం సేకరించి వాటిని విశ్లేషిస్తున్నారు. లోక్‌సభ అభ్యర్థులపైనా ఇదే మాదిరి కసరత్తు జరుగుతోంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇన్‌చార్జులను పిలిపించి వారితో చంద్రబాబు నేరుగా మాట్లాడుతున్నారు.

ఎవరెవరు ఎక్కడెక్కడ..?

కొన్ని జిల్లాల్లో అభ్యర్థిత్వ వివాదాలను పరిష్కరించి ఎవరు ఎక్కడ పోటీ చేయాలో నిర్ణయించే కసరత్తు కూడా లోలోపల జరుగుతోంది. ఉదాహరణకు కడప జిల్లాలో మంత్రి ఆదినారాయణరెడ్డి... మండలిలో ప్రభుత్వ విప్ రామసుబ్బారెడ్డిల్లో ఒకరిని కడప ఎంపీగా... మరొకరిని జమ్మలమడుగు ఎమ్మెల్యేగా నిలపాలని నిర్ణయించారు. తాజాగా వీరి మధ్య అంగీకారం కుదిరిందని టీడీపీ వర్గాలు అంటున్నాయి. తనకు ఉన్న ఎమ్మెల్సీ పదవికి ముందే రాజీనామా చేయడానికి రామసుబ్బారెడ్డి అంగీకరించారు. కొద్ది రోజుల్లో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ఇదే జిల్లాలో కమలాపురం నియోజకవర్గ అభ్యర్థిత్వంపైనా చంద్రబాబు దృష్టి సారించారు. ఆ నియోజకవర్గానికి ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న పుత్తా నరసింహారెడ్డిని ఆయన పిలిపించి మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి అక్కడ బలమైన అభ్యర్థి కాగలరన్న అంచనాలు ఉండడంతో పుత్తాకు నచ్చచెప్పి ఒప్పించడానికి చర్చలు జరుగుతున్నాయని తెలిసింది. కర్నూలు జిల్లాలో కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కోట్ల సూర్యప్రకాశరెడ్డి తన వర్గంతో టీడీపీలో చేరే దిశగా అడుగులు వేస్తుండటంతో ఆ జిల్లాలో సమీకరణలు మారుతున్నాయి. ఆయన చేరితే కర్నూలు ఎంపీ టికెట్ ఆయనకే దక్కే అవకాశంఉంది. ప్రస్తుత సిటింగ్ ఎంపీ బుట్టా రేణుకకు ప్రత్యామ్నాయంగా మరో సీటు ఏదైనా ఇవ్వవచ్చని అంటున్నారు. కోట్ల వర్గం ఎంపీ సీటుతోపాటు ఒక ఎమ్మెల్యే సీటు కూడా ఆశిస్తోంది. పత్తికొండకు ప్రస్తుతం ఉపముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆ జిల్లాలో కోట్ల, కేఈ కుటుంబాలకు దీర్ఘ కాలంగా విభేదాలున్నాయి. అయినా కోట్ల చేరికకు కేఈ అభ్యంతర పెట్టడం లేదు. ఎంపీ సీటు ఆయనకిస్తే తనకు అభ్యంతరం లేదని, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పత్తికొండ సీటు మాత్రం ఇవ్వవద్దని ఆయన కోరుతున్నారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత సీఎం జిల్లాలవారీగా పార్టీ నేతలతో సమావేశమై వారి అభిప్రాయాలు కూడా తీసుకుంటారు. బస్సులో జిల్లాల్లో పర్యటించి కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని సీఎం భావిస్తున్నారు.

నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి

సీఎం చంద్రబాబు సోమవారం మధ్యాహ్నం ఢిల్లీ వెళ్తున్నారు. ఈవీఎంల దుర్వినియోగం... దానిని నివారించే మార్గాలపై చర్చించేందుకు అక్కడ బీజేపీయేతర పక్షాల నేతలందరితో కలిసి కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కలుస్తారు. రాత్రికి తిరిగి వస్తారు. ఢిల్లీ బయల్దేరే ముందు ఆయన కొండపల్లి కోటలో పర్యాటక ఉత్సవాలకు హాజరవుతారు.



కళాశాల శత వసంతాల వేడుకను ప్రారంభిస్తున్న మంత్రి గంటా

అమరావతిలో సంగీత కళాశాల

- మహారాజ కళాశాల శత వసంతాల వేడుకల్లో మంత్రులు గంటా, సుజయ్

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 3: విజయనగరం మహారాజ ప్రభుత్వ సంగీత-నృత్య కళాశాల వందేళ్ల చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని అమరావతిలో సంగీత కళాశాల నిర్మాణానికి సీఎం చంద్రబాబు నిర్ణయించారని మంత్రులు గంటా శ్రీనివాసరావు, సుజయ్‌కృష్ణ రంగారావు చెప్పారు. ఆదివారం మహారాజ సంగీత నృత్య కళాశాల శత వసంతాల వేడుకలను మంత్రులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఇటీవల కేబినెట్ సమావేశంలో సంగీత కళాశాల విషయం చర్చకు వచ్చిందని, అమరావతిలో ఇదే తరహా కళాశాల ఏర్పాటుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. విజయనగరాన్ని సాంస్కృతిక రాజధానిగా చేసేందుకు కృషిచేస్తామని తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన నాలుగో ఆనందగజతిరాజు విగ్రహాన్ని కేంద్ర మాజీ మంత్రి, ఎంపీ అశోక్ గజపతిరాజు ఆవిష్కరించారు. అలాగే, శతవసంతాల శోభాయాత్రను కళాశాల వద్ద జెండా ఊపి ఆయన ప్రారంభించారు. తొలిరోజు నాదస్వర కచేరీ, పూర్వ విద్యార్థి వసుంధరా థామస్(చైన్నై) భారతనాట్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

సచ్చిదానందశాస్త్రికి పురస్కారం



మహారాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల శత వసంతాల పురస్కారాన్ని కోట సచ్చిదానంద శాస్త్రి భాగవతార్(గుంటూరు)కు అందించారు. మంత్రులు గంటా శ్రీనివాసరావు, సుజయ్‌కృష్ణ రంగారావు అందజేశారు. రూ.లక్ష నగదు, జ్ఞాపిక అందించారు.

అర్చకులకు వంశపారంపర్య హక్కులు!

గుంటూరు, ఫిబ్రవరి 3: అర్చకులకు వంశపారంపర్య హక్కులు, సర్వీసు నిబంధనల అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వారి చిరకాల స్వప్నం సాకారం కానుంది. దీనికి సంబంధించి ఏడాది క్రితం జీవో 76 ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ కాగా, ఈ నెల 5న ఉండవల్లి ప్రజావేదికపై సీఎం చంద్రబాబు జీవో 76 విడుదల చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అర్చకులకు వంశపారంపర్య హక్కులు, సర్వీసు నిబంధనలు అమలుకు అర్చక, బ్రాహ్మణ సంఘాలు ఎన్నో దశాబ్దాలుగా ప్రభుత్వాలను, రాజకీయ పక్షాలను డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. తాజాగా ఆదివారం విజయవాడలోని అతిథిగృహంలో ఆయా సంఘాల నాయకులు ప్రతినిధులతో చర్చలు జరిపి జీవో 76 విడుదల, అందులో విధివిధానాలపై స్పష్టత ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5న సీఎం చంద్రబాబు జీవో 76ను విడుదల చేయనున్నారని రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ప్రధాన కార్యదర్శి, బ్రాహ్మణ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ శిరిపురపు శ్రీధర్, అర్చక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి తెలిపారు. ఈ జీవో వస్తే రాష్ట్రంలో 40 వేల అర్చక కుటుంబాలకు లబ్ధి చేకూరనుందన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు రూ.300 కోట్లు

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలని మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం మేరకు రాష్ట్రప్రభుత్వం రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు జారీ చేయనుంది. చిన్న మొత్తాల్లో పొదుపు చేసి నష్టపోయిన లక్షలాది మంది కోసం రూ.250 కోట్లు కేటాయించాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేయనున్న రూ.250 కోట్లుకి ఇప్పటికే డిపాజిటై ఉన్న రూ.50 కోట్లు కలిపి మొత్తం రూ.300 కోట్లను బాధితులకు చెల్లించనున్నారు. ఈ నిర్ణయాన్ని కోర్టు దృష్టికి తీసుకువెళ్లి, కోర్టు అనుమతి మేరకు బాధితులకు ప్రభుత్వం చెల్లించనుంది. ఈ విషయంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అభిప్రాయాన్ని తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా సోమవారం అసోసియేషన్ నాయకులతో చర్చించనుంది.

అర్చక స్వాముల పనేనా?

- గోవిందరాజస్వామి గుడిలో 3 కిరీటాల చోరీ
- సీసీ ఫుటేజీలో నిందితుడి గుర్తింపు

తిరుపతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భద్రతా సిబ్బంది నిర్లక్ష్యం, ఇంటి దొంగల సహకారంతోనే తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో మూడు చిన్న కిరీటాల చోరీ జరిగిందని అధికారులు నిర్ధారించారు. ఆ కిరీటాలను దొంగ జేబులో పెట్టుకుని పారిపోయినట్లు అనుమానిస్తున్నారు. ఆలయం నుంచి జేబులు తడుముకుంటూ పరుగున వెళ్తున్న ఒక అనుమానితుడిని సీసీటీవీ ఫుటేజీలో గుర్తించారు. చోరీకి గురైన కిరీటాల బరువు 1,351గ్రాములని, వాటి విలువ రూ.40 లక్షలు ఉంటుందని టీటీడీ అధికారులు తెలిపారు.

ఏం జరిగింది?

టీటీడీ నిర్వహణలో ఉన్న ప్రధాన ఆలయాల్లో తిరుపతి గోవిందరాజస్వామి గుడి ఒకటి. ఈ ఆలయ ప్రాంగణంలో సుమారు 18దాకా ఉపాలయాలున్నాయి. వాటిలో ఒకటైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు వినియోగించే మూడు బంగారు కిరీటాలు శనివారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయాయి. దీనిపై అర్చకులు సమాచారం ఇవ్వడంతో ఆలయాధికారులు రాత్రి 9.40 గంటలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అర్బన్ ఎస్పీ అన్బురాజన్, టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ గోపీనాథ్ జెట్టీ సారథ్యంలో వేర్వేరుగా దర్యాప్తు ప్రారంభమైంది. కేసు దర్యాప్తు కోసం 8 ప్రత్యేక బృందాలను ఎస్పీ ఏర్పాటు చేశారు. ఓ బృందం ఆలయ సిబ్బందిని విచారించే పనిలో నిమగ్నం కాగా మరోబృందం ఆలయంలో ఏర్పాటు చేసిన 13 సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించాయి. దీని ఆధారంగా ఆదివారం మధ్యాహ్నానికి నిందితుడిని గుర్తించారు. శనివారం సాయంత్రం 5.15గంటలకు నిందితుడిగా భావిస్తున్న వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించడం, 5.35కు హడావిడిగా బయటకు పోవడాన్ని గుర్తించారు. ఈ సమయంలో ఉత్సవ మూర్తుల వద్ద అర్చకులు, ఇతర సిబ్బంది లేకపోవడంతో సులువుగా చోరీ జరిగినట్టు భావిస్తున్నారు. సదరు వ్యక్తి కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. అయితే ఇప్పటికే ఆధారాలు లభించాయని రెండు మూడు రోజుల్లోనే నిందితులను పట్టుకుంటామని టీటీడీ ఈవో ఏకే సింఘాల్ చెప్పారు.

ఆలయ సిబ్బంది సహకారంతోనే...

కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉపాలయం వద్ద ముగ్గురు అర్చకులు విధులు నిర్వర్తిస్తారు. సాయంత్రం 5గంటలకు షిఫ్ట్ మారుతుంది. శనివారం సాయంత్రం 5గంటలకు విధులకు రావాల్సిన అర్చకుల్లో ఒకరు 5.10గంటలకు వచ్చారు. అతనికి విగ్రహాలను అప్పగించి అప్పటిదాకా ఉన్నవారు వెళ్లిపోయారు. బాధ్యత తీసుకున్న అర్చకుడు అక్కడ ఉండకుండా ఎటో వెళ్లిపోయారు. మరో అర్చకుడు 5.30కు డ్యూటీకి వచ్చారు. అతనూ ఉపాలయం వద్ద ఉండకుండా ఎదురుగా ఉన్న మరో ఆలయం వద్దకు వెళ్లిపోయారు. ఇక మూడో అర్చకుడు డ్యూటీకే రాలేదు. ఆయన గోదాదేవి ఉపాలయం వద్ద విధులు నిర్వర్తించినట్టు సమాచారం. రెండో అర్చకుడు ఎదురుగా ఉన్న ఉపాలయం వద్దకు వెళుతుండగా నిందితుడు లోనికి ప్రవేశిస్తున్న దృశ్యం సీసీ కెమెరాల్లో రికార్డైంది. నిందితునికి రెండో అర్చకుడు ఏవో సంజ్ఞలు చేసినట్టు గుర్తించారని, దీని ఆధారంగానే చోరీకి ఆలయ సిబ్బంది సహకారముందన్న నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం.



గోవిందరాజ స్వామి ఆలయం నుంచి పరుగున వెళ్తున్న అనుమానితుడి చిత్రం

లోకం తీరు



సారు అలవాటు కొద్ది రోజూ క్లాసులోకి వెళ్లేముందు, బయటికొచ్చేముందు ఇంకుపెట్టి పంపుతున్నారు..

చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
విశాఖపట్నం	16.4	31.0
హైదరాబాద్	16.9	29.4
కడప	18.0	34.0
గుంటూరు	18.3	31.3
విజయవాడ	19.0	30.0
నెల్లూరు	21.5	30.5

కొనసాగిన చలి

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తర కోస్తాలో చలి తీవ్రత కొనసాగింది. మధ్యభారతంలో నెలకొన్న చలి వాతావరణంతో అటు నుంచి పొడిగాలులు వీస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదుకావడంతో ఆ ప్రభావం ఉత్తరకోస్తా జిల్లాలపై చూపింది. ఆదివారం విశాఖ ఏజెన్సీలోని అరకులోయలో 11 డిగ్రీలు, చింతపల్లిలో 12 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మేఘాలు ఆవరించడంతో దక్షిణకోస్తా, రాయలసీమలో చలి తీవ్రత స్వల్పంగా తగ్గింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదయ్యాయి. రానున్న రెండు రోజులు ఉత్తర కోస్తాలో చలి ప్రభావం కొనసాగుతుందని, రాష్ట్రంలో మిగిలిన చోట్ల చెప్పుకోదగ్గ వాతావరణ మార్పులు ఉండవని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు.



ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

ఆరోగ్యమే మహాభాగ్యం. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఎవరూ ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో చిన్న వయసులోనే బీపీ, మధుమేహం, కేన్సర్, పక్షవాతం వంటి రోగాల బారిన పడుతున్నారు. కేన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే నయం చేయొచ్చు.

- త్రిదండి చినజీయర్‌స్వామి



ఆలయ రక్షకులకే ఓటేయాలి

ఆలయాలను కాపాడే పార్టీలనే వచ్చే ఎన్నికల్లో గెలిపించాలి. కులాలు, ప్రాంతాల వారీగా హిందువులను విభజిస్తున్న పాలకులకు బుద్ధి చెప్పాలి. వారి కబంధ హస్తాల నుంచి ఆలయాలకు విముక్తి కలిగించాలి. ఇందుకోసం ఐక్యంగా ఉద్యమించాలి. హిందువులు సహనంతో ఉన్నంత మాత్రాన చేతకానితనంగా భావించొద్దు.

- ఆధ్యాత్మికవేత్త కొండవీటి జ్యోతిర్మయి

నేటి పెట్రో ధరలు (లీ.)

పెట్రోల్ (విజయవాడలో)		డీజిల్	
పాత ధర	రూ. 74.47	పాత ధర	రూ. 70.50
కొత్త ధర	రూ. 74.32	కొత్త ధర	రూ. 70.39
తగ్గుదల: 15 పైసలు		తగ్గుదల: 11 పైసలు	

వ్యాయామంతో కొవ్వుకు చెక్!

హోస్టన్, ఫిబ్రవరి 3: శరీరంలో కొవ్వు పెరిగితే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. గుండెజబ్బులకు, షుగర్ వ్యాధికి దారితీస్తుంది. రోజూ వ్యాయామం చేయడం వల్ల అనారోగ్య హేతువైన విసెరల్ కొవ్వు మనకు తెలియకుండానే కరిగిపోతుందని, ఫలితంగా ఆరోగ్యంగా ఉండొచ్చని తాజా సర్వే వెల్లడించింది. యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ సౌత్‌వెస్ట్రన్ పరిశోధకులు చేసిన ఈ అధ్యయనాన్ని మాయో క్లినిక్ ప్రొసీడింగ్స్ అనే జర్నల్‌లో ప్రచురించారు. చాలా మంది పైకి కనిపించే కొవ్వును చూసి ఆందోళన చెందుతుంటారు. కానీ, అంతర్గతంగా విసెరల్ కొవ్వు చాలా ప్రమాదకరం. ఇదే కీలక అవయవాలను దెబ్బతీస్తుంది.

'నెమురీ' వల్లే నిద్ర!

వాషింగ్టన్, ఫిబ్రవరి 3: అలసిపోయినప్పుడు లేదా అనారోగ్యం పాలైనప్పుడు త్వరగా నిద్రలోకి జారుకుంటాం. ఇలా నిద్రలోకి తీసుకెళ్లే జన్యువును యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆ జన్యువును 'నెమురీ' అంటారన్నారు. ఈ వివరాలను సైన్స్ అనే జర్నల్‌లో ప్రచురించారు. సాధారణంగా అనారోగ్యంగా ఉన్నప్పుడు ఎక్కువగా నిద్ర వస్తుంది. దీంతో రోగ నిరోధక శక్తికి నిద్రకు సంబంధం ఉందని భావిస్తారు. కానీ, గాయమైన ప్రదేశంలో పరాధీయ బాగాల్లోని సూక్ష్మజీవులను నెమురీ చంపేస్తుంది. తద్వారా మెదడు నుంచి అందే సంకేతాలతో బాగా నిద్ర పడుతుందని పరిశోధకులు తెలిపారు.

పొరుగు పోలీసులతో సమన్వయం

- రేపు తిరుపతిలో 6 రాష్ట్రాల డీజీపీల భేటీ
- స్మగ్లింగ్ నిరోధం, నేరస్తుల కట్టడి, ఎన్నికలపై చర్చ

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తమిళనాడు, కర్ణాటక నుంచి ఎర్రచందనం స్మగ్లర్లు, ఒడిసా-ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు, తెలంగాణ నుంచి గంజాయి రవాణా, ఇతర నేరస్తులు వీటన్నింటి పరిష్కారానికి పోలీసులు ముందడుగు వేస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ సహా ఆరు రాష్ట్రాల డీజీపీలు మంగళవారం తిరుపతిలో సమావేశం అవుతున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి ఏపీలోకి వస్తున్న స్మగ్లర్లు, దొంగలు, ఇతర నేరగాళ్లను కట్టడి చేసే చర్యల్ని ఏపీ పోలీసులు ముమ్మరం చేశారు. వీటితోపాటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పొరుగు రాష్ట్రాలతో సమన్వయం చేసుకోవడం చాలాముఖ్యం. దీనిని దృష్టిలో ఉంచుకుని తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిసా రాష్ట్రాల డీజీపీలతో మాట్లాడిన డీజీపీ ఠాకూర్ వారితో భేటీ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పొరుగు రాష్ట్రాల నుంచి ఏపీకి కావాల్సిన సహాయ సహకారాలపై ఠాకూర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తారు. తమిళనాడు, కర్ణాటకలకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్లను అరికట్టడంలో ఆయా రాష్ట్రాల డీజీపీలతో.. గంజాయి స్మగ్లర్లు ఇతరత్రా నేరస్తుల విషయంలో తెలంగాణ డీజీపీని, మావోయిస్టుల విషయంలో ఛత్తీస్‌గఢ్, ఒడిసా పోలీ సు బాస్‌ల సహకారం కోరుతారు. అదేవిధంగా పొరు గు రాష్ట్రాల పోలీసులకు ఏపీ నుంచి ఎలాంటి సహకారం కావాలన్నా అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా సమాచారం పంచుకోవడం, బలగాలను పంపుకోవడం, డబ్బు సరఫరా లాంటి సమాచారాన్ని పసిగట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చిస్తారు.

బాలశాస్త్రవేత్తలకు ప్రోత్సాహం

- జిల్లాకు రూ.10 కోట్లు: మంత్రి గంటా

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైజ్ఞానిక ప్రదర్శన నుంచి జాతీయస్థాయికి ఎంపికయ్యే ప్రాజెక్టుకు అవసరమైన ఖర్చులు భరిస్తూ బాలశాస్త్రవేత్తలను ప్రోత్సహిస్తామని మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ మేరకు ఒక్కో జిల్లాకు రూ.10 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. విశాఖలో ఆదివారం రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్-విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను మంత్రి ప్రారంభించారు. 13 జిల్లాలకు చెందిన 545 మంది విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. అత్యధికంగా చిత్తూ రు జిల్లా నుంచి 170 ప్రాజెక్టులు, అత్యల్పంగా విజయనగరం జిల్లా నుంచి ఐదు ప్రాజెక్టులు వచ్చాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ విద్యారంగానికి ప్రభుత్వం రూ.25 వేల కోట్లు కేటాయించి అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున ఫలితాల్లో ఈ ఏడాది ప్రథమ స్థానంలో నిలవాలని పిలుపునిచ్చారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ డి.మధుసూదనరావు మాట్లాడుతూ, ఇన్‌స్పైర్ ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థి బ్యాంకు ఖాతాకు రూ.పది వేలు జమవుతాయన్నారు.

ఆడబిడ్డల జోలికొస్తే.. అణిచేస్తాం



- మానవ అక్రమ రవాణాపై పోలీసుల హెచ్చరిక
- ట్రాఫికింగ్ అడ్డుకట్టకు ప్రత్యేక దళాలు
- నేటి నుంచి నిపుణులతో ఏపీ పోలీసులకు శిక్షణ

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డల జోలికొస్తే అణచివేస్తామంటున్నారు ఏపీ పోలీసులు. ఏదో ఒక ఆశచూపి అబలను మోసం చేసినా, వారి శరీరాల్ని వ్యాపార వస్తువుగా మార్చి విక్రయించేందుకు ప్రయత్నించినా జీవితాంతం జైల్లోనే ఉండాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసిన పోలీసుశాఖ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేస్తోంది. మహిళల అక్రమ రవాణాను అడ్డుకోవడం నుంచి ఆయా కేసుల దర్యాప్తునకు ప్రత్యేక శిక్షణ ఇస్తోంది. బాధితురాలి కోణంలో కేసు దర్యాప్తు చేసి మానవ అక్రమ రవాణా ముఠాను కూకటి వేళ్లతో పెకిలించే కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టబోతోంది. దేశ, విదేశాల్లోని నిపుణులతో 13 జిల్లాల్లోని పోలీసుల (ఎస్‌ఐ నుంచి డీఎస్పీ)కు శిక్షణ ఇప్పించనుంది. మహిళా దినోత్సవం(మార్చి 8) నాటికి ప్రతి జిల్లాలోనూ మానవ అక్రమ రవాణా అడ్డుకట్టవేసే ప్రత్యేక పోలీసు అధికారులను నియమించనుంది.

ముందు 40 మంది.. తర్వాత మరో 200 మందికి శిక్షణ..

మానవ అక్రమ రవాణాలో ప్రధానంగా ఆరు విషయాల్ని గమనించిన పోలీస్ బాస్.. జిల్లాల్లో ఎక్కడికక్కడ పోలీసులకు ప్రజలకు అవగాహన కల్పించాలని నడుం బిగించారు. జిల్లాల వారీగా సబ్ ఇన్‌స్పెక్టర్ నుంచి డీఎస్పీ వరకూ 40మందిని ఎంపిక చేసి దేశంలోని పలు రాష్ట్రాల్లోని నిపుణులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. పలు కేసులను స్టడీ చేయడం, ముఠాల తీరుతెన్నులు ఎలా ఉంటాయి? ఏ విధంగా ట్రాప్ చేస్తారు.? దేశంలో ఎక్కడెక్కడ రెడ్‌లైట్ ఏరియాలున్నాయి.? వాటికి మన రాష్ట్రం నుంచి మహిళల్ని తరలిస్తున్న ముఠాలేవి? బాధితుల్ని ఎలా రక్షించాలి? ఇలా అన్ని కోణాల్లోనూ శిక్షణ ఇచ్చి బాధితుల కోణంలో కేసుల దర్యాప్తు చేయాలని ఆదేశించనున్నారు. ఆ తర్వాత ఈ మరో 200మందిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తారు. మొత్తం 240 మంది జిల్లాల్లోని పోలీసులకు అక్కడి ఎస్పీ కార్యాలయాల్లో, సబ్ డివిజన్లలో ట్రైనింగ్ ఇస్తారు. మార్చి 8 నాటికి ఈ ప్రక్రియ పూర్తిచేసి మహిళల అక్రమ రవాణా అరికట్టే ప్రత్యేక పోలీసు స్టేషన్లను జిల్లాల వారీగా ఏర్పాటు చేయాలన్నది డీజీపీ ఆలోచన. ఈ కార్యక్రమానికి ఫిబ్రవరి 4న మంగళగిరిలోని ఏపీ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో డీజీపీ ఆర్పీ ఠాకూర్ శ్రీకారం చుడుతున్నారు. అమెరికన్ కాన్సులేట్ జనరల్ కేథరిన్ బి హడ్డా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి నక్కా ఆనంద్ బాబు, ప్రజ్వల ఫౌండేషన్ నుంచి సునీతా కృష్ణన్‌తోపాటు ఇతర రాష్ట్రాలకు చెందిన నిపుణులు హాజరవుతున్నారని ట్రైనింగ్ ఐజీ సంజయ్ తెలిపారు.

డీజీపీ చొరవతో...

ఉత్తరాంధ్రలో పేదరికం, కోస్తాలో మాయమాటలు, రాయలసీమలో కరువు.. ఆయుధం ఏదైతేనేం.. కొన్ని ముఠాలు బాలికలు, యువతులు, మహిళల్ని వ్యభిచార కూపాలకు తరలిస్తున్నాయి. మానవ అక్రమ రవాణా అరికట్టడంతోపాటు ఇతర రాష్ట్రాల్లోని వ్యభిచార కేంద్రాలపై దాడులు చేపట్టి బాధితుల్ని రక్షించేందుకు ఏపీ పోలీసుశాఖ సీఐడీలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. కానీ ఇలాంటి ముఠాలకు ముకుతాడు వేసేందుకు అవసరమైన సిబ్బంది సీఐడీలో లేకపోవడాన్ని గమనించిన డీజీపీ ఆర్పీ ఠాకూర్.. సివిల్ పోలీసుల్ని, స్వచ్ఛంద సంస్థల్ని భాగస్వాముల్ని చేయాలని రెండు నెలల క్రితం నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ప్రజ్వల లాంటి సంస్థలతో చర్చించి మానవ అక్రమ రవాణా అరికట్టేందుకు నిపుణులతో కలిసి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు.



వైభవంగా కొండపల్లి ఉత్సవాలు ప్రారంభం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 3: కొండపల్లి ఖిల్లా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఖిల్లా ప్రాశస్త్యాన్ని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో పవిత్ర సంగమం, కొండపల్లి కోటలో ప్రభుత్వం రెండురోజుల పాటు నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను ఆదివారం మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. గత కొద్ది నెలలుగా రూ. 10కోట్ల వ్యయంతో కోట పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఇవి పూర్తి కావడంతో కోట కొత్త అందాలతో దర్శనమిచ్చింది. రాజుల చిత్రాలు, పురాతన శిల్పాలు, ప్రత్యేక యాప్ ద్వారా బొమ్మలు మాట్లాడేలా చేసిన ఏర్పాట్లకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పవిత్రసంగమంలో చేపట్టిన పలు కార్యక్రమాలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి.

9, 10 తేదీల్లో ఘనంగా గండికోట ఉత్సవాలు

కడప (కలెక్టరేట్), ఫిబ్రవరి 3: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సాంస్కృతిక, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఈ నెల 9, 10 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా గండికోట ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కడప జిల్లా కలెక్టర్ హరికిరణ్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సాహసం కలగలిసిన అంశాలతో ఈ దఫా గండికోట ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ఏ ముఖం పెట్టుకుని వస్తారు?: మోదీపై మంత్రులు ఫైర్

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలా అన్యాయం, మోసం చేసిందని మంత్రి గంటా శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం విశాఖలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఏ ముఖం పెట్టుకుని రాష్ట్ర పర్యటనకు వస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మోదీ పాలన కన్నా గ్రామస్థాయిలో సర్పంచ్ పాలన నయమని మంత్రి ఫరూక్ అన్నారు. కర్నూలు జిల్లా గోస్పాడు మండలం యాళ్లూరులో ఆదివారం మంత్రి మాట్లాడుతూ.. అమరావతి శంకుస్థాపనకు వచ్చిన ప్రధాని చెంబు నీళ్లు, గుప్పెడు మట్టి మాత్రమే ఇచ్చివెళ్లారని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు డ్రామాలాడుతున్నారని మంత్రి సునీత ఆరోపించారు. అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలం తోపుదుర్తిలో ఆదివారం పసుపు-కుంకుమ చెక్కులు పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

మోదీని అడ్డుకుంటాం: సీపీఐ

ఒంగోలు, నెల్లూరు, ఫిబ్రవరి 3: రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ గుంటూరు పర్యటనను అడ్డుకుంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హెచ్చరించారు. రాజధానికి భూమి పూజ సమయంలో మట్టి తీసుకువచ్చి ఖాళీ ముంతలు ఇచ్చిన ఆయన ముఖాన ఖాళీ కుండలు కొడతామన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆదివారం రామకృష్ణ విలేకరులతో మాట్లాడారు. విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీల్లో ఒక్కదానిపై కూడా కేంద్రం స్పందించలేదన్నారు. బస్సు యాత్ర చేపట్టిన బీజేపీ నాయకులకు... ప్రజలకు ఏం చెప్పాలో తెలియని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మోదీ ఎక్కడ పర్యటించినా అడ్డుకుంటామన్నారు. ఈ నెల 10న గుంటూరులో ఖాళీ కుండలతో ఆందోళన చేపడతామన్నారు.

కొలనుభారతి ఆలయ నిర్మాణంలో జాప్యం

విజయవాడ(గుణదల), ఫిబ్రవరి 3: కర్నూలు జిల్లాలోని కొలనుభారతి అమ్మవారి ఆలయ నిర్మాణంలో జాప్యం వహించడం భావ్యం కాదని అరుణాచల అన్నపూర్ణ ఆశ్రమ పీఠాధిపతి శివానందలహరి స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విజయవాడలో మాట్లాడుతూ.. తెలంగాణలో బాసర తరహాలో కొలనుభారతి ఆలయాన్ని పర్యాటక ప్రాంతం గాను ఆధ్యాత్మిక ప్రదేశంగాను తీర్చిదిద్దాల్సిన బాధ్యత దేవదాయ శాఖపై ఉందన్నారు. దీనిపై 2017 ఆగస్టు 30న సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చామన్నారు. ఆ తర్వాత ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించిన కొద్దిరోజులకే నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా శివపురం గ్రామంలో స్వయంభువుగా పుస్తకధారిణి రూపంలో వెలసిన సరస్వతి అమ్మవారి విగ్రహం, శ్రీచక్రాన్ని జగద్గురువులు ఆదిశంకరులు పునః ప్రతిష్ఠ చేశారని తెలిపారు.

విద్యుదాఘాతంతో నలుగురి దుర్మరణం

శ్రీకాకుళం (ఆంధ్రజ్యోతి)/లావేరు, ఫిబ్రవరి 03: నిశ్చితార్థం వేడుక కోసం అరటి గెలలు తెచ్చేందుకు తోటకు వెళ్లిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురు విద్యుదాఘాతానికి బలయ్యారు. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలంలో ఈ విషాదం జరిగింది. మండలంలోని పాతరౌతుపేట గ్రామానికి చెందిన కొమ్ము వెంకన్న(49) కుమారుడు శ్రీనుకు ఈ నెల 6న నిశ్చితార్థం జరగాల్సి ఉంది. ఈ వేడుకకు అరటి గెలలు అవసరమయ్యాయి. ఆదివారం ఉదయం కొత్తరౌతుపేటలో ఉన్న తన బావమరిది ఆబోతుల రాములు (57)కు చెందిన అరటితోటకు బావ, బావమరిది కలిసివెళ్లారు. అక్కడి చెట్లకు హెచ్‌టీ విద్యుత్ తీగలు తగులుతున్న విషయాన్ని గమనించని రాములు, వెంకన్న గెలను కోస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందారు. ఉదయం వెళ్లినవారు ఎంతకూ రాకపోవడంతో రాములు భార్య పుణ్యవతి(53), వెంకన్నకు వరసకు సోదరి అయిన రౌతు బంగారమ్మ(52) తోటకు వెళ్లారు. అక్కడ పడున్నవారిని పట్టుకోవడంతో పుణ్యవతి, బంగారమ్మ ఇద్దరూ షాక్‌కు గురై మృతిచెందారు.

క్షత్రియుల సంక్షేమానికి 50 కోట్లు!

- శంఖారావం సభలో ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ వెల్లడి



క్షత్రియ శంఖారావంలో నేతల అభివాదం

విజయవాడ (అజిత్‌సింగ్ నగర్), ఫిబ్రవరి 3: క్షత్రియుల సంక్షేమం, అభివృద్ధికి ఏటా రూ.50 కోట్లు కేటాయించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సుముఖత వ్యక్తం చేశారని ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ లోగా ఐదేళ్ల పాటు ఎడాదికి రూ.50 కోట్లు ఇచ్చేదిశగా త్వరలోనే ప్రభుత్వం జీవో విడుదల చేయనుందని ఆయన ప్రకటించారు. క్షత్రియ కార్పొరేషన్ సాధన డిమాండ్‌తో విజయవాడలో ఆదివారం క్షత్రియ శంఖారావం బహిరంగ సభ జరిగింది. సభకు ప్రభుత్వ ప్రతినిధిగా విచ్చేసిన జనార్దన్ మాట్లాడుతూ దేశచరిత్రలో క్షత్రియుల స్థానం ప్రత్యేకమన్నారు. సేవాగుణంలో క్షత్రియుల పాత్ర ఆమోఘమని, రాష్ట్రవ్యాప్తంగా అనేక ట్రస్టులు పేదలకు విద్య, వైద్యం,మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నాయని తెలిపారు. అటువంటి క్షత్రియుల్లో అనేకమంది పేదరికంలో మగ్గుతునారని, వారి సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని క్షత్రియ కార్పొరేషన్ సాధన సమితి ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబును కోరడంతో సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. నరసాపురం ఎంపీ గోకరాజు గంగరాజు క్షత్రియ ఫెడరేషన్‌కు ఏటా రూ. కోటి అందజేయనున్నట్లు ప్రకటించారు. రాజధాని అమరావతి నగరంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్మృతివనం ఏర్పాటు చేయాలని, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాకు అల్లూరి పేరుపెట్టాలన్న ప్రతిపాదనలను ప్రభుత్వ ప్రతినిధి జనార్దన్ దృష్టికి క్షత్రియ ప్రతినిధులు తీసుకువెళ్లారు.



సభలో మాట్లాడుతున్న వసుధ

ముగిసిన ప్రరవే వేడుకలు

- బాధిత గిరిజనులే కథానాయికలు
- వాకపల్లి ఘటనపై ప్రముఖ న్యాయవాది వసుధ

విశాఖపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వాకపల్లి ఘటనలో బాధిత గిరిజన మహిళలే అసలైన కథానాయికలని ప్రముఖ న్యాయవాది వసుధ అన్నారు. ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక (ప్రరవే) పదేళ్ల వేడుకలకు ఆమె గౌరవ అతిథిగా హాజరై మాట్లాడారు. ఏయూలోని యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సెమినార్ హాలులో రెండు రోజులపాటు నిర్వహించిన ఈ వేడుకలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2007లో జరిగిన ఈ ఘటనపై ఎట్టకేలకు మంగళవారం నుంచి విచారణ జరగబోతుండడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. ఈ కేసులో ఎందరో సహకారం అందించబట్టే ఇప్పటి వరకు పోరాడగలిగామని తెలిపారు. ముఖ్యఅతిథి కుప్పిలి పద్మ మాట్లాడుతూ, భయం ఒక్కటే అందరి మదిలో నిండుకున్న సమాజంలో ఇన్నేళ్ల ప్రరవే ప్రయాణం గొప్ప విజయంగా అభివర్ణించారు. సమాజంలో అన్ని వ్యవస్థలు పొరలుపొరలుగా విడిపోతున్న తరుణంలో సాహిత్య సంస్థ అందరినీ అక్కున చేర్చుకోవడం అభినందనీయమన్నారు. రెండవ రోజు ఉదయం నిర్వహించిన తొలి సమావేశానికి పి.రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. ప్రరవే పదేళ్ల ప్రయాణం-మరో పదేళ్ల ప్రణాళికపై అంతా కలిసి చర్చించారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న రచయిత గౌరునాయుడు మాట్లాడుతూ ప్రరవే అందరికీ తెలిసేలా శాఖోపశాఖలుగా అన్ని ప్రాంతాల్లో విస్తరించాలని కోరారు. ముగింపు సమావేశానికి కాత్యాయనీ విద్మహే అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చింగారి అనే పుస్తకాన్ని కృష్ణజ్యోతి ఆవిష్కరించారు. వాసిరెడ్డి నవీన్ పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు రజత, మల్లీశ్వరి కృతజ్ఞతలు తెలిపారు.



పోలవరం కిటకిట

పోలవరం, ఫిబ్రవరి 3: పోలవరం ప్రాజెక్టు సందర్శనకు ప్రజలు ఆదివారం రికార్డుస్థాయిలో పోటెత్తారు. ఆదివారం ఒక్క రోజే 22,130 మంది 424 బస్సులు, 75 కార్లలో వచ్చారు. వీరిలో ప్రకాశం జిల్లా నుంచి 4,927 మంది, పశ్చిమ గోదావరి నుంచి 6,491 మంది, తూర్పు గోదావరి నుంచి 3,283 మంది, గుంటూరు జిల్లా నుంచి 1,429 మంది, విశాఖ నుంచి 1,008 మంది, కృష్ణా జిల్లా నుంచి 4,758 మంది, నెల్లూరు నుంచి 234 మంది వచ్చారు. 2018 ఏప్రిల్ 23న ప్రారంభమైన పోలవరం సందర్శన యాత్ర ఆదివారం నాటికి 286 రోజులు పూర్తి చేసుకుంది. ఇప్పటి వరకు మొత్తం 6,70,134 మంది పోలవరాన్ని సందర్శించినట్టు అధికారికంగా ప్రకటించారు.

'సహాయ ప్రొఫెసర్' అభ్యర్థుల పోరుబాట

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): గతేడాది నిర్వహించిన సహాయ ప్రొఫెసర్ పోస్టుల స్ర్కీనింగ్ టెస్టులో అర్హత సాధించిన అభ్యర్థులకు వెంటనే ఇంటర్వ్యూలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆయా అభ్యర్థులు పోరు బాటపడుతున్నారు. సోమ, మంగళవారాల్లో విజయవాడలో నిరసనకు దిగుతున్నట్టు అర్హత సాధించిన అభ్యర్థుల సంఘం కన్వీనర్ విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్వీయూ కొత్త వీసీగా రాజేంద్రప్రసాద్

తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వీసీగా వీవీఎన్ రాజేంద్రప్రసాద్ నియమితులయ్యారు. ఎస్వీయూ వీసీగా ఆయన మూడేళ్లు పనిచేయనున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యా ముఖ్య కార్యదర్శి కె. దమయంతి ఉత్తర్వులు జారీ చేశారు.

సైనిక్ స్కూల్ ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదల

కలికిరి, ఫిబ్రవరి 3: కలికిరి సైనిక పాఠశాలలో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షా ఫలితాలను ఆదివారం విడుదల చేశారు. 2019-20 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో 70 సీట్లు, తొమ్మిదవ తరగతిలో 8 సీట్లు భర్తీ చేయడానికి జనవరి 6వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించారు.

17న తిరుపతిలో ఏపీటీఎస్‌ఏ కార్యవర్గ ఎన్నికలు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 3: ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలను ఈ నెల 17న ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్ర అధ్యక్షుడు, అసోసియేట్ ప్రెసిడెంట్, ట్రెజరర్, జనరల్ సెక్రటరీ, ఏడుగురు వైస్ ప్రెసిడెంట్‌లు, 8 మంది సెక్రటరీలు, ఏడుగురు ఈసీ సభ్యుల పోస్టులకు ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల పరిశీలకుడు వెంగళ్ రెడ్డి ఆదివారం కర్నూలులో చెప్పారు.

19న మాలమహానాడు బహిరంగ సభ

విజయవాడ (గవర్నర్‌పేట), ఫిబ్రవరి 3: ఫిబ్రవరి 19న అమరావతిలో మాల మహానాడు భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మాదిగ సోదరులను మరోసారి మోసం చేయడానికి ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇక్కడి మాదిగలను మోసం చేసేందుకు విశ్వరూప సభ పేరుతో సభ ఎట్టేందుకు యత్నించడం సరికాదన్నారు. మాలల సత్తా చూపేందుకు ఈనెల 19న అమరావతిలో లక్షలాది మందితో సభ జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడు పిల్లా కన్నుమూత

విశాఖపట్నం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖుడు పిల్లా రామారావు(95) ఆదివారం కన్నుమూశారు. మహాత్మా గాంధీ పిలుపుమేరకు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్లారు. తర్వాత ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరి నాగపూర్‌లో శిక్షణ పొందారు. 1942లో విశాఖ నగరంలో ఆర్‌ఎస్‌ఎస్ శాఖను ప్రారంభించారు. విజయనగరం మహారాజ కళాశాలలో బీఎస్సీ, ఏయూలో ఎమ్మెస్సీ పూర్తిచేశాక 1946లో ఏవీఎన్‌లో డెమాన్‌స్ట్రేటర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. 1955లో అక్కడే ఫిజిక్స్ లెక్చరర్‌గా చేరారు. ఓ వైపు ఉద్యోగం చేస్తూనే 1957లో ఆర్‌ఎస్‌ఎస్ సూచన మేరకు భారత్ ట్యుటోరియల్స్ ప్రారంభించారు. అక్కడే భారతీయ విద్యా కేంద్రం(బీవీకే) ఏర్పాటు చేశారు.

అంతర్జాతీయస్థాయికి మన విద్య

- రూసా 2.0 లక్ష్యమిదే
- విద్యార్థులకు ప్రధాని సందేశం
- కశ్మీర్ నుంచి రిమోట్‌తో.. థెరిసా కెరీర్‌హబ్‌ను ప్రారంభం
- యానాంలో ఇంజనీరింగ్ కాలేజీకి శంకుస్థాపన



ఆన్‌లైన్‌లో యానాం కాలేజీకి శంకుస్థాపన చేస్తున్న ప్రధాని

ఏలూరు/యానాం, ఫిబ్రవరి 3: అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా విద్యను అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా 2.0), ఏపీ ఉన్నత విద్యాశాఖల సౌజన్యంతో రూ.5 కోట్ల వ్యయంతో ఏలూరులోని సెయింట్ థెరిసా మహిళా కళాశాలలో 'ఎంట్రప్రెన్యూర్‌షిప్ అండ్ కెరీర్‌హబ్'ను నెలకొల్పారు. దీనిని జమ్ముకశ్మీర్ రాజధాని శ్రీనగర్ నుంచి రిమోట్ సాయంతో ప్రధాని ఆదివారం ప్రారంభించారు. థెరిసా కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన భారీ ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై ప్రధాని ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తూ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశవ్యాప్తంగా 151 వర్సిటీలు, కళాశాలలు, మోడల్ డిగ్రీ కళాశాలలను ప్రధాని ఏకాలంలో రిమోట్ ద్వారా ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం తెలంగాణ, అసోం, హరియాణ, ఒడిసా, గుజరాత్ రాష్ట్రాల విద్యార్థులతో మాట్లాడారు. కాగా, కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలోని గిరియాంపేటలో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణానికి ప్రధాని ఆదివారం డిజిటల్ శంకుస్థాపన చేశారు. పరిపాలనాధికారి దవులూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పుదుచ్చేరి సీఎం నారాయణస్వామి, ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు హాజరయ్యారు.

రైలులో గర్భిణి ప్రసవ వేదన


హాల్టింగ్ లేని స్టేషన్లో రైలు నిలుపుదల.. టీటీఐ సమయస్ఫూర్తితో తల్లీబిడ్డ క్షేమం



ఎలమంచిలి పీహెచ్‌సీలో తల్లీబిడ్డ

విజయవాడ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణిస్తున్న గర్భిణిపట్ల ఓ టీటీఐ మానతా దృక్పథంతో వ్యవహరించడంతో ఆమెతోపాటు పుట్టిన బిడ్డకు ప్రాణాపాయం తప్పింది. హాల్టింగ్ లేని స్టేషన్లో రైలు నిలిపేలా చొరవతీసుకోవడంతో ఇది సాధ్యమైంది. వివరాలివీ.. బిహార్ రాష్ట్రం జమాల్‌పూర్‌కు చెందిన అనిరుధ్ సహని బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఇతనికి భార్య స్వప్నాదేవి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. స్వప్నాదేవి(24) గర్భవతి. మార్చిలో ప్రసవం జరుగుతుందని వైద్యులు చెప్పడంతో శనివారం భార్య, ఇద్దరు పిల్లలను సొంతూరు పంపడానికి యశ్వంత్‌పూర్-బాగల్‌పూర్ 'అంగ ఎక్స్‌ప్రెస్ రిజర్వేషన్ బీ-2(ఏసీ కోచ్)లో ఎక్కించారు. తోడుగా పెద్దవారెవరూ లేరు. రైలు విజయవాడ దాటిన తర్వాత ఆమెకు పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. టీటీఐ సనత్ స్పందించి తొలుత తుని స్టేషన్‌లో ఆమెను దించేందుకు విజయవాడలోని కమర్షియల్ కంట్రోల్ విభాగాన్ని సంప్రదించారు. ఆయన మాట్లాడుతుండగానే.. రైలు తుని దాటిపోయింది. తర్వాత విశాఖపట్నం స్టేషన్‌లో ఆమెకు వైద్యసేవలు అందేలా చూడాలని కంట్రోలర్లకు వివరించారు. ఈలోపే సప్నాదేవికి నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో విశాఖకు వంద కిలోమీటర్లు ముందుగా ఉన్న ఎలమంచిలి స్టేషన్‌లో 'అంగ ఎక్స్‌ప్రెస్‌ను ఆపాలని, 108ను సిద్ధంగా ఉండాలని అధికారులను కోరి ఒప్పించారు. కానీ యలమంచిలిలో ఈ రైలుకు హాల్టింగ్ లేదు. అయినా కంట్రోలర్లు సహకరించి ఆ లైన్‌లో వచ్చే రైళ్లను క్రమబద్ధీకరించారు. అయితే రైలు స్టేషన్‌కు సమీస్తుండగానే ఆమెకు పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. స్టేషన్‌కు రైలు చేరుకోవడం.. సప్నాదేవికి ప్రసవం కావడం ఒకేసారి జరిగిపోయాయి. సిద్ధంగా ఉన్న 108 సిబ్బంది తల్లీబిడ్డలిద్దరికీ ప్రాథమిక వైద్యం అందించి, అనంతరం ఎలమంచిలి పీహెచ్‌సీకి తరలించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి రెండు నిండు ప్రాణాలను కాపాడిన సనత్‌ను విజయవాడ డీఆర్‌ఎం ధనుంజయులు, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ .భాస్కరరెడ్డి ప్రశంసించారు.

వివిధ
సాహిత్య వేదిక vividha@andhrajyothy.com



బంగారు కాగితం
కావాల్సిన కవిత్వం!

తెలుగు సాహిత్య ప్రపంచానికి ఆట్టే తెలియని కవి పల్లవ హనుమయ్య. అతడొక మహాస్రష్ట, ప్రవక్త కూడా! అద్భుతమైన శైలీ శిల్పంతో మిరుమిట్లు గొలిపే భావ సంచలనం అతని కవిత్వం.

ఎప్పుడో 1970వ దశకంలో అతను వెలువరించిన 'విభావరి' కవితా సంపుటి ఇవాళ్టికి కూడా నవనవోన్మేషంగా ఉంటుంది. అతని కవిత్వంలోని ఫ్రెష్‌నెస్‌కి కారణం- నిజాయితీ! ఏది రాసినా తాను అనుభవించి పలవరించే రాశాడు. అతని జీవితమే కవిత్వానికి నేపథ్యంగా నిలిచింది.

హనుమయ్య వైయక్తిక కవే కాదు, సామాజికుడు కూడా! తన వేదననే కాక ప్రపంచపు పరివేదననికూడా అక్షరీకరించాడు. తన తొలి కవితా సంపుటికి 'విభావరి' అని పేరు పెట్టాడు. విభావరి అంటే ఒకానొక చీకటిరాత్రో లేదా ఆవిష్కృతమైన ఒకానొక స్త్రీమూర్తి అంతరంగమో కావచ్చు! పుస్తకం పైని ముఖచిత్రం కూడా అదే సూచిస్తుంది.

ఒక చోట 'చీకటి' గురించి ఇలా అంటాడు-

"చీకటంటే భయపడకు
అది నల్ల ద్రాక్షల గెల
సత్తువ కొద్దీ పిండితే
ఎట్టని రుధిరం కక్కుతుంది
అదే మజాగా ఉండే మదిర
దేవుడాకాశాన ఎక్కుపెట్టే
ఇంద్రధనస్సు
రంగురంగుల సంధ్యలు,
చుక్కలు!"

మరో కవితలో స్త్రీ మూర్తి గురించి ఇలా అంటాడు: "సముద్రమంత అనురాగాన్ని/ సహజ క్షణిక లజ్జారుణి మంగ/ బుగ్గల్లో చూపే ముగ్ధ/ నా మార్గోపదేశిక"

కటిక దారిద్ర్యం, ఆకలి కేకలు, నిరుద్యోగం ప్రబలిన 1970 దశకం నాటి కల్లోల ప్రపంచానికి చెందిన కవి హనుమయ్య. 1968లో పారిస్‌లోని సోర్బాన్ యూనివర్శిటీ విద్యార్థుల ఉద్యమం ప్రకంపనలు ప్రపంచమంతటా ధ్వనించాయి. మన దేశంలోనూ! ఆనాటి సంక్షోభాన్ని సమర్థంగా చిత్రించాడు హనుమయ్య: "గుడిసెలో దురదృష్టం వేసిన/... అభాగ్యులు/ నా కవిత్వం నిండా ఉంటారు/ వారు మనస్సు విప్పి నాతో మాటాడుతారు/ ఆహ్వానించకుండా ఎలా ఉండగలుగుతాను."

కించిత్ దుఃఖం కించిత్ ఆవేశం కలగలిసిన ఉన్మత్త గీతం హనుమయ్య కవిత్వం. తన 'విభావరి'లోని కవితల్ని 'అనిబద్ధ కవితా ఖండికలు' అన్నాడు. ఈ కవితలకి క్రమం సంఖ్యలే కానీ శీర్షికలు లేవు. మొత్తం 80 ఖండికలు! బహుశా తన కవిత్వం ఛందోబద్ధం కాదనీ, అలాగే ఏదో ఒక వాదానికి పరిమితం కాదనే అర్థంలో 'అనిబద్ధ' అనే పదాన్ని ప్రయోగించాడేమో తెలియదు.

హనుమయ్య శబ్దాన్ని పూలూ లతలుగా తీర్చిదిద్దాడు. అతి క్లిష్టమైన సంస్కృత పదాలు కూడా అతని కవిత్వంలో సహజంగా ఒదిగిపోయాయి. ప్రతి కవితని కొసమెరుపుతో ముక్తాయిస్తాడు: "కవి తాను పాడడు/ తన అంతరంగాన్ని పాడనిస్తాడు." ద్రష్ట కానివాడు స్రష్ట కాలేడు. హనుమయ్య దార్శనికతకి దర్పణం ఈ కవిత:

"జీవితానికి జీవులంటే
ప్రయోజనాతీతమైన ఇష్టాగోష్టి
అయినా
పసిపిల్లలకు పాలివ్వాలని
రసలుబ్ధులకు పానకం పోయాలని
భయస్తులకు బ్రాందీ తాపాలని
సోక్రటీస్‌ను మాత్రమే
విష పాత్రికతో సవాలు చేయాలని
దానికి తెలుసు."



పల్లవ హనుమయ్య 'విభావరి' కవితా సంపుటికి ముందుమాట రాసిన వావిలాల సుబ్బారావు గారు- "ఈ కవిత్వం కాగితాల మీదనే అచ్చైనందుకు సిగ్గుపడుతున్నాను... 'ప్రవచించిన మహాసూక్తుల్ని శ్రోతలకందకుండా నిబిడి నిస్తబ్ధత కబళించకపోతే...' భవిష్యత్తు వీటి అచ్చుకోసం బంగారు కాగితాన్ని తయారు చేస్తుంది" అన్నారు.

హనుమయ్య తోటి మనుష్యుల పట్లనే కాదు, సకల జీవులపట్ల ప్రేమని ప్రకటిస్తాడు: "ఆపళంగా చేతుల్లోకి ఎత్తుకొని/ వెచ్చని కన్నీళ్ళలో స్నానమాడిద్దామనుకున్నాను/ 'ఛీ! గజ్జికుక్క' అని మా ఆవిడ/ ఇంటిగుమ్మంలోంచి అరిచింది/ బెదరి తోకముడుచుకుని/ చొట్ట కాలీడ్చుకుంటూ/ ఆ చిన్ని కుక్కపిల్ల వెళ్ళిపోయింది/ జాలిగొలిపే ఆ చిన్ని కళ్ళు మాత్రం వెళ్ళిపోలేదు."

పడుపు వృత్తిలో ఉన్న స్త్రీ గురించి ఇలా అంటాడు: "మగవాడి కామజ్వరానికి/ స్వీయమాంస లావణ్య ఔషదాన్నిచ్చే/ వైద్యురాలై/ పొట్టపోసుకునే పడుపుగత్తె మాత్రమే/ నిజమైన ప్రేమను నిర్వచింపగలదేమో."

చిన్న చిన్న వాక్యాలతోనే అతను మనల్ని తన వశం చేసుకుంటాడు. సునిశిత శైలీ, సూదంటురాయిలాంటి శిల్పంతో పాఠకుల్ని ఆకట్టుకుంటాడు. మచ్చుకు కొన్ని:

◆ "రాతి మీద శిల్పి పువ్వును చెక్కితే/ అది పువ్వా? రాయా?/ ....ఈ రెంటిలో ఏమైనా/ తనని తాను దాటిపోలేని/ బంధితుడే శిల్పి."

◆ "బజార్లలో కన్పించే/ లక్షలాది ఆకలి డొక్కలు/ అన్నం తినేటప్పుడు కళ్ళెదుట నిలుస్తై;/ ప్రతిముద్ద భ్రాతృ ద్రోహం లాగు/ గొంతు పట్టుకుంటుంది"

◆ "నిన్నందుకోవడానికి ప్రతిక్షణం/ ఉత్తమ జన్మలెత్తుతాను./ నిన్ననుసరించడానికి/ వెలుగు నీడల ప్రహరీలు కూడా/ దూకి వస్తాను."

◆ "ఆకాశమంత మనిషిని ఆరడుగుల శరీరంలోకి/ ప్రకృతో పరమాత్మో/ మడిచి పెట్టింది"

'విభావరి'లో ఇలా విభ్రమపరిచే వాక్యాలెన్నో!

హనుమయ్య అక్షరాల్ని మంత్రించి కవిత్వాన్ని వినిర్మిస్తాడేమో. తన కవిత్వంతో విధ్వంసాన్ని సృష్టిస్తాడు. తనదైన అసంబద్ధ జీవితంలోకి మన చేయిపట్టి లాక్కుపోతాడు.

హనుమయ్య ఏకకాలంలో ఒక అరాచక వాదిలా, మహాతాత్వికుడిలా కూడా గోచరిస్తాడు: "బజార్లలో మోగే తప్పెట్లకు కాళ్ళై/ చిందులు తొక్కుతా/ ఊరేగింపుల్లో పడి వెర్రికేకలు వేస్తా/...నిద్రబిళ్ళలు మూడో నాలుగో/ మింగేస్తా;/ మరునాటి సూర్యుని బతుకు/ నాలుగోవంతు తెల్లారింతర్వాత/ నీరసంగా కళ్ళు తెరిచి నింగిని, నేలను చూస్తా/ ఏవేవో దారుల మీద ఎక్కి నడుస్తా/ Lo! All roads lead to Rome;/ ఏ దారిన నడచినా కొంతసేపటికి/ భయానకంగా ఉండే ఆ/ అగాధపుటొడ్డు రానే వస్తుంది."

"కబీరులు, ఖగావాలు పస్తులు పడి ఉండే/ పూరి గుడిసెల ముంగిళ్ళలో/ జీవితాన్ని ముష్టి అడుక్కోవడానికి/ అభ్యాగతినై నిలుస్తా."

ఈ కవితా సంపుటికి 'ముందుమాటలు' రాసిన వాళ్ళల్లో ఒకరైన వావిలాల సుబ్బారావు గారు- "ఈ కవిత్వం కాగితాల మీదనే అచ్చైనందుకు సిగ్గుపడుతున్నాను... 'ప్రవచించిన మహాసూక్తుల్ని శ్రోతలకందకుండా నిబిడి నిస్తబ్ధత కబళించకపోతే...' భవిష్యత్తు వీటి అచ్చుకోసం బంగారు కాగితాన్ని తయారు చేస్తుంది" అన్నారు. ఈ వాక్యాలు నిజం. అందుకు విభావరి లోని ప్రతి ఒక కవితా ఖండిక నిదర్శనం!



■ రవూఫ్
98490 41167

విజేత

ఏడ్పుతోనే మనిషి జననం నవ్వులను విరజిమ్ము ఎవడో
జీవితం పండించుకున్న విజేత వాడే నేస్తమా!

పరుల బాధలుపెట్టి సుఖపడు బ్రతుకు తనను శపించదా
ప్రేమతో హృదయాలు గెలిచిన గగనమే తల వంచదా
తారకలతో మధుర జీవన గీతి ఎవడు లిఖించునో
జీవితం పండించుకున్న విజేత వాడే నేస్తమా!

ప్రాణమన్నది పోవునప్పుడు చెప్పనైనా చెప్పదు
మృత్యువే గారాల ప్రియుడని పెదవి ఎప్పుడు విప్పదు
చావు పిమ్మట బ్రతుకు వెన్నెల వెలుగు పంచే దెవ్వడో
జీవితం పండించుకున్న విజేత వాడే నేస్తమా!

ప్రపంచాన దరిద్ర పీడిత జనులకిది పరిహాసమే
ఒప్పుకుంటా అడుగడుగునా అశ్రువుల దరహాసమే
బాధలను సంగీత స్వరముల పాడుకొను వాడెవ్వడో
జీవితం పండించుకున్న విజేత వాడే నేస్తమా!

ఏడ్పుతో మానవుడి జననం నవ్వులను రువ్వేది ఎవడో
జీవితం పండించుకున్న విజేత వాడే నేస్తమా!

ఉర్దూమూలం ■ అన్‌జాన్
స్వేచ్ఛానుసరణ ■ మహాస్వప్న

పచ్చిపూలు - అత్తరు



ఎవరూ లేని ఏకాంతంలో
పెళ్ళి ఆల్బమ్ తెరిచాం
మా ఆవిడా నేనూ

నదిలోని అలల్లా
ఒక్కొక్క పుటా కదులుతుంటే
జ్ఞాపకాల పడవలో ఉయ్యాలలూగాం

మేం పెద్దవాళ్ళం అయిపోయాం
ఫొటోల్లోని పిల్లల్లో కొందరు పెళ్ళీడుకొచ్చేశారు

ఆల్బమ్‌లో మొదటి ఫొటో తీసేసి
మా అబ్బాయిది పెట్టాలని
ఇద్దరికీ అనిపించింది

ఫొటోల్లో ఒత్తుగా ఉన్న నా జుట్టునీ
నాజూగ్గా ఉన్న నా శరీరాన్నీ
ఆపేక్షగా తడిమిందామె

నాకెలాంటి ఆక్షేపణలూ లేవు

తను ఏం కోల్పోయిందో అదంతా
గిఫ్ట్‌ని ప్యాక్ చేసే రేపర్‌లా చుట్టి
నాకూ నా బిడ్డకే అందించిందని
నాకు ఖచ్చితంగా తెలుసు

ఫొటోల్లోని తన జడలో మల్లెలని చూస్తూ
ఆ పచ్చి పూవుల పరిమళం
ఇక ఎప్పటికీ రాదు కదా అందామె

నాకేమీ బాధ లేదు

పచ్చిపూలది ఒక పరిమళం
ఏళ్ళకొద్దీ మగ్గిన అత్తరుది
మరొక గుబాళింపని నేనెరుగుదును

వెంకటేష్ పైడికొండల
81215 33112

కథా నిలయం 22వ వార్షికోత్సవం

కథానిలయం శ్రీకాకుళం 22వ వార్షికోత్సవ సభలు ఫిబ్రవరి 9, 10 తేదీల్లో సెమినార్ హాల్, ప్రభుత్వ కళాశాల, శ్రీకాకుళంలో జరుగుతాయి. ఫిబ్రవరి 9న 'కథకోసం కాలినడక', 10న ఉ.10 గం.ల నుంచి వార్షికోత్సవ సభ. సభలో అట్టాడ అప్పల్నాయుడు, బి.వి.ఎ.రామారావు నాయుడు, కాళీపట్నం రామారావు, దాసరి రామచంద్ర రావు, కె. శ్రీనివాస్, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, కాళీపట్నపు సుబ్బారావు తదితరులు పాల్గొంటారు.

కథా నిలయం

దక్షిణ భారత కవిత్వ ఉత్సవం

సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో 'దక్షిణ భారత కవిత్వ ఉత్సవం' ఫిబ్రవరి 10 ఉ.11.30గం.లకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. కె.శ్రీనివాసరావు, కె.శివారెడ్డి, శిర్పి బాలసుబ్రహ్మణ్యం, నందిని సిధారెడ్డి, మామిడి హరికృష్ణ, సిద్ధలింగయ్య, ప్రభావర్మ, ఆశారాజు, అనసూయ కాంబ్లే, సెబాస్టియన్, మీనాక్షి సుందరం, శిఖామణి, విక్రమ్ విశాజీ, జినేష్ కుమార్ ఎరమం తదితరులు పాల్గొంటారు.

వాసిరెడ్డి నవీన్

చైతన్య ప్రకాశ్ సంస్మరణ సభ

కథా రచయిత, కవి చైతన్య ప్రకాశ్ సంస్మరణ సభ ఫిబ్రవరి 5 సా.6గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. నందిని సిధారెడ్డి, నాళేశ్వరం శంకరం, కాశీం, కె.పి. అశోక్ కుమార్, వి.శంకర్ తదితరులు పాల్గొంటారు.

కందుకూరి శ్రీరాములు

'కథ మంచికి' ఆవిష్కరణ

కె.వి.యస్.వర్మ సాహిత్య స్వర్ణోత్సవం సందర్భంగా ఫిబ్రవరి10 సా.6గం.లకు విజయవాడ మొగల్‌రాజపురం మధుమాలక్ష్మి ఛాంబర్స్‌లో 'కథ మంచికి...' పుస్తకావిష్కరణ జరుగుతుంది. భమిడిపాటి జగన్నాథరావు ఆవిష్కరిస్తారు.

'ఎక్స్‌రే' సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ

విస్మృత కవిత్వం వెలికితీత 'ప్రేమలేఖ'



నామాడి శ్రీధర్ ❖ పలకరింపు

'ప్రేమలేఖ ప్రచురణ' ప్రారంభించాలని ఎప్పుడు, ఎందుకు అనిపించింది?

కవిత్వం కోసమే రాజమండ్రి నుంచి 1990-1996 మధ్య కాలంలో ఒమ్మి రమేష్‌బాబు, తల్లావఝుల శశిశేఖర్‌లు సహ సంపాదకులుగా 'కంజిర' పత్రిక తీసుకొచ్చాను. ఆ అనుభవం నాకెప్పటికీ ఆకుపచ్చగానే ఉంటుంది. అటుపిమ్మట 1997లో చింతలపల్లి అనంతుతో కలిసి పుస్తక ప్రచురణ చేపట్టాలని ఉవ్విళ్ళూరాను. అయితే ఆ passion printing press వరకూ వెళ్ళలేకపోయింది. ఈ పూర్వ రంగంలో, శివలెంక రాజేశ్వరీదేవి కవితల్ని 2016లో సంకలితం చేస్తున్న సందర్భమే ప్రచురణసంస్థ ఏర్పాటుకి తగిన సమయంగా తోచింది. దానితో ఏడుగురు కవిమిత్రులు సంపాదక బృందంగా 'ప్రేమలేఖ ప్రచురణ' ఆవిర్భవించింది. పుస్తకం మాయమవుతున్న e-book రోజుల్లో పుస్తక ప్రచురణకి, పైగా కనీసస్థాయి market లేని కవిత్వాన్ని శిరసున పెట్టుకోవడానికి గాఢమైన అనురక్తి మాత్రమే చోదకశక్తి అయింది. మాకు business activity చేతకాదు, salesmanship లేదు. ఈ స్థితిగతులన్నీ తెలిసి తెలిసి 'ప్రేమలేఖ ప్రచురణ'ని మొదలుపెట్టాం.

ఎలాంటి కవిత్వాన్ని ప్రచురించాలన్నది ఆదర్శం? ప్రచురించిన పుస్తకాల గురించి?

అన్నివేళలా కవిత్వమే ప్రమాణం. ఉత్తమోత్తమ కవిత్వం దిశగానే ప్రయాణం. విస్మృతినొందిన కవిత్వం వెలికితీతని 'ప్రేమలేఖ' లక్ష్యంగా ఎంచుకుంది. అనామకంగా, అజ్ఞాతంగా రాతప్రతుల్లో మగ్గిపోతున్న మేలిమి కవిత్వాన్ని చదువరులకు అందించాలని ప్రయత్నిస్తుంది. ఈ వరుసలో తొలుత శివలెంక రాజేశ్వరీదేవి (1954-2015) 'సత్యం వద్దు, స్వప్నమే కావాలి' (2016) అచ్చువేశాం. అరవయ్యేళ్ళ ఆమె జీవితంలో నాలుగు దశాబ్దాలపాటు ఆర్ద్రానుభూతులతో కవిత్వం రాశారు. ఒక పుస్తక రూపం దాల్చకుండానే అర్ధాంతరంగా కనుమూశారు. ఆమె రచనలన్నీ చిత్తుకాగితాల కింద లెక్క. చివికిపోయిన, రంగు వెలిసిన కాగితాల మీది అక్షరాలను ఆనవాలు పట్టి 61 కవితల్ని సేకరించాం. కవిమిత్రుల స్మృతులను వాటికి జతచేసి పుస్తకం వెలువరించాం.

చింతలపల్లి అనంతు కవిత్వం 'ద్వీపకూటమి' (2016) రెండవది. బలాదూరుగా కనిపించే సమకాలీన కవిలో బావురుమనే దయార్ద్ర హృదయం దాగివుంటుందని ఈ సంపుటం చదివితే తెలుస్తుంది. స్త్రీతత్వ కవయిత్రి ఊర్మిళ కవిత్వం ఏనాడో పుస్తకంగా రావలసింది. ఆమె బాల్యం నుంచి ఇప్పటికి రమారమి రెండు వందల కవితలు రాశారు. ఆ రాతప్రతులు, అచ్చు కాగితాలన్నీ పోగొట్టుకున్నారు. ఆఖరికి 60 కవితలు దొరకడంతో మూడో పుస్తకంగా 'అంగార స్వప్నం' (2017) రూపుదిద్దుకుంది. గడియారం యాజ్ఞి (1972-2018) స్వీయ, అనువాద కవిత్వం 'లీనాలీనమ్' (2018) నాలుగోది. కవి ఉపేక్ష భావనకి కవితలన్నీ చెల్లాచెదురైపోగా, అతని మరణానంతరం మిగిలిన కొన్నింటిని ఏరికూర్చి ఆవిష్కరించాం.

ఇటీవలి పుస్తకం చిత్రకొండ గంగాధర్ (1974-2011) 'ఆత్మహత్యా సదృశ దేశదిమ్మరి ఆఖరి కోరిక పత్రశకలం' (2018). తెలుగు కవిత్వంలో ఓ అద్భుతంగా పేర్కొనదగింది. యువకుడిగా కవిత్వ సృజన ఆరంభించిన గంగాధర్ 37 సంవత్సరాల స్వల్ప జీవిత కాలంలో నిలువెల్లా కవిత్వంతో ఉప్పొంగిపోయాడు. పత్రికల్లో ప్రచురణార్థమో, ఎవ్వరి మెప్పుకోసమో రాసే కవుల బాపతు కాదతడు. అతని సంచారకాలపు వ్యాఖ్యానం, ఏకాంతలోకపు స్వగతం, మృత్యుకాంక్షాపూరిత గానం రాతలో పెట్టాడు. చిత్రకొండ తరహా కవిత్వం, పురానవ పరిభాష మన పాఠకులకు అరుదైనది. కవి అనుభవసాంద్రత వారికి విభ్రాంతి కలిగిస్తుంది. అతను ఆత్మహత్య చేసుకున్న ఏడేళ్ళకి 126 కవితలతో పుస్తకం తీసుకొచ్చాం. ఇప్పటి వరకూ ప్రకటించిన కవులు విభిన్న తరాలకి, ప్రాంతాలకి, జీవన నేపథ్యాలకి చెందినవారు. ఏ కవికాకవి రచన ధోరణి విలక్షణమైనది.

మీ ప్రణాళికలు, ప్రచురించాలనుకుంటున్న పుస్తకాలు?

కలేకూరి ప్రసాద్/యువక కవిత్వం వెన్వెంటనే రానున్న పుస్తకం. యావజ్జీవితం కవిత్వాన్ని, ప్రజాఉద్యమాల్ని ప్రాణాధికంగా ప్రేమించిన కవి, సామాజిక కార్యకర్త. అతని కవితలు విప్లవ, దళిత సాహిత్యంలో పాఠ్యాంశాలుగా ఎన్నదగినవి. అటువంటి కవిత్వం ఈనాటికీ volumeగా రాలేదు. కలేకూరి స్వీయ, అనువాద కవితలతో authentic anthology ప్రచురించనున్నాం. ఆ తదుపరి ముస్లిమ్ సంఘీభావ కవిత్వం 'మిలన్'. ఇది ముస్లిమేతరులు ముస్లిములకు తెలిపే అలాయ్ బలాయ్ పుస్తకంగా రూపుదిద్దుకోనుంది.

ఈ పరంపరలో ఒమ్మి రమేష్‌బాబు, ఇక్బాల్‌చంద్‌ల కవిత్వం; అనంతు aphorisms, అతను అనువదించిన దేశదేశాల కవిత్వం 'రుతుపవనం'; 'కంజిర' సర్వ సంకలనం; ఈ దశాబ్దంలో రెక్కవిప్పిన యువకవుల కవిత్వంతో compilation తేవాలని నిశ్చయించాం.

ఇంకా, అంబటి సురేంద్రరాజు కవితల్ని వెదకవలసి ఉంది. సివిఎస్ మహేష్, కవులూరి గోపీచంద్, టివిఎస్ రామన్, రాజీవ్ వెల్చేటి, వాసిరెడ్డి శరత్‌బాబు, మహెజబీన్, దేశరాజు, ఆకుల చలపతి, గోపిరెడ్డి రామకృష్ణ, సూర్యవంశీ, రారెడ్డి, కొండూరి రామరాజు వంటి పలువురి కవిత్వం డైరీల్లోనే మిగిలిపోయింది. రేవతీదేవి, పల్లవ హనుమయ్య, శివసాగర్, అజంతా, ఇస్మాయిల్, త్రిపుర ప్రభృతుల సమున్నత కవిత్వం నేడు అందుబాటులో లేకుండా పోయింది. అలానే, నండూరి రామమోహనరావు, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ సంపాదకత్వంలో వచ్చిన వచన కవిత్వ సంకలనం (1940-1975) 'మహాసంకల్పం'. వీటి ప్రచురణ, పునర్ముద్రణకి ముందువరుసలో ఉండాలని 'ప్రేమలేఖ' కుతూహలపడుతుంది. అయితే అందుకు ఆర్థికాంశం మినహా మరే అవరోధమూ లేదు.

తెలుగులో కవిత్వానికి ఆదరణ ఎలా ఉంది?

మక్సీమ్ గోర్కీ తన జీవితంలో సాహిత్యం తల్లిలాంటి పాత్ర వహించిందన్నారు. ఓ అచ్చమైన సాహిత్య పత్రిక లేకుండానే బ్రతికేస్తున్న సమాజం మనది. వంద రూపాయలు వెచ్చించి ఒక కవిత్వ సంపుటం కొనలేని పేదరికం మనది! కాబట్టి ప్రచురణ రంగంలో కవిత్వప్రక్రియ చిరకాలపు అనాథ. తెలుగు కవి అప్పు చేసైనా తన కవితల పుస్తకం అచ్చువేసుకుంటాడు. ఒకటిరెండు పుస్తకాల షాపుల్లో మాత్రమే అమ్మకానికి అయిదు కాపీలు వంతున పుచ్చుకుంటారు. ఇక కవికి ఉచితపంపిణి ఆనవాయితి ఉండనే ఉంది. ప్రధానంగా కవిత్వం పేరిట చిల్లర మల్లర రాతల వల్ల చదివే కొద్దిమందికీ విసుగుపుట్టింది. మరి కవిత్వం లేపోతే భాష అర్థరహితమవుతుంది. సమాజపు అంగాంగం శుష్కించిపోతుంది. అసలు జీవితంలో నన్ను నేను చేరుకోవడానికి త్రోవ ఏది?

కవిత్వం గాక మరింకేమైనా ప్రచురించే ఉద్దేశం ఉందా?

నిజానికి మాది సారస్వతానికి 'ప్రేమలేఖ'. అన్ని ప్రక్రియలనూ ప్రచురించాలనే ఉంది. అనంతు four square (2017) కథని bookletగా print చేశాం. ఊర్మిళ కాలమ్ 'చెంచిత' అచ్చుకి వెళ్ళబోతుంది. కేవలం కవిత్వంలోనే కవిత్వం ఉంటుందనుకోవడం లేదు. ప్రతి ప్రక్రియలోనూ కవిత్వం ఉండాలి. అలా లేకపోతే సాహిత్యం బీడువారిపోతుంది. ఆ జీవితేచ్ఛని ఒడిసిపట్టుకోవాలనే 'ప్రేమలేఖ' వెర్రిగా శోధిస్తుంది. స్వతహాగా కవుల జట్టు కాబట్టి కవిత్వం వేపు మొగ్గుతున్నాం. గాలికి కొట్టుకొనిపోతున్న కవుల అక్షరాల్ని బట్టి కవిత్వానికి ప్రాధాన్యతనిస్తున్నాం. మనమధ్య లేకుండాపోయిన కవి కవితల్ని పాత పత్రికల నుంచి సమీకరించడం ప్రయాసతో కూడుకున్నది. ఈ కార్యకలాపం ఆర్మీనియన్ కథ 'కడవ భుజానపెట్టి నీటికెళ్ళను పడతి'లో పాటలు పోగుజేసే బాటసారి వైఖరిని తలపిస్తుంది. మన కవులు తమ స్వీయ రచనల్ని ప్రచురించడంతోనే తృప్తిచెందకుండా, అనామ, పూర్వ కవుల అపురూప రచనలు అచ్చుకావడంలో కూడ తమ తోడ్పాటు నందించాలని అభ్యర్థిస్తున్నాం.

మీ తరంతో పోల్చి చూసుకున్నప్పుడు- ఈ ఫేస్బుక్ తరం కవిత్వంలో ఆహ్వానించాల్సినవేవి? అవాంఛనీయాలేవి?

అది ముమ్మాటికీ కవిత్వమైతే చాలు, ఎక్కడున్నప్పటికీ అక్కున జేర్చుకోవాలి కదా. ఫేస్బుక్ తరంలోనూ ఎప్పటిమాదిరిగా కొందరు మాత్రమే సత్యసంధతతో, వైయక్తిక దర్శనంతో రాస్తున్నారు. ఇక అవాంఛనీయమంటే అధికశాతం అకవిత్వమేననిపిస్తుంది. కవిత్వం publication నుంచి post దశకి మారిన సందర్భంలో కవీ పాఠకుల మధ్య తూనికరాళ్ళకి కాలం చెల్లిపోయింది. దీనితో ఏకకాలంలో కవి అభివ్యక్తి విముక్తం కావడంతో పాటుగా అకవిత్వానికి సైతం లాకులెత్తినట్టయింది. కవిత్వ పుస్తకం dead stock అయిన వర్తమానంలోనూ ఫేస్బుక్ కవులు కూడ పుస్తకాలు అచ్చువేస్తున్నారు. పుస్తకమనే toolతో మరొకటి పోటీ పడలేదనడానికి ఇంతకు మించిన నిదర్శనం ఏముంటుంది? కాబట్టి పుస్తక ప్రచురణ ఎప్పటికీ value addition.

✆ 93968 07070



విస్మృతినొందిన కవిత్వం వెలికితీతని 'ప్రేమలేఖ' లక్ష్యంగా ఎంచుకుంది. అనామకంగా, అజ్ఞాతంగా రాతప్రతుల్లో మగ్గిపోతున్న మేలిమి కవిత్వాన్ని చదువరులకు అందించాలని ప్రయత్నిస్తుంది. పుస్తకం మాయమవుతున్న e-book రోజుల్లో పుస్తక ప్రచురణకి, పైగా కనీసస్థాయి market లేని కవిత్వాన్ని శిరసున పెట్టుకోవడానికి గాఢమైన అనురక్తి మాత్రమే చోదకశక్తి అయింది. మాకు business activity చేతకాదు, salesmanship లేదు. ఈ స్థితిగతులన్నీ తెలిసి తెలిసి 'ప్రేమలేఖ ప్రచురణ'ని మొదలుపెట్టాం.

ఇప్పుడంటే యోగా దినోత్సవం. మరి ఓ ముప్పై ఏళ్ల కిందట..! అది ఓ బ్రహ్మ పదార్థం. కానీ... ఆ నాడే యోగ సాధకురాలై... దానిపై పరిశోధనలు చేసి... ఇప్పుడు 'యోగిని'గా దేశవిదేశాల్లో మనో వికాసం నింపుతున్నారు అరుణా దేవి. భారత్‌లోనే తొలి యోగా గురువుగా కీర్తి ప్రతిష్ఠలు సంపాదించారు. యోగా ఒక సాధన మాత్రమే కాదు... జీవన విధానమని చెబుతున్న ఆమె అంతరంగం ఇది...

నవజీవన యోగం



యోగా అనేది ఒక జీవన విధానమని మళ్లీ హిమాలయాల్లో సాధన చేసినప్పుడు అర్థమైంది. యోగసాధనతో జీవితం ఆరోగ్యంగా, సంతోషంగా సాగిపోతుంది. ప్రతి ఒక్కరికీ నాణ్యమైన జీవన విధానం ఉండాలి. ప్రస్తుతం యువతను కదిలించి చూడండి... ముందు వారి నుంచి వినిపించే పదం 'డిప్రెషన్'. అది తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడటంతో పాటు యువతీయువకులు తమలోని శక్తి సామర్థ్యాలను వృథా చేసుకుంటున్నారు. ముందు మన శరీరాన్ని మనసుతో మమేకం చేయాలి. అదే యోగా. భగవంతుడు ఎక్కడో లేడు... మనలోనే ఉన్నాడని గ్రహించాలి. నేను దేశ విదేశాల్లో పర్యటించినప్పుడు కూడా ఇదే చెబుతున్నా. ఇలాంటి కేసులెన్నో డీల్ చేస్తున్నా. నొప్పి లేకుండా సుఖప్రసవాలు జరుపుతున్నా. మందులు లేకుండా మధుమేహాన్ని తగ్గిస్తున్నా. అల్లోపతి ఒక్కటే వైద్య విధానం కాదు... ఇవి కూడా ఉన్నాయని చెప్పడమే నా ఉద్దేశం. అంతేకాదు... దేశంలో 'పంచ ఫలయోగ చికిత్స' బోధించిన తొలి గురువును నేనే!

అమ్మమ్మను చూసి...

ఎప్పుడో నా చిన్నప్పుడే తాతమ్మ సాధమ్మ 'వాయుగమనం' చేస్తుండగా చూశాను. అలా ఎలా? ఆశ్చర్యమనిపించింది. ఆ దృశ్యం మనసులో ముద్ర పడిపోయింది. ఆవిడ మంత్రాలు, మాయలేవో చేస్తుందని అంతా అనుకొనేవారు. అప్పుడు నాదీ అదే అభిప్రాయం. కానీ... 'అదేం లేదు. ఇది యోగ సాధనతో వస్తుంద'ని తాతమ్మ చెప్పేది. నమ్మకం కుదరలేదు. తను తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు కూడా యోగా పాఠాలు చెప్పేదట. కొన్నాళ్ల తరువాత పశ్చిమ గోదావరి జిల్లాలోని మా ఊరు ఆచంటలో తాతమ్మ పేరు మీద 'సాధమ్మ ఆశ్రమం' నెలకొల్పారు. ఇక తాత నెక్కంటి రామ్‌దాస్ కమ్యూనిస్టు నాయకుడు. మంచి వక్త. ఆయనా రోజూ యోగా చేసేవారు. 1980ల్లో అనుకుంటా... తాతతో కలిసి నేనూ యోగా చేసిన సందర్భాలు ఇంకా గుర్తున్నాయి. ఆటలన్నా నాకు ఎంతో ఇష్టం. స్కూలు, కాలేజీల్లో వాలీబాల్ ఆడేదాన్ని.

వాలీబాల్ వదిలేసి బిహార్‌కు...

ఇంటర్‌మీడియట్ పూర్తయిన తరువాత మా జిల్లా నుంచి వాలీబాల్ క్రీడాకారిణిగా హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యా. ఆడపిల్లను కావడంతో అంత దూరం పంపించడానికి ఇంట్లో వాళ్లు తొలుత ఇష్టపడలేదు. నా ఉత్సాహం, పట్టుదల చూసి తరువాత సరేనన్నారు. దీంతో 1987లో హైదరాబాద్‌కు వచ్చాను. తరువాత జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. అయితే అక్కడ ఎక్కువ కాలం ఉండలేదు. అందుకు కారణం స్పోర్ట్స్ స్కూల్లో కోకో కోచ్ దడపయ్య గారు. ఆయన ఓ రోజు 'నీ శరీరం బాగా ఫ్లెక్సిబుల్‌గా ఉంది. యోగ పోటీలకు ప్రయత్నించు' అన్నారు. దీంతో యోగా శిక్షణ కోసం 1988లో బిహార్ వెళ్లా. 'నేను వాయుగమనం చేయాలి. ఆ మంత్రం చెప్పండి' అని గురువును అడిగా. అందుకు ఆయన 'అది మంత్రం కాద'న్నారు. యోగా' అన్నారు. అక్కడే శిక్షణ తీసుకున్నా.

అన్వేషణ...

బిహార్‌లో యోగా శిక్షణ పొందానే కానీ నాకు ఆత్మసంతృప్తి లేదు. ఇంకా ఏదో నాకు కావాల్సింది అక్కడ దొరకలేదనే అసంతృప్తి. దీంతో అక్కడ పరిచయమైన విదేశీ విద్యార్థులతో రిషీకేశ్ వెళ్లాను. అక్కడున్న గురువులందరినీ కలిశాం. ఒక్కొక్కరి దగ్గరా ఒక్కో కొత్త విషయాన్ని నేర్చుకుంటున్నాం.



ఇది గమనించిన ఓ గురువు... 'ఆడపిల్లవు అలా తిరగడం మంచిది కాదు. ఎక్కడో ఒకచోట ఉండి నేర్చుకో' అన్నారు. ఆయన సూచన ప్రకారం కేరళ, తమిళనాడు సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో ఉండే తంబి దొరై గురువు దగ్గరికి వెళ్లాం. మా నలుగురైదుగురు బృందంలో భారతీయురాలిని నేనొక్కదాన్నే. ఆయన వద్ద వనమూలికలు, ప్రకృతితో ఎలా ప్రవర్తించాలనేవి తెలుసుకున్నాం. ఇక వాలీబాల్ పూర్తిగా ఆపేశాను. యోగాలోనే జీవితం ఉందని గ్రహించాను. 'యోగం కోసం నా అన్వేషణ కొనసాగుతూనే ఉంది. ఆ క్రమంలోనే హిమాలయాలకు వెళ్లాను. అక్కడే నెల రోజులు ఉన్నా. అలా వెళుతూ, వస్తూ ఏడాది గడిచింది. 1990లో పెళ్లి చేసుకున్నా. దీంతో మూడేళ్లు యోగాకు బ్రేక్ పడింది. నాకు ఇద్దరు పిల్లలు.

> **పిల్లలే నా బలం...**
>
> నా బలం నా పిల్లలే. బాబు క్రిష్ ఆటోమొబైల్ ఇంజినీరింగ్ చేసి, ఆ రంగంలోనే స్థిరపడ్డాడు. అమ్మాయి లాస్య యార్లగడ్డ సినిమాల్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేస్తోంది. నాదొక ప్రపంచం. దానికి మా పిల్లలు ఎప్పుడూ మద్దతు ఇస్తారు. నా వద్ద శిక్షణ తీసుకునే వారిలో సెలబ్రిటీలు, పొలిటీషియన్లు, వీఐపీలు చాలామంది ఉన్నారు. కానీ నేను ఎవరి ఇంటికీ వెళ్లి క్లాసులు చెప్పను. ఎందుకంటే ఇది విద్య. కావాల్సిన వారు వచ్చి నేర్చుకోవాలన్నది నా అభిమతం.

పరిశోధన... పాఠాలు...

ఇన్ని రోజులు నేను దేశమంతా తిరిగి సంపాదించిన పరిజ్ఞానం, చేసిన పరిశోధన, పడ్డ శ్రమకు ఓ అర్థం ఉండాలి. యోగ ఎంత గొప్పదో, దాని వల్ల జీవితం ఎంత ఆనందమయమవుతుందో అందరికీ అర్థమయ్యేలా చెప్పాలి. ఈ సంకల్పంతోనే 1993లో మళ్లీ యోగా మొదలు పెట్టాను. హైదరాబాద్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య పార్కులో ఉదయం, సాయంత్రం ఉచితంగా యోగా పాఠాలు చెప్పడం ప్రారంభించా. తరువాత కొన్నాళ్లు ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో చెప్పాను. ఇదే క్రమంలో ఎంఏ సైకాలజీ పూర్తి చేశా. ఆయుర్వేదం, హోమియో వైద్యంపై అధ్యయనం చేశా. వైద్యుల వద్ద కొంత కాలం పనిచేశాను. ఆక్యుపంక్చర్, కాస్మెటాలజీ కూడా చదివాను. గిరిజన ప్రాంతాలకు వెళ్లి, వాళ్లతోనే ఉండి ఔషధ మొక్కలు, మూలికల గురించి తెలుసుకున్నా. ఈ అనుభవంతోనే హిమాయత్‌నగర్ (1995)లో 'అరుణ' యోగా ఇనిస్టిట్యూట్ ప్రారంభించాను. మూడేళ్ల కిందటే దాన్ని మాదాపూర్‌కు మార్చాను. ఇదిలావుంటే ఢిల్లీలో ఓ కార్యక్రమానికి వెళ్లినప్పుడు హిమాలయాల్లోని మా గురువు కనిపించారు. ఆయనతో కలిసి సాధన చేసేందుకు లడఖ్ దగ్గర్లోని ఖీర్‌గంగ వెళ్లాను. అక్కడ 45 రోజులు యోగ సాధన చేశాను. ఆయన అత్యంత ముఖ్యమైన 'పంచ ఫలయోగ చికిత్స' బోధించారు.

లక్ష్యం... విశ్వవిద్యాలయం...

ఇప్పటి వరకు రెండు వేల మందికి పైగా యోగా ప్రొఫెషనల్స్‌ను తయారు చేశాను. అమెరికా, రష్యా, చైనా, ఉక్రెయిన్ తదితర దేశాల నుంచి వచ్చి నా ఇనిస్టిట్యూట్‌లో శిక్షణ పొందుతారు. ముద్ర థెరపీ, వేదిక్ యోగ చికిత్సలతో పాటు సంప్రదాయ యోగాకు ప్రచారం కల్పిస్తున్నాను. నా లక్ష్యం ఒక్కటే... హైదరాబాద్‌లో యోగ విశ్వవిద్యాలయం తీసుకురావాలని! అందులో అన్ని రకాల వైద్యాలూ అందుబాటులో ఉండాలి. ఏం చేసినా అది దేశ ప్రజలకు ఉపయోగపడాలనేదే నా ధ్యేయం.

● హనుమా



నిత్య సాధనకు మూడు ముద్రలు...

యోగాలో ఆసనాలు, ధ్యానం, ప్రాణాయామాలు ఎంత ముఖ్యమో ముద్రలు కూడా అంతే కీలకం. ప్రస్తుతం మనం తినే ఆహారం, పీల్చే గాలి, తాగే నీరు, ఆఖరికి ఆలోచనలు... ఏవీ నాణ్యమైన జీవన విధానానికి తగ్గట్టుగా లేవు. అనుక్షణం అంతర... బాహ్య ఒత్తిళ్లతో శరీరం- మనసు మధ్య నిరంతర ఘర్షణ జరుగుతోంది. రెండింటికీ సమన్వయం లోపించినప్పుడు అది అనారోగ్యానికి దారితీస్తోంది. గతి తప్పిన జీవనాన్ని సరైన మార్గంలో పెట్టడానికి ఈ మూడు ముద్రలు దోహదపడతాయి. ప్రయత్నించండి...



కాళేశ్వర ముద్ర: ఒత్తిడి, టెన్షన్ తగ్గించడంతో పాటు ఈ ముద్ర ఉత్కంఠ నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మెదడును ప్రశాంతంగా ఉంచుతుంది. వ్యసన ప్రవర్తనను తొలగించడంలో శక్తిమంతంగా పనిచేస్తుంది. చిత్రంలో చూపినట్టు ఈ ముద్రను పెట్టి, రోజుకు 20 నిమిషాలు సాధన చేయాలి. దీంతో పాటు 8 సెకన్లు శ్వాస తీసుకుని, 8 సెకన్లు ఊపిరి బంధించి, 8 సార్లు నిదానంగా వదిలేయాలి. అలా 8 సార్లు చేయాలి.
ఆసనాలు: ముద్రలతో పాటు శశాంక్, వీర, యోగముద్ర, సుప్తబద్ధకోణ ఆసనాలు వేయాలి.
ప్రాణాయామం: అలాగే భ్రమరి, అలోమ-విలోమ ప్రాణాయామాలు చేయాలి.



మృతసంజీవిని ముద్ర: గుండె సంబంధిత సమస్యలకు దీన్నే 'జీవిత రక్ష ముద్ర' అని కూడా అంటారు. గుండె పోటు వచ్చినప్పుడు అత్యవసర చికిత్సలా ఉపయోగపడుతుంది. రెండు చేతులతో ఈ చిత్రంలో చూపించినట్టు ముద్ర ఉండాలి. నిమిషం చొప్పున రోజుకు మూడుసార్లు చేయాలి. క్రమం తప్పకుండా కొంత కాలం చేయడం వల్ల హృదయం ఆరోగ్యకరంగా ఉంటుంది.
ఆసనాలు: దీంతో పాటు సుప్త గోరక్ష, వక్ర, భుజంగ, నటరాజ ఆసనాలు చేయవచ్చు.

ప్రాణాయామం: నాడీశోధన, భస్త్రిక ప్రాణాయామాలు



రుద్ర ముద్ర: ఈ ముద్ర హైపర్ టెన్షన్‌ను నియంత్రణలో ఉంచుతుంది. ఈ ముద్రను రెండు చేతులతో, 5 నిమిషాల చొప్పున రోజుకు మూడుసార్లు ఈ ముద్ర చేయాలి.
ఆసనాలు: గోముఖ, మధుక ఆసనాలు
ప్రాణాయామం: ఉజ్జయి, సరళ ప్రాణాయామాలు

గమనిక: ముద్రలు చేసేటప్పుడు నిటారుగా, సౌకర్యవంతంగా కూర్చోవాలి. కళ్లు మూసుకుని, శ్వాసపై ధ్యాస పెట్టాలి.

అధ్యయనం



మహిళల్లో నిద్రలేమికి...

నిద్రలేమి అనగానే ఎవరికైనా, వెంటనే గుర్తుకు వచ్చేవి నిద్ర మాత్రలే. ప్రత్యేకించి మహిళల్లో ఈ సమస్య కాస్త ఎక్కువ. వెంటనే నిద్ర మాత్రలు వేసుకొనే ప్రయత్నం చేస్తారు. అంతేగానీ, నిద్ర పట్టకపోవడానికి అసలు కారణమేమిటో తెలుసుకోరు. అయితే నిద్రలేమికి ఇప్పటిదాకా తెలిసిన కారణాల మాట ఎలా ఉన్నా, ఇటీవల ఒక కొత్త కారణం వెలుగు చూసింది. అమెరికాలోని వర్జీనియా వర్సిటీకి చెందిన పరిశోధకులు ఈ మధ్య ఆ కొత్త కారణాన్ని కనుగొన్నారు. ఏ కారణంగానైనా సర్జరీ ద్వారా గర్భసంచి తొలగించడంతో వచ్చే మెనోపాజ్‌వల్ల నిద్ర లేమి సమస్యలు ఎక్కువగా ఉంటున్నాయని తెలుసుకున్నారు. అయితే, వయసు దాటిపోయి సహజసిద్ధంగా మెనోపాజ్ వచ్చిన వారిలో ఈ సమస్యలు అంతగా లేవని గమనించారు. అర్ధంతరంగా గర్భసంచిని తీసివేయడం ద్వారా హార్మోన్ వ్యవస్థ, జీవక్రియల్లో చోటు చేసుకునే తేడాలే నిద్రలేమికి కారణమని వారు చెబుతున్నారు. దీనివల్ల శారీరక సమస్యగానే కాకుండా, ఒక దశలో దిగులు, ఆందోళన వంటి మానసిక సమస్యలు కూడా తలెత్తే ప్రమాదం ఉంది. అలాంటప్పుడు గర్భసంచి తొలగించడం ద్వారా నిద్ర లేమితో బాధపడేవారు తీవ్రంగా ఉంటే తప్ప నిద్రమాత్రలు వేసుకోకూడదు.

హార్మోన్ వ్యవస్థను, జీవక్రియలను చైతన్యపరిచే యోగా, ప్రాణాయామాలకు ప్రాధాన్యతనివ్వాలి. నిద్ర మాత్రలు ఎక్కువ కాలం వేసుకోవడంవల్ల దుష్ప్రబావాలుంటాయి. అయితే యోగా, ప్రాణాయామాలతో ఎలాంటి దుష్ప్రభావాలూ లేకుండా సమస్యను నియంత్రిస్తాయని అధ్యయనకారులు చెబుతున్నారు.

ఇంటి మెరుపు కోసం..



ఇల్లు శుభ్రంగా ఉంటే మనసు ఆహ్లాదంగా ఉంటుంది. ఆరోగ్యానికి కూడా ఎంతో మంచిది . ఇందుకు కొన్ని టిప్స్ ఉన్నాయి. అవేమిటంటే...

- వారానికి ఒకసారి ఇంట్లోని సింకులు, బాత్రూములు శుభ్రం చేయాలి.
- ఫర్నీచర్ దుమ్ముపట్టకుండా దులుపుతుండాలి.
- బొద్దింకల్లాంటివి చేరకుండా తరచూ పురుగుల మందు ఇంటి నలుమూలల్లో కొడుతుండాలి.
- తిన్న ప్లేట్లను నీళ్లతో కడిగి డిష్‌వాషర్‌లో వేయాలి.
- ఫ్రిజ్‌ని వారానికి ఒకసారి శుభ్రం చేయాలి. పాతవంటకాలు ఉంటే ఎప్పటికప్పుడు తీసేయాలి.
- ఇంట్లో వాడుకునే కార్పెట్స్ కావొచ్చు, ఫర్నీచర్ కావొచ్చు, గోడల రంగులు కావొచ్చు వీటన్నింటికీ గాఢరంగులు వాడాలి. ఈ రంగులు వాడడం వల్ల డస్ట్ ఎక్కువగా కనపడదు.
- ఇంట్లో నేలను సులువుగా శుభ్రం చేయడానికి పాత రగ్గులు బాగా ఉపయోగపడతాయి.
- వంటిల్లు శుభ్రంగా కనిపించాలంటే కాఫీ పాట్, స్నాక్ ఫుడ్ ఏరియాల్లో... అలాగే బ్రేక్‌ఫాస్ చేసే చోట డెకొరేటివ్ టవల్స్ పరవాలి.
- ఇంట్లో చిన్నపిల్లలు ఉంటే వారికి తగ్గట్టు హోమ్ ఫర్నిషింగ్ చేయాలి.
- ఇంటికి ఉపయోగించే తాళాలను తరచూ కొబ్బరినూనెతో శుభ్రం చేయకపోతే అవి తుప్పు పట్టి పనిచేయకుండాపోయే అవకాశం ఉంది.
- ఇంటి తలుపులకు ఉండే హ్యాండిల్స్, నాబ్‌లను కూడా సరిగా ఉన్నాయో లేదో తరచూ గమనించుకోవాలి.
- కిటికీలకు, తలుపులకు అమర్చే స్ర్కీన్ దెబ్బతినకుండా అవసరాన్ని బట్టి తరచూ మారుస్తుండాలి.

ప్రతి మాటా ఆచితూచి...

పేరెంటింగ్

పరీక్షల సమయంలో, పిల్లలకు కలిగే భయాందోళనలు వారి మనసును బలహీనపరుస్తాయి. దీన్నే కొందరు 'సున్నితంగా మారడం' అంటారు. ఈ కారణంగానే పరీక్షల సమయాల్లో పిల్లలు అతిగా స్పందిస్తూ ఉంటారు. ఏ కాస్త గట్టిగా మందలించినా ఏడ్చేస్తుంటారు కూడా. అయితే బాగా చదివిన వాళ్లు వీటికి అతీతంగా ఉంటారని కూడా అనుకోలేం. ఎందుకంటే బాగా చదివిన పిల్లల అంచనాలు కూడా ఎక్కువగానే ఉంటాయి కాబట్టి, అనుకున్న స్థాయిలో మార్కులు, ర్యాంకు రావేమోననే భయాందోళనలు వారిని వేధిస్తాయి. మొత్తంగా చూస్తే పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న పిల్లలందరినీ ఏదో ఒక స్థాయిలో భయాందోళనలు కలవరపరుస్తూనే ఉంటాయి. అందువల్ల మనసు బలహీనంగా లేదా సున్నితంగా మారిన ఈ దశలో వారితో జాగ్రత్తగా వ్యవహరించాలి. చదువు విషయంలోనే కాదు, ఆహార పానీయాల విషయాల్లోగానీ, దుస్తుల విషయంలో గానీ, మరే విషయంలో గానీ కాస్త గట్టిగా మందలిస్తే చాలు పిల్లలు కుంగిపోతారు. కొందరు పిల్లలు ఏడ్చేస్తారు కూడా. అలాంటి పిల్లల్లో ఈ ప్రభావం దాదాపు పరీక్షా కాలమంతా కొనసాగుతూనే ఉంటుంది. దీనివల్ల చదవడంలో గానీ, పరీక్షలు రాయడంలో గానీ వెనుకబడే ప్రమాదం ఉంది. వాళ్ల మనసు సున్నితంగా మారిన విషయాన్ని గుర్తించని తలిదండ్రులకు పిల్లల్లో ఇలాంటి వైఖరి ఏమీ అర్థం కాదు. "నేను మంచి మాటే చెప్పాను కదా! మామూలుగానే చెప్పాను కదా! వీడు ఎందుకు ఏడుస్తున్నట్లు?" అంటూ తలిదండ్రుల్లో కూడా అసహనం మొదలవుతుంది. వీళ్ల అసహనాన్ని చూసి పిల్లలు మరింత కుంగిపోతారు. చివరికి ఇదంతా ఒక విషవలయంగా మారుతుంది. అందుకే పరీక్షల వేళల్లో పిల్లలకు ఏ విషయాన్నయినా మృదువుగా, అనునయంగానే చెప్పాలి. లేదంటే చెప్పడంలోని ఉద్దేశం నెరవేరకపోగా, అందుకు విరుద్ధ ఫలితాలు వస్తాయి.





నేడు వరల్డ్ కేన్సర్ డే

అనుబంధం

అక్క మూలకణ దాత తమ్ముడు కేన్సర్ విజేత

తమ్ముడికి బ్లడ్ కేన్సర్ ఉందని తెలిసి అక్క మనసు తల్లడిల్లింది. అతడికి బోన్‌మ్యారో చికిత్స అవసరమని వైద్యులు తేల్చారు. ప్రాణాలకు ప్రమాదమని తెలిసినా కూడా తోడబుట్టిన తమ్ముడి కోసం మూలకణాలను ఇచ్చేందుకు సిద్ధమైంది. అతి క్లిష్టమైన అల్లోజనిక్ మూలకణ మార్పిడితో తమ్ముడిని బతికించుకుంది. విజయవాడకు చెందిన 22 ఏళ్ల హరిత తన తమ్ముడు పవన్ (20)ను కేన్సర్ నుంచి రక్షించుకున్న వైనం ఆమె మాటల్లోనే...

మా తమ్ముడు పవన్ ఇంటర్ చదివాడు. వాడి ముఖంపై చిన్న చిన్న పొక్కులు వచ్చాయి. చర్మవ్యాధుల డాక్టరు దగ్గరకు తీసుకు వెళితే రక్తపరీక్షలు చేసి మణిపాల్ ఆసుపత్రిలో కృష్ణారెడ్డిగారి దగ్గరకు తీసుకువెళ్లమని సలహా ఇచ్చారు. తమ్ముడికి బ్లడ్ క్యాన్సర్ అని ముందు మాకు చెప్పలేదు. ఇంటికి వచ్చాక వాడి రక్తపరీక్షల రిపోర్టులు చూశా. అందులో లుకేమియా అని ఉంది. ఒక్కసారిగా షాకయ్యాను. ఈ విషయం అమ్మకు చెబితే ఒక్కసారిగా కూలబడిపోయింది. అందరం ఒకటే ఏడుపు. రాత్రిళ్లు నిద్రపట్టేది కాదు.. అన్నం తిన్నా సహించేది కాదు. దేవుళ్లందరికీ మొక్కుకున్నాం. ఏడుస్తూ కూర్చున్నా చేసేదేముంటుందని మాకు మేమే ధైర్యం చెప్పుకుని తమ్ముడిని మణిపాల్ ఆసుపత్రికి తీసుకువెళ్లాం. అక్కడి డాక్టర్లు పరీక్షలు చేసి ఏఎల్ఎల్ పీహెచ్ పాజిటివ్ వచ్చిందని, ఇది పెద్ద జబ్బేనని చెప్పారు. వెంటనే చికిత్స మొదలు పెట్టాలి. ఏమాత్రం ఆలస్యం చేయకూడదని చెప్పారు. మణిపాల్ ఆసుపత్రిలో చికిత్స చేయించే ఆర్థిక స్థోమత మాకు లేకపోయినా భగవంతుడిపై భారం వేసి జాయిన్ చేశాం. అప్పు చేసి లక్షా 50 వేల రూపాయలు కట్టాం. కీమోథెరపీ చేశారు. తర్వాత సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంటే రూ. 3 లక్షలు వచ్చాయి. ఆ డబ్బులు 2 నెలల పాటు కీమోథెరపీకే సరిపోయాయి. అయితే అప్పటికే తమ్ముడికి కేన్సర్ తగ్గుముఖం పట్టింది. వ్యాధి లక్షణాలు కనిపించడం లేదని డాక్టర్లు చెప్పారు. మూలకణ మార్పిడి (ట్రాన్స్‌ప్లాంటేషన్) చేయించుకుంటే ఇక జీవితంలో క్యాన్సర్ వ్యాధి తిరిగి రాదన్నారు. కీమోథెరపీ పూర్తిగా ఆపేసి మూలకణ మార్పిడికి అవసరమైన పరీక్షలు చేశారు. తమ్ముడి హెచ్ఎల్ఏతో నా హెచ్ఎల్ఏ సరిగ్గా మ్యాచ్ అయ్యింది. అయితే ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ. 25 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. మేమంత ఖర్చు భరించలేమని చెబితే.. క్రౌడ్ ఫండింగ్ కోసం ప్రయత్నం చేద్దామని డాక్టర్లే సలహా ఇచ్చారు. 'మిలాప్' ట్రస్టు ద్వారా వాళ్లే క్రౌడ్ ఫండింగ్ కోసం తమ్ముడి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. దేశ విదేశాలకు చెందినవారెందరో మాకు సాయం చేశారు. ఆపరేషన్‌కు అవసరమైన సొమ్ము క్రౌడ్‌ఫండింగ్ ద్వారా సమకూరిన తర్వాత ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ఏర్పాట్లు చేశారు.

ఏమైనా జరగొచ్చన్నారు...

బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం ఆసుపత్రిలో చేరిన తర్వాత తమ్ముడికి, నాకు మళ్లీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాకు కౌన్సెలింగ్ ఇచ్చారు. 'ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసే సమయంలో ఏమైనా జరగొచ్చు. వందలో 25 మంది చనిపోతుంటారు. అన్నింటికి మీరు సిద్ధమైతేనే చేస్తామ'ని చెప్పారు. లిఖితపూర్వకంగా అంగీకారపత్రం రాయించుకున్నారు. నా మూలకణాలు (స్టెమ్‌సెల్స్) సేకరించే పరికరాలు మణిపాల్ ఆసుపత్రిలో లేకపోవడంతో హైదరాబాద్ బసవతారకం కేన్సర్ ఆసుపత్రికి తీసుకువెళ్లి అక్కడ నా స్టెమ్ సెల్స్ సేకరించారు. ముందుగా నాకు ఒక ఇంజక్షన్ ఇచ్చారు. దానివల్ల బాడీ పెయిన్స్, కొంచెం జ్వరం వచ్చినట్లుగా అనిపించింది. అలా నాలుగైదు డోసుల ఇంజక్షన్లు ఇచ్చిన తర్వాత శరీరంలో స్టెమ్ సెల్స్ ఉత్పత్తి అయ్యి రక్తంలో కలుస్తాయట. నా చేతి నరం దొరకలేదని మెడ దగ్గర సెంటర్‌లైన్ వేసి స్టెమ్‌సెల్స్ సేకరించారు. ఆ స్టెమ్‌సెల్స్ తీసుకుని వచ్చి తమ్ముడికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. మామూలుగా రక్తం ఏవిధంగా ఎక్కిస్తారో.. అదే విధంగా స్టెమ్‌సెల్స్‌ను తమ్ముడికి ఎక్కించారు. ధూళికణాలు కూడా దూరని విధంగా ఉండే రూముల్లో తమ్ముడిని నెలరోజులు ఉంచారు.



> **కేన్సర్ బాధితులు మానసికంగా దృఢంగా ఉండి చికిత్స చేయించుకుంటే వ్యాధిని జయించవచ్చు. ఒకవేళ బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాల్సి వచ్చిన కూడా దోనర్‌కు ఎలాంటి సమస్య ఉండదు. అందుకు నేనే ఉదాహరణ.**

> **అక్క పునర్జన్మ ప్రసాదించింది : పవన్**
>
> 
>
> నాకు కేన్సర్ వచ్చిందని తెలిశాక మానసికంగా కుంగిపోయాను. ఇక నా జీవితం ముగిసిపోయిందనుకున్నా. అయితే నన్ను బతికించుకోవాలని స్టెమ్‌సెల్స్ ఇచ్చేందుకు అక్క ముందుకొచ్చింది. నా బ్లడ్ గ్రూపు 'బి' పాజిటివ్.. అక్క బ్లడ్ గ్రూపు 'ఎ' పాజిటివ్. అక్క స్టెమ్‌సెల్స్ నాకు ఎక్కించారు కాబట్టి ఆరు నెలలు గడిచేటప్పటికి నా శరీరంలోని రక్తం పూర్తిగా మారిపోయి అక్క మాదిరిగానే 'ఎ' పాజిటివ్‌గా మారిపోతుందట. ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసిన తర్వాత నుంచి వంద రోజుల వరకు ఏదైనా జరగొచ్చని డాక్టర్లు చెప్పారు. ఇప్పటికి వంద రోజులు దాటింది. మొదటి 30 రోజులకు, తర్వాత 60 రోజులకు, మళ్లీ 90 రోజులకు టెస్టులు చేశారు. మూడోసారి టెస్ట్ చేసేటప్పటికి నూరు శాతం ఉన్నాయి. అంటే ఇప్పుడు నా శరీరంలో పూర్తిగా కేన్సర్ కణాలు తొలగిపోయి.. మొత్తం అక్క కణాలే ఉన్నాయన్న మాట. అక్క తన మూలకణాలను దానం చేసి నాకు పునర్జన్మను ప్రసాదించింది. ఇప్పుడు జబ్బు నయం కావడంతో నేను కేన్సర్‌ను జయించినట్లే. కాలేజీకి వెళ్లి ఆగిపోయిన డిగ్రీ పూర్తి చేస్తాను.

కుంగిపోవాల్సిన అవసరం లేదు...

కేన్సర్ వ్యాధి సోకినంత మాత్రాన చనిపోతామని కుంగిపోవాల్సిన అవసరం లేదు. అత్యాధునిక చికిత్సా విధానాలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. బాధితులు మానసికంగా దృఢంగా ఉండి చికిత్స చేయించుకుంటే వ్యాధిని జయించవచ్చు. ఒకవేళ బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాల్సి వచ్చిన కూడా డోనర్‌కు ఎలాంటి సమస్య ఉండదు. అందుకు నేనే ఉదాహరణ. స్టెమ్‌సెల్స్ కలెక్ట్ చేసేటప్పుడు ఒక ఇంజక్షన్ ఇస్తారు. శరీరంలో రక్తం తక్కువగా ఉండటం వల్ల ఐదు బి12 ఇంజక్షన్లు ఇచ్చారు. ఒకవేళ ఇబ్బందులెదురైనా కూడా తమ్ముడు బతుకుతాడంటే నాకొచ్చే ఇబ్బందులేమీ పెద్దవి కాదని భావించాను. స్టెమ్‌సెల్స్ ఇచ్చినంత మాత్రాన నేనేమీ చనిపోను. నా స్టెమ్‌సెల్స్ తీసుకున్నా తర్వాత మళ్లీ మామూలుగానే వచ్చేస్తాయి. నేను యథావిధిగానే నార్మల్ లైఫ్ లీడ్ చేసుకోవచ్చు. కేన్సర్ అనేది నివారించలేని వ్యాధి కాదు. దానికీ మెరుగైన చికిత్సా విధానాలు, మందులు అందుబాటులోకి వచ్చాయి. డబ్బుల్లేవని చికిత్స తీసుకోకుండా నిస్సహాయంగా ఉండిపోవాల్సిన అవసరం లేదు. నిరుపేదలకు ఆపన్నహస్తం అందించేలా ట్రస్టులు ఉన్నాయి. సాయం చేసే దాతలు ఎంతోమంది ఉన్నారు. ప్రాణాలు నిలబెట్టడానికి మానవతా దృక్పథంతో ముందుకు వచ్చే డాక్టర్లున్నారు. ఈ విషయంలో ప్రజల్లో చైతన్యం పెరగాలి.

● సాంబత్తుల పాపారావు, విజయవాడ
ఫొటోలు: శ్రావణ్

క్యూరియాసిటీ పెంచుతున్న ఆండ్రాయిడ్ క్యూ

ఇప్పటికీ చాలా ఫోన్లలో ఆండ్రాయిడ్ పై ఆపరేటింగ్ సిస్టం పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానే లేదు. అప్పుడే గూగుల్ సంస్థ ఆండ్రాయిడ్ 10 (ఆండ్రాయిడ్ క్యూ) ఆపరేటింగ్ సిస్టం డెవలపర్ బిల్డ్ విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. గూగుల్ పిక్సెల్ వంటి ఫోన్లకి వెంటనే, వన్‌ప్లస్, ఎసెన్షియల్ వంటి ఫోన్లకి ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానుంది. మొబైల్ ప్రియుల్లో క్యూరియాసిటీని పెంచుతున్న ఆండ్రాయిడ్ క్యూ విశేషాలు ఇవి...



మరింత మెరుగ్గా ఫేస్ అన్‌లాక్

ఇటీవలి కాలంలో చాలా ఫోన్లలో ఫింగర్ ప్రింట్ సెన్సార్ పక్కన పెట్టేసి, నేరుగా ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ వాడబడుతోంది. వాస్తవానికి ఐఫోన్ ఎక్స్‌లో ప్రత్యేకమైన డాట్ ప్రొజెక్టర్, ఐఆర్ ఇల్యుమినేటర్స్, ఇతర హార్డ్‌వేర్ సెన్సార్ల ఆధారంగా, సెన్సార్ ఎదురుగా ఉన్నది నిజమైన మనిషా, లేదా ఫొటోనా అన్నది పరిశీలించబడి ఫోన్ లోపలికి వెళ్లడానికి యాక్సెస్ ఇవ్వబడుతుంది. అందుకే ఐఫోన్లలోకి బలవంతంగా లోపలకి చొరబడటం చాలా కష్టసాధ్యం. కానీ ఆండ్రాయిడ్ ఫోన్స్ విషయంలో కేవలం ఫ్రంట్ కెమెరా ఆధారంగా, అప్పటికప్పుడు మనకు తెలియకుండా ఒక ఫొటో క్యాప్చర్ చేసి, దాన్ని తమ వద్ద అప్పటికే రిజిస్టర్ అయిన ఓనర్ ఫొటోతో కంపేర్ చేసి, ఫోన్లోకి అనుమతించటం జరుగుతుంది. దీనివల్ల కొన్ని సందర్భాల్లో సంబంధిత మనిషి లేకపోయినా కూడా అతని ఫొటో చూపించినా కూడా ఫోన్‌లోకి వెళ్లే అవకాశం కలుగుతుంది. ఈ నేపథ్యంలో ఆండ్రాయిడ్ క్యూ ఆపరేటింగ్ సిస్టంలో ఐఫోన్ ఎక్స్ తరహాలో పూర్తిస్థాయి శక్తివంతమైన ఫేస్ అన్‌లాక్ సెన్సార్లని సపోర్ట్ చేసే మెకానిజం అందుబాటులో తీసుకురాబడుతోంది. దీంతో మన ఆండ్రాయిడ్ ఫోన్లు మరింత సెక్యూర్డ్‌గా తయారయ్యే అవకాశముంది.

పర్మిషన్ల నిర్వహణ

మన ఫోన్లో ఇన్‌స్టాల్ చేయబడిన అప్లికేషన్లు కెమెరా, లొకేషన్, మైక్రోఫోన్ వంటి వివిధ సెన్సార్లకి సంబంధించిన పర్మిషన్లని కంట్రోల్ చేసుకోవడానికి ఇప్పటికి అవకాశం ఉన్నప్పటికీ, మరింత శక్తివంతంగా ఆండ్రాయిడ్ క్యూలో పర్మిషన్ మేనేజ్‌మెంట్ రాబోతోంది. ఒక నిర్దిష్టమైన అప్లికేషన్



ఉపయోగించేటప్పుడు మాత్రమే అది సంబంధిత పర్మిషన్‌లు వాడుకునే విధంగా దీని ద్వారా ఏర్పాటు చేసుకోవచ్చు. ఉదాహరణకు మీరు గూగుల్ మ్యాప్స్‌కి ఎల్లప్పుడు లొకేషన్ పర్మిషన్ కేటాయించాల్సిన పనిలేకుండా, కేవలం ఆ యాప్ మీకు మీరు ఓపెన్ చేసినప్పుడు మాత్రమే సంబంధిత పర్మిషన్ కేటాయించబడి, దాన్ని క్లోజ్ చేసిన వెంటనే ఆటోమేటిక్‌గా ఆ పర్మిషన్ నిలుపుదల చేయబడే విధంగా ఆండ్రాయిడ్ క్యూలో ఏర్పాటు ఉండబోతోంది.



ఇప్పటికే ఆండ్రాయిడ్ పైలో డార్క్‌మోడ్ ఉంది. పరోక్షంగా ఫోన్ బ్యాటరీని ఆదా చేయడం కోసం ఇది ఉపయోగపడుతుంది. అయితే ప్రస్తుతానికి ఇది సిస్టం సెట్టింగ్స్, నోటిఫికేషన్ ఏరియా వంటి ఆపరేటింగ్ సిస్టమ్ కి సంబంధించిన ప్రదేశాల్లో మాత్రమే డార్క్‌బ్యాక్ గ్రౌండ్ ఉండే విధంగా వెసులుబాటు కల్పిస్తుంది. అయితే ఆండ్రాయిడ్ క్యూలో, అందుకు భిన్నంగా అన్ని చోట్లా సిస్టమ్ వైడ్ డార్క్‌మోడ్ ఉండేలా ఏర్పాటు చేయబడుతోంది. వాస్తవానికి ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్ వంటి యాప్స్ డార్క్‌మోడ్‌ని ప్రవేశపెడుతున్నపటికీ, మన ఫోన్లో ఇన్‌స్టాల్ చేసుకుని అన్ని రకాల యాప్స్ దీన్ని కలిగి ఉండే అవకాశం లేదు కాబట్టి, ఆండ్రాయిడ్ క్యూలో వాటిని కూడా బలవంతంగా డార్క్ మోడ్‌లోకి మార్చే ఏర్పాటు చేయబడుతుంది. తద్వారా ఒక్కసారి డార్క్ మోడ్ ఎంపిక చేసుకుంటే, ఇక అన్ని చోట్ల ఫోన్ బ్లాక్ బ్యాక్‌గ్రౌండ్‌తో తెలుపు అక్షరాలలో కనిపిస్తుంది.

అప్‌డేట్స్ వెంటనే....

మామూలుగా మన ఫోన్ అప్‌డేట్స్‌ని మన ఫోన్ తయారీ కంపెనీ అందించాల్సి ఉంటుంది. అంటే కంపెనీ దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతూ ఉంటాం అన్నమాట. అయితే అధిక శాతం ఫోన్ తయారీ కంపెనీలు లేటెస్ట్ అప్‌డేట్స్ ఇవ్వడం విషయంలో అశ్రద్ధ వహిస్తూ ఉండటంతో, గూగుల్ సంస్థ ఆండ్రాయిడ్ క్యూలో అపెక్స్ (అప్లికేషన్ ఎక్స్‌ప్రెస్) అనే కొత్త విధానాన్ని అనుసరించబోతోంది. అంటే, ఇకపై ఫోన్ తయారీ కంపెనీ మీద ఆధారపడాల్సిన పనిలేకుండా, అతి కీలకమైన మంత్లీ సెక్యూరిటీ ప్యాచ్‌లు, ఇతర అప్‌డేట్లను నేరుగా వినియోగదారుల గూగుల్ ప్లే స్టోర్‌లో ఎలాగైతే ఇతర అప్లికేషన్లను డౌన్‌లోడ్ చేసుకుంటారో అలా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ముఖ్యమైన అప్‌డేట్ లైబ్రరీ ఫైళ్లు ప్లే స్టోర్ ద్వారా అందుబాటులో ఉండే విధంగా గూగుల్ ఏర్పాటు చేస్తోంది.

డెస్క్‌టాప్ మోడ్!

చాలామందికి శాంసంగ్ గెలాక్సీ నోట్ 9 వంటి ఫోన్లలో ఉండే డెక్స్ అనే ప్రత్యేకమైన ఏర్పాటు గురించి తెలిసే ఉంటుంది. ఒక యుఎస్‌బి టైప్ - సి టు హెడ్‌డిఎంఐ కేబుల్ ద్వారా మీ ఫోన్‌ని ఏదైనా మోనిటర్‌కి కనెక్ట్ చేసినప్పుడు పూర్తిస్థాయి ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టం మన మానిటర్ మీద ప్రత్యక్షమవుతుంది. అయితే శాంసంగ్ వంటి సంస్థలు ఇలా తమకు తాము కొన్ని మోడళ్ల మీద ప్రవేశపెట్టిన ఇలాంటి సదుపాయాన్ని ఇప్పుడు గూగుల్ సంస్థ ఆండ్రాయిడ్ క్యూ ఆపరేటింగ్ సిస్టంలో మిగతా అన్ని ఫోన్లకీ పరిచయం చేయబోతోంది. అంటే ఇది వచ్చిన తర్వాత, మీ ఫోన్ తయారీ కంపెనీ ఒక ప్రత్యేకమైన డేటా కేబుల్ ద్వారా ఒక ఖాళీ మానిటర్‌కి మీ ఫోన్‌ని కనెక్ట్ చేసుకుంటే, పూర్తిస్థాయిలో ఆండ్రాయిడ్ డెస్క్‌టాప్ మీద వాడుకునే వెసులుబాటు లభిస్తుంది.

స్క్రీన్ రికార్డర్

స్క్రీన్ మీద జరుగుతున్నది ఉన్నది ఉన్నట్లు రికార్డు చేయడం కోసం చాలామంది గూగుల్ ప్లే స్టోర్ నుండి ప్రత్యేకమైన యాప్స్‌ని డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకుంటూ ఉంటారు. అయితే అలాంటి కొన్ని యాప్స్ మనకు తెలియకుండానే మన సున్నితమైన సమాచారాన్ని హ్యాకర్లకు చేరవేస్తున్న నేపథ్యంలో స్క్రీన్ రికార్డింగ్ సదుపాయాన్ని కూడా మీదుగా ఆపరేటింగ్ సిస్టంలోనే అంతర్భాగంగా కల్పించటం కోసం గూగుల్ సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. ఇది అందుబాటులోకి వస్తే, తరచూ వివిధ రకాల అవసరాల కోసం స్క్రీన్లను రికార్డ్ చేసుకునేవారు ఇక థర్డ్ పార్టీ యాప్స్ వాడాల్సిన అవసరం ఉండదు.

ఎమర్జెన్సీ బటన్

ఇప్పటికే ఇండియాలో విక్రయించబడుతున్న పలు ఫోన్లలో అత్యవసర సందర్భాల్లో ఉపయోగపడే విధంగా ప్యానిక్ బటన్ లభిస్తున్నప్పటికీ.. ఆండ్రాయిడ్ క్యూలో పవర్ బటన్ ప్రెస్ చేసినప్పుడు ఎమర్జెన్సీ సర్వీసులకి నేరుగా డయల్ చేయడానికి ఆప్షన్లతో కూడిన ప్రత్యేకమైన డయలర్ రాబోతోంది. ప్రమాదంలో ఉన్న మహిళలు, ఇతరులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

5జి ఇండికేటర్

2019లో చాలా ఫోన్లలో 5జి సదుపాయం రాబోతున్న తరుణంలో ఒకవేళ మన దగ్గర 5జి ఫోన్ ఉన్నా, మనం వాడుతున్న మొబైల్ నెట్‌వర్క్ 5జి కనెక్టివిటీని సపోర్ట్ చేసినప్పటికీ, దానికి సంబంధించిన ఇండికేటర్ మాత్రం ఇప్పటివరకు రెడీగా లేదు. ఈ నేపథ్యంలో ఆండ్రాయిడ్ క్యూలో 5జి, 5జి ప్లస్ అనే రెండు రకాల ప్రత్యేకమైన నెట్‌వర్క్ ఇండికేటర్లు రాబోతున్నాయి.

వీటితోపాటు వైఫై సెక్యూరిటీ కోసం డబ్ల్యూపిఎ3 సపోర్ట్, థర్డ్ పార్టీ యాప్స్‌కి ఆర్‌సిఎస్ మెసేజింగ్ సపోర్ట్, సెన్సార్లని ఆఫ్ చేసే ఆప్షన్, ప్రత్యేకమైన ప్రైవసీ ఇండికేటర్లు కొత్తగా రాబోతున్నాయి. అలాగే చాలాకాలంగా అందుబాటులో ఉన్న ఆండ్రాయిడ్ బీమ్ తొలగించబడుతోంది. ఆండ్రాయిడ్ క్యూ ఫైనల్ వెర్షన్ నాటికి అనేక మరిన్ని కొత్త మార్పులు చోటు చేసుకునే అవకాశం కూడా ఉంది.



నల్లమోతు శ్రీధర్
fb.com/nallamothusridhar



టెక్ న్యూస్

చిప్ గోరంత... స్టోరేజ్ కొండంత!

1 టీబీ అంటే ఎవరికైనా హార్డ్ డిస్క్ డ్రైవ్‌లే గుర్తొస్తాయి మీ ఫోన్లలో స్టోరేజీని పెంచుకోవడం కోసం 512 జీబీ వరకూ మెమొరీ కార్డు వినియోగిస్తూ ఉంటారు. కానీ అది గతం అంటోంది శామ్‌సంగ్ ఇప్పటికే తన గెలాక్సీ నోట్ 9లో 512 జీబీ ఇంటర్నెల్ స్టోరేజీని పొందుపరిచింది. త్వరలోనే 1టీబీ ఫోన్లను తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది ఆ సంస్థ. హార్డ్ డిస్క్ డ్రైవ్‌ల్లో పట్టేంత అంత స్టోరేజీని ఓ చిన్న చిప్ సైజ్‌కి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తోంది. ఇలా 1టీబీ స్టోరేజీ ఫోన్లు వస్తే గనక, 4కె రిజల్యూషన్‌తో వీడియోలు షూట్ చేసుకునే అవకాశం ఉంటుంది. అంతేకాదు డౌన్‌లోడ్ చేసుకున్న హైక్వాలిటీ వీడియోలను కూడా అంతే క్లారిటీతో చూడవచ్చు. ఈ ఫోన్ల ధర ఎంతో చెప్పలేదు గానీ 512 జీబీ స్టోరేజీతో వచ్చిన గెలాక్సీ నోట్ 9 మాత్రం రూ. 84,990. మరి ఈ 1టీబీ ఫోన్ ధర ఎంత ఉంటుందో మీరే ఊహించుకోవచ్చు.



నయా యాప్

స్మోకింగ్‌కు చెక్!

స్మోకింగ్ కారణంగా మృత్యువాత పడుతున్నవాళ్లు ఎంతోమంది! పొగతాగడం ఆరోగ్యానికి హానికరం... అని బోర్డులు పెట్టినా సినిమా థియేటర్లలో హోరెత్తించినా 'ఆ అలవాటు మానుకోలేకపోతున్నాం' అని నిర్వేదంగా బదులిచ్చేవాళ్లున్నారు. ధూమపానం అలవాటు నియంత్రించుకోవాలనుకునేవారికి ఓ స్మార్ట్ యాప్ సాయం చేయడానికి సిద్ధమవుతోంది. దీని పేరు 'హెల్త్‌స్పాన్'. స్మోకింగ్ మానేస్తే ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో చెప్పడానికి గూగుల్ ఎలాగో సిద్ధంగా ఉంటుంది. అయితే ఈ యాప్ ఇన్‌స్టాల్ చేసుకుంటే పొగతాగడం మానేయడం వల్ల మీ శరీరంలో ఎలాంటి మార్పులు వస్తున్నాయో ఈ యాప్ గుర్తించి చెబుతుంది. అంతేకాదు మీరు ఇంకా ఎంతకాలం బతికే ఛాన్స్ ఉంటుందో లెక్కకట్టి చెప్పడం 'హెల్త్‌స్పాన్' ప్రత్యేకత.


టెక్ గురు

మల్టిపుల్ కాంటాక్టుల సమస్య పోయేదెలా?

నా ఫోన్లో 30, 40 కాంటాక్టులు పలుమార్లు రిపీట్ అయి కనిపిస్తున్నాయి. వాటిని ఎన్నిసార్లు డిలీట్ చేసినా మళ్లీ మళ్లీ వస్తున్నాయి. ఆ ఫోన్లో మూడు జీమెయిల్ అకౌంట్లతో లాగిన్ అయ్యాను. కాంటాక్టుల విషయంలో నాకు తలెత్తుతున్న సమస్యకు పరిష్కారం సూచించగలరు?

- దీపక్ తేజ, పార్కుపల్లి

మీరు చెప్పిన దాని ప్రకారం, ఒక ఆండ్రాయిడ్ ఫోన్‌కి మూడు జీమెయిల్ ఐడిలు లింక్ చేసినప్పుడు తప్పనిసరిగా ఆయా అకౌంట్లలో ఉన్న కాంటాక్టులు అన్నీ వాటంతట అవే సింక్ చేయబడుతుంటాయి. ఆండ్రాయిడ్ ఫోన్లు గూగుల్ కాంటాక్ట్స్‌లో ఉన్న కాంటాక్టులను మన ఫోన్లోకి తీసుకు వస్తూ ఉంటాయి. ఈ నేపథ్యంలో ఒకవేళ మీ దగ్గర శ్రీధర్ అనే కాంటాక్ట్ మీ మూడు జీమెయిల్ అకౌంట్లలో సేవ్ చేయబడి ఉన్నట్లయితే, అది మీ ఫోన్లో మూడుసార్లు డూప్లికేట్‌గా కన్పిస్తుంది. ఇక్కడ మీరు చేయవలసిందల్లా ప్రధానంగా మీరు వాడుతున్న ఒక జీమెయిల్ అకౌంట్ మాత్రమే ఉంచి, మిగతావి మీ ఫోన్ సెట్టింగ్స్‌లో అకౌంట్స్ విభాగం నుండి తొలగించటం! లేదా మూడూ కావాలనుకుంటే, మిగిలిన రెండు అకౌంట్లలో కాంటాక్ట్స్ సింక్ డిసేబుల్ చేసి, గూగుల్ ప్లే స్టోర్‌లో లభించే డూప్లికేట్ కాంటాక్ట్స్ రిమూవర్ వంటి యాప్స్ ద్వారా డూప్లికేట్ కాంటాక్ట్స్ తొలగించడం మాత్రమే తగిన పరిష్కారం.



**మీ టెక్ సందేహాలకు సమాధానాల కోసం
navya@andhrajyothy.com**

టెక్ సందేహాలు

ఆ యాప్ మంచిదేనా?

చాలామంది గూగుల్ ప్లే స్టోర్‌లో లభించని జిబి వాట్సప్ డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకుంటున్నారు. ఈ యాప్ వాడడం మంచిదేనా?

- సొహైయిల్, కడప

వాట్సప్ సోర్స్ కోడ్‌ని డీకంపైల్ చెయ్యడం ద్వారా అందులో ప్రత్యేకమైన ఫ్లాగ్‌లను తొలగించి అదనపు సదుపాయాలు కల్పించేలా జిబి వాట్సప్ వంటివి పనిచేస్తాయి. వీటిని మాడెడ్ వాట్సప్‌లుగా పరిగణిస్తారు. ఉదాహరణకి వీటి ద్వారా పెద్ద స్థాయిలో వీడియో అటాచ్‌మెంట్లని పంపుకోవడం, ఆటో రిప్లైలు సెట్ చేయడం వంటి పలు రకాల ప్రయోజనాలు ఉన్నప్పటికీ, జిబి వాట్సప్ వంటివి యూజర్లకి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని దొంగతనం చేస్తున్నట్లు అనేక ఆధారాలతో సహా బయటపడింది. కాబట్టి ఇలాంటి వాటికి దూరంగా ఉండటం మంచిది. వాట్సాప్ నియమాల ప్రకారం ఇలాంటి మాడెడ్ వెర్షన్లని వాడడం నిషిద్ధం. ఒకవేళ మీరు వాటిని వాడుతున్నట్లు వాట్సప్ సంస్థ గుర్తించినట్లయితే, మీ వాట్సప్ అకౌంట్ బ్లాక్ చేసే ప్రమాదం కూడా ఉంది!



ఫోల్డర్ లాక్ చేసుకొనేదెలా?



నా కంప్యూటర్లో డి డ్రైవ్‌లో కొన్ని ముఖ్యమైన ఫోల్డర్లు ఉన్నాయి. వాటిని పాస్‌వర్డ్‌తో లాక్ చేసుకోవచ్చా?

- శేఖర్, హైదరాబాద్

ఫోల్డర్ లాక్, ఐఒబిట్ ప్రొటెక్టెడ్ ఫోల్డర్, సీక్రెట్ ఫోల్డర్, సీక్రెట్ డిస్క్, లాక్-ఎ-ఫోల్డర్ వంటి అనేక రకాల ఫోల్డర్లని లాక్ చేసే టూల్స్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ కోసం అందుబాటులో ఉన్నాయి. వీటి సాయంతో సులభంగా మీరు కోరుకున్న ఫోల్డర్లను లాక్ చేసుకోవచ్చు గానీ, కొన్ని సందర్భాల్లో పొరపాటున ఆ విషయం మర్చిపోయి సి డ్రైవ్ ఫార్మాట్ చేసి, విండోస్ తాజాగా ఇన్‌స్టాల్ చేసినట్లయితే, అప్పటివరకు డి డ్రైవ్‌లో మీరు లాక్ చేసిన ఫోల్డర్లు ఎందుకు పనికి రాకుండా నిరుపయోగంగా మారిపోతాయి. కాబట్టి అలాంటి సాఫ్ట్‌వేర్లను చాలా అప్రమత్తంగా వాడాలి.

డైలీ సుడోకు - 442

	2	5			8			6
		8			2			
	6		3		7			5
	9							7
		3		4		6		
1							9	
5			8		3		6	
			1			7		
4			9			5	1	

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 441 సమాధానం

9	5	7	2	8	6	4	3	1
2	6	4	1	7	3	8	9	5
8	1	3	5	9	4	2	6	7
7	3	1	6	5	2	9	4	8
5	9	2	8	4	7	6	1	3
4	8	6	3	1	9	7	5	2
3	2	5	9	6	8	1	7	4
6	4	8	7	3	1	5	2	9
1	7	9	4	2	5	3	8	6

'మల్లేశం'... ఎక్స్‌ట్రార్డినరీ!


అనన్య, ప్రియదర్శి

"తెలంగాణకు చెందిన 'మల్లేశం: ఎక్స్‌ట్రార్డినరీ స్టోరీ ఆఫ్ యాన్ ఆర్డినరీ మ్యాన్' సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేయడం సంతోషంగా ఉంది. ఈ చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్' అని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్ చేశారు. స్టూడియో 99 ఫిల్మ్స్ పతాకంపై రూపొందుతోన్న చిత్రం 'మల్లేశం'. పోచంపల్లికి చెందిన 'పద్మశ్రీ' అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా తెరకెక్కుతోంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను ఆదివారం సిరిసిల్ల జిల్లాలో విడుదల చేశారు. ఇందులో మల్లేశం పాత్రలో ప్రియదర్శి నటిస్తున్నారు. అనన్య, ఝాన్సీ, చక్రపాణి కీలక పాత్రధారులు. రాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తుండగా, శ్రీ అధికారి, రాజ్. ఆర్ నిర్మిస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "అగ్గిపెట్టెలో పట్టేంత చిన్న చీరలను కూడా నేసి ప్రపంచాన్ని విస్మయానికి గురయ్యేలా చేసిన వ్యక్తి మల్లేశం. తను సాధించిన విజయాలతో చేనేత ప్రాముఖ్యతను దేశవ్యాప్తంగా చాటి చెప్పిన ఘనత ఆయనది. ఇలాంటి గొప్ప వ్యక్తి జీవితం ఆధారంగా 'మల్లేశం'ను తెరకెక్కిస్తున్నాం. షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది" అని అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: బాలు శాండిల్యస, సౌండ్ డిజైన్: నితిన్ లుకోస్, సంగీతం: మార్క్.కె.రాబిన్, మాటలు: పెద్దింటి అశోక్‌కుమార్, పాటలు: గోరటి వెంకన్న, చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: వెంకట్ సిద్ధారెడ్డి.

మహాతో రిషి!


మహేశ్, పూజా హెగ్డే

రిషి పాత్రలో మహేశ్‌బాబు నటిస్తున్న చిత్రం 'మహర్షి'. వంశీ పైడిపల్లి దర్శకుడు. పూజా హెగ్డే కథానాయిక. చిత్రంలో ఆమె పేరు 'మహా' అని సమాచారం. ఇప్పటివరకూ చిత్రంలో మహేశ్ లుక్స్, టీజర్ మాత్రమే విడుదల చేశారు. పూజా హెగ్డే లుక్ విడుదల చేయలేదు. కానీ, ఆదివారం అనూహ్యంగా మహేశ్, పూజా హెగ్డే జంటగా ఉన్న స్టిల్ సోషల్ మీడియాలో ప్రత్యక్షమైంది. కొద్ది క్షణాల్లో ఈ స్టిల్ వైరల్ అయింది. అశ్వనీదత్, 'దిల్' రాజు, పివిపి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ప్రమోషన్ వచ్చినట్లు భావిస్తున్నా

\- రాజశేఖర్


ప్రశాంత్ వర్మ, రాజశేఖర్, జీవిత

"లైట్స్ కొనడానికి కూడా డబ్బులు లేని సమయంలో ఓ తమిళ హిట్ సినిమా రీమేక్ రైట్స్ కొని నన్ను నిర్మాతను చేశారు జీవిత రాజశేఖర్ దంపతులు. ఈ రోజున నేను ఈ స్థాయిలో ఉన్నానంటే శ్రీహరి, రాజశేఖర్ ఇద్దరూ కారణం" అని సి.కల్యాణ్ అన్నారు. రాజశేఖర్ హీరోగా సి.కల్యాణ్ నిర్మిస్తున్న సినిమా 'కల్కి'. ప్రశాంత్ వర్మ దర్శకుడు. అదా శర్మ, నందితా శ్వేత, స్కార్లెట్ విల్సన్ కథానాయికలు. సోమవారం రాజశేఖర్ పుట్టినరోజు సందర్భంగా టీజర్‌ను విడుదల చేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ "'గరుడవేగ' తర్వాత మరో చక్కని కథ కుదిరింది. ఈతరం కుర్రాళ్ల ఆలోచనలు కొత్తగా ఉంటాయని ప్రశాంత్‌కు పూర్తి స్వేచ్ఛ, బాధ్యతను అప్పగించాం. 'శేషు' సినిమా తర్వాత సి.కల్యాణ్ గారి సంస్థలో మళ్లీ యాక్ట్ చేయడం ప్రమోషన్ వచ్చినట్టు భావిస్తున్నా" అని అన్నారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ "1980 నేపథ్యంలో సాగే కథ ఇది. మే నెలలో సినిమాను విడుదల చేయాలని అనుకుంటున్నాం" అని చెప్పారు. "నా మొదటి సినిమాలా కాకుండా అందరికీ అర్థమయ్యేలా ఈ సినిమా తీస్తున్నా. దీనికి సీక్వెల్ కూడా చెయ్యాలనుంది" అని దర్శకుడు అన్నారు. "పాతాళానికి వెళ్లిన తర్వాత మళ్లీ సక్సెస్‌లోకి రాగలుగుతామా? లేదా? అన్న భయం వెంటాడింది. ఎన్ని కోట్లు ఉన్నా కెరీర్‌ని, సక్సెస్‌ని కొనలేం. అటువంటి సమయంలో 'గరుడవేగ' రూపంలో పెద్ద సక్సెస్ వచ్చింది. మళ్లీ అదే స్థాయి కథ కుదిరింది" అని జీవిత చెప్పారు.

విజయ్ దేవరకొండతో...


కేథరిన్

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా కె.ఎస్. రామారావు సమర్పణలో కె.ఎ. వల్లభ ఓ చిత్రం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. 'ఓనమాలు', 'మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు' చిత్రాల ఫేమ్ క్రాంతిమాధవ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి ఇంకా టైటిల్ ఖరారు చేయలేదు. ఇందులో కేథరిన్‌ను ఓ నాయికగా ఎంపిక చేశారు. చిత్ర ప్రారంభోత్సవంలో రాశీ ఖన్నా, ఐశ్వర్యా రాజేశ్, ఇసబెల్లా నాయికలు అని ప్రకటించారు. కేథరిన్‌తో ఈ చిత్రంలో మొత్తం నలుగురు కథానాయికలు అన్నమాట! రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం జరుగుతోంది. సింగరేణి నేపథ్యంలో వచ్చే సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఈ చిత్రానికి గోపీసుందర్ స్వరకర్త.

అందమైన జర్నీ.. అర్థం చెప్పింది!


తాప్సీ

"నా సినిమా కెరీర్‌లో మరో అందమైన జర్నీ పూర్తయింది. 'మిషన్ మంగళ్' షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ చిత్రం నాకు సమష్టి కృషికి అర్థం చెప్పింది" అని తాప్సీ పన్ను అన్నారు. అక్షయ్‌కుమార్, విద్యాబాలన్, నిత్యామీనన్, సోనాక్షి సిన్హా నటిస్తున్న 'మిషన్ మంగళ్‌యాన్'లో తాప్సీ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఫాక్స్ స్టార్ స్టూడియోస్‌తో కలిసి కేప్ ఆఫ్ గుడ్‌ఫిల్మ్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి అమిత్ త్రివేది సంగీతాన్ని అందిస్తున్నారు. జగన్ శక్తి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం గురించి తాప్సీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "నేను సంతకం చేసే ప్రతి చిత్రాన్నీ గురువుగా భావిస్తాను. ప్రతి గురువు తన శిష్యులకు ఎంతో కొంత నేర్పిస్తారు. 'మిషన్ మంగళ్' నాకు టీమ్ వర్క్‌ను మరింత అందంగా, సునిశితంగా, గొప్పగా అర్థం చేసుకోవడానికి తోడ్పడింది. ఈ చిత్రంలో ప్రతి ఫ్రేమ్‌లోనూ అద్భుతమైన నటీనటులు కనిపిస్తారు. ఆగస్ట్ 15న భారతదేశంలో అసలు సిసలైన పండుగ వాతావరణం నెలకొంటుంది" అని అందులో తెలిపారు. "చిరునవ్వుతో దేన్నైనా సాధించవచ్చు. ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చు. కానీ ముఖం ముడుచుకోవడం వల్ల ఫలితం ఉండదని నా నమ్మకం" అని ఆమె మరో పోస్ట్‌లో చెప్పారు.



సందేశానికి కనెక్ట్ అవుతున్నారు

\- నిర్మాతలు


శివ కంఠంనేని

"అక్కడొకడుంటాడు' సినిమాకు ఆదరణ బావుంది. డ్రంకన్ డ్రైవ్ నేపథ్యంలో ఇచ్చిన సందేశానికి ప్రేక్షకులు కనెక్ట్ అవుతున్నారు" అని నిర్మాతలు కె.శివశంకరరావు, రావుల వెంకటేశ్వరరావు అన్నారు. శివ కంఠంనేని కీలక పాత్రలో రామ్ కార్తీక్, శివహరీష్, అలేఖ్య, రసజ్ఞ దీపిక హీరోహీరోయిన్లుగా శ్రీపాద విశ్వక్ దర్శకత్వం వహించిన 'అక్కడొకడుంటాడు' చిత్రం ఇటీవల విడుదలైంది. ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిర్మాతలు మాట్లాడుతూ "ఉత్కంఠగా సాగే ఈ చిత్రం చివరి సన్నివేశం వరకూ ప్రేక్షకుల్ని కూర్చోబెడుతుంది. థియేటర్ల విషయంలో సి.కల్యాణ్ ఎంతో సహకరించారు" అని చెప్పారు. "కొత్తదనానికి పట్టంకడుతున్న నేటి ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా తీసిన చిత్రమిది. మేం అనుకున్న టార్గెట్ రీచ్ అయ్యాం" అని దర్శకుడు అన్నారు.

నచ్చిన జోనర్ సినిమా చేశా

\- సచిన్ జోషి


సచిన్, సి.కల్యాణ్

సచిన్ జోషి హీరోగా భూషణ్‌పటేల్ దర్శకత్వంలో హిందీలో తెరకెక్కించిన 'అమావాస్' చిత్రం తెలుగులో 'అమావాస్య' టైటిల్‌తో విడుదల కానుంది. నర్గీస్ ఫక్రీ కథానాయిక. సచిన్‌జోషి, దీపెన్ అమీన్ తెలుగులోకి అనువదిస్తున్నారు. ఈ నెల 8న విడుదల కానున్న ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుక శనివారం హైదరాబాద్‌లో జరిగింది. సి.కల్యాణ్ బిగ్ సీడీని ఆవిష్కరించారు. హారర్ కథలకు ఎప్పుడూ ఆదరణ బావుంటుందని సి.కల్యాణ్ తెలిపారు. సచిన్ జోషి మాట్లాడుతూ "ఇలాంటి కథ కోసం చాలాకాలంగా ఎదురు చూస్తున్నా. నా గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉండే హారర్ క్లాసికల్ సినిమా ఇది. తెలుగు సినిమాకు ఎక్కువ ప్రాధాన్యమిస్తాను. అందుకే ఒకే రోజున తెలుగు, హిందీ భాషల్లో విడుదల చేస్తున్నాం" అని అన్నారు. "కథకు తగ్గట్టు వి.ఎఫ్.ఎక్స్‌కు మంచి స్కోపున్న సినిమా ఇది. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి తెరకెక్కించాం" అని దర్శకుడు చెప్పారు.

భావోద్వేగంతో...


సొనాలీ బెంద్రే

"ప్రస్తుతం నా మనసులో ఉన్న భావాలకు మాటల రూపం ఇవ్వడం కష్టం. కెమెరా ముందు నిలుచుని భావోద్వేగాలను పలికించడంలో ఉన్న ఆనందం చాలా గొప్పది" అని సొనాలీ బెంద్రే తెలిపారు. గత కొంతకాలంగా కేన్సర్‌కు చికిత్స తీసుకుంటున్న ఆమె ఇటీవల భారతదేశానికి తిరిగి వచ్చారు. తాజాగా షూటింగ్‌లో పాల్గొన్నారు. అయితే అది ఏ షూటింగ్ అనే విషయాన్ని ఆమె వెల్లడించలేదు. సోషల్ మీడియాలో ఫొటోను పంచుకుని "సుదీర్ఘమైన విరామం తర్వాత చేస్తున్న షూటింగ్. గత కొన్ని నెలలుగా నా భావోద్వేగాలు అదుపులో లేవు. ఇప్పుడు నా పనికి తగ్గట్టు భావోద్వేగాలను వ్యక్తం చేయడం ఆనందంగా ఉంది" అని తెలిపారు.



అమెరికాలో నకిలీ వీసా రాకెట్‌ను అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు ఛేదించారు. విదేశీ విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన అంతర్జాతీయ విద్యార్థి వీసా పథకం దుర్వినియోగం అవుతోందని గుర్తించిన అమెరికా హోంలాండ్ సెక్యూరిటీ విభాగానికి చెందిన 'ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ)' అధికారులు.. 'పేపర్ చేజ్' పేరుతో ఒక రహస్య ఆపరేషన్ ప్రారంభించారు. అందులో భాగంగా.. 2015లో మిషిగన్‌లోని ఫార్మింగ్టన్ హిల్స్‌లో 'యూనివర్సిటీ ఆఫ్ ఫార్మింగ్టన్' అనే పేరుతో నకిలీ యూనివర్సిటీని సృష్టించారు. ఆ యూనివర్సిటీని ఉపయోగించుకుని అమెరికాలో అక్రమంగా నివసించాలనుకునేవారిని, వారిని విద్యార్థులుగా చేర్చుకోవడం ద్వారా ఇమిగ్రేషన్ కుంభకోణాలకు పాల్పడేవారిని పట్టుకోవడమే ఈ 'ఆపరేషన్ పేపర్ చేజ్' లక్ష్యం. ఈ వ్యవహారంలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులు అరెస్టయ్యారు. దీంతో అమెరికా చదువులు, వీసాపై మరోసారి చర్చ మొదలైంది. డాలర్ డ్రీమ్స్‌తో అక్కడే ఉండాలనే ఉద్దేశంతో నిబంధనలను అతిక్రమిస్తుండటంతో కలలు కాస్త కల్లలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటువంటి పరిస్థితులు తలెత్తడానికి కారణాలు, వీసా వ్యవహారాలు సంబంధిత అంశాలపై విశ్లేషణ..

తప్పటడుగులు వేయిస్తోన్న..

డాలర్ డ్రీమ్స్

విదేశీ విద్య దిశగా ఆలోచన ఉన్న విద్యారులల్లో అధిక శాతం మంది లక్ష్యం అమెరికా. అవకాశాల స్వర్గం, ప్రతిభావంతులను రారమ్మని ఆహ్వానించే దేశంగా భారతీయ విద్యార్థుల్లో అమెరికా అంటే ఎనలేని ఆదరణ నెలకొంది. ముఖ్యంగా తెలుగు విద్యార్థుల్లో. దీంతో చాలా మంది ఉన్నత విద్య కోసం అమెరికన్ యూనివర్సిటీల్లో వాలిపోతుంటారు. అక్కడ కోర్సు పూర్తిచేస్తే తిరుగులేని కెరీర్ సొంతమవుతుందని భావించి, ఏటా లక్షల మంది ఆ దిశగా ప్రయత్నిస్తుంటారు. ఇందుకు అవసరమైన అంశాల్లో స్టూడెంట్ వీసా కీలకమైంది. ఎవరైనా విదేశీయుడు తమ దేశంలో నిర్దేశిత కాలంపాటు నివసించడానికి సదరు దేశం అనుమతించే ప్రక్రియను వీసాగా పేర్కొంటారు. ఇందుకోసం అక్కడి ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతి పొందాల్సి ఉంటుంది.

వీసాకు దరఖాస్తు

ఏదైనా అమెరికన్ యూనివర్సిటీలో అడ్మిషన్ ఖరారైతే.. సదరు వర్సిటీ ఇచ్చే కన్ఫర్మేషన్ లెటర్ ఆధారంగా ఇమిగ్రేషన్ విభాగంలో ఐ-20 ఫామ్‌ను పూర్తిచేయాలి. దాని ద్వారా వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. వీటిని పరిశీలించిన ఇమిగ్రేషన్ విభాగం అధికారులు నిర్దేశిత తేదీల్లో ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఇంటర్వ్యూ సందర్భంగా అప్రమత్తంగా వ్యవహరించాలి. కోర్సు పూర్తయ్యాక స్వదేశానికి తిరిగొచ్చేస్తామనే విధంగానే సమాధానాలు ఇవ్వాలి. లేకుంటే వీసా మంజూరు కష్టమే.

బహుళ వీసా విధానం

అమెరికాలో బహుళ వీసా విధానంలో అమల్లో ఉంది. ఒక్కో టాస్క్‌ను బట్టి ఒక్కో వీసాను కేటాయిస్తారు. అటువంటి వాటిలో ఎఫ్-1, ఎం-1, జె-1, హెచ్1 బీ తదితరాలు. ఉన్నత విద్య కోసం అమెరికాకు వచ్చే అంతర్జాతీయ విద్యార్థుల కోసం ఎఫ్-1, ఎం-1, జె-1 అనే మూడు రకాల వీసాలను మంజూరు చేస్తారు. సాధారణంగా అమెరికాలో ఉన్నతవిద్యకు వెళ్లే విద్యార్థులకు ఎఫ్-1 (నాన్-ఇమిగ్రెంట్) వీసా ఇస్తారు. అక్కడి ప్రభుత్వం నుంచి అక్రెడిటేషన్ పొందిన యూనివర్సిటీల్లో అడ్మిషన్ పొందిన వారికి ఈ వీసా లభిస్తుంది. స్వల్పకాలిక వృత్తివిద్యా (ఒకేషనల్ నాన్ అకడమిక్) కోర్సుల్లో చేరే వారికి ఎం-1 స్టూడెంట్ వీసా ఇస్తారు. వర్క్-స్టడీ బేస్డ్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమం కింద జె-1 వీసాను మంజూరు చేస్తారు. అమెరికా వెళ్లిన విద్యార్థి తన వీసా స్టేటస్‌ను నిలుపుకోవడం అత్యంత కీలకం. ఇందుకోసం అక్కడి 'సెవిస్' (స్టూడెంట్ & ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్)లో కచ్చితంగా తన వివరాలను నమోదు చేయించుకోవాలి. తన వివరాలు ఎప్పటికపుడు అప్‌డేట్‌గా ఉండేలా చూసుకోవాలి. నాన్ ఇమిగ్రెంట్ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు, వారి డిపెండెంట్లు అమెరికాలో ఉండగా, వారి కరెంట్ స్టేటస్ వివరాలను సేకరించే వ్యవస్థనే 'సెవిస్' అంటారు.

స్టూడెంట్ వీసా 'ఎఫ్-1'

అంతర్జాతీయ విద్యార్థుల్లో ఎక్కువ మంది 'ఎఫ్-1' వీసా కింద ప్రవేశం పొందుతుంటారు. విశ్వవిద్యాలయం, కళాశాల, ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, సెమినరీ, కన్సర్వేటరీ / ఇతర విద్యాసంస్థల్లో (లాంగ్వేజ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్‌తో సహా) చదువుకోవడానికి వెళ్లేవారు 'ఎఫ్-1' వీసా కేటగిరీ పరిధిలోకి వస్తారు. ఎఫ్-1 వీసా కోసం ఎంత ముందుగా దరఖాస్తు చేసినా, యూఎస్‌లో ప్రవేశం లభించిన స్కూలులో చదవడానికి అక్కడ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన నిర్ణీత తేదీకి 120 రోజుల ముందు మాత్రమే యూఎస్ కాన్సులేట్లు స్టూడెంట్ వీసాను మంజూరు చేయగలుగుతాయి. అలాగే ఎఫ్-1 వీసా ముందుగా వచ్చినా, తొలిసారిగా యూఎస్‌లో విద్యాభ్యాసానికి వెళుతున్నవారు తమ కోర్సు ప్రారంభమయ్యే తేదీకి 30 రోజుల కంటే ముందుగా అమెరికాలో ప్రవేశించడం కుదరదు. ఒకవేళ వెళ్లాలనుకుంటే టూరిస్టు వీసాపై వెళ్లవచ్చు. ఆ వీసాలో తాను ప్రాస్పెక్టివ్ స్టూడెంట్‌గా నమోదు చేయించుకోవాలి. ఎఫ్-1 మీద ఒక కమ్యూనిటీ కళాశాలలో చదివే విద్యార్థి అక్కడ విద్యాభ్యాసం పూర్తి చేశాక అమెరికాలో ఒక విశ్వవిద్యాలయానికి మారే వీలుంది. ఎఫ్-1 వీసా హోల్డర్లు క్యాంపస్‌లో వారానికి 20 గంటలపాటు పార్ట్‌టైమ్ జాబ్ చేయవచ్చు. అంతకు మించి ఆఫ్‌క్యాంపస్‌లో పని చేయాలంటే మాత్రం యూఎస్ సిటిజన్‌షిప్ & ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) నుంచి అనుమతి తీసుకోవాలి. ఎఫ్-1 వీసా హోల్డర్ తన జీవిత భాగస్వామిని, 21 ఏళ్లలోపు గల తన అవివాహిత సంతానాన్ని ఎఫ్-2 వీసాపై అమెరికా తీసుకువెళ్లవచ్చు. ఎఫ్-2 వీసా హోల్డర్స్ నిబంధనలకు లోబడి చదువుకోవచ్చు. కానీ ఉద్యోగం చేయడానికి అనుమతించరు.

ఆంక్షలు.. అనిశ్చితి ఉన్నా సరే

లక్షలాది భారతీయ విద్యార్థులకు అమెరికా చదువు ఒక కల. వీసాలపై ట్రంప్ సర్కారు ఆంక్షలు, అక్కడి అనిశ్చితి పరిస్థితులు అయినప్పటికీ మన విద్యార్థులకు అమెరికాపై మోజు తగ్గలేదు. అమెరికాలో చైనా, బ్రెజిల్, కెనడా, మెక్సికో, జపాన్, తైవాన్, వియత్నాం విద్యార్థులు కూడా అధిక సంఖ్యలో ఉంటారు. వీసా అక్రమాలు వంటి వ్యవహారాల్లో భారతీయ విద్యార్థులే ఎక్కువ సంఖ్యలో ప్రభావితమవుతున్నారు. దీనికి ప్రధానమైన కారణం డాలర్ డ్రీమ్స్. అడ్డదారులు తొక్కయినా హెచ్1బీ వీసాను పొంది గ్రీన్ కార్డు సాధించి శాశ్వతంగా అక్కడే ఉండిపోవాలని ప్రయత్నించడం. ఉన్నత విద్యావంతులై, అన్నీ అంశాలపై అవగాహన ఉండి కేవలం అమెరికాలో స్థిరపడాలనే సంకల్పంతో నిబంధనల ఉల్లంఘనకు సైతం వెనుకాడడం లేదు. ఇక్కడ గమనించాల్సిన విషయం.. అమెరికా లేదా మరేదేశమైనా ఇమిగ్రేషన్ రూల్స్ విషయంలో కఠినంగా వ్యవహరిస్తుంది. ఈ విషయంలో అక్కడి ప్రభుత్వాన్ని నిందించాల్సిన అవసరం లేదు. నిబంధనల మేరకు నడుచుకుంటూ ఉండటమే మంచిది. అలాకాకుండా తప్పుడు మార్గాలను అనుసరిస్తే కొత్త చట్టం ప్రకారం 10 ఏళ్ల వరకు బహిష్కరణకు గురయ్యే ప్రమాదం ఉంది. 2018 ఆగస్టు 9న ఆ దేశం తీసుకొచ్చిన చట్టం ప్రకారం 180 రోజులకు మించి అక్రమంగా దేశంలో ఉంటే అమెరికన్ చట్టాల ప్రకారం వారిని ప్రాసిక్యూట్ చేస్తారు, అంతేకాక వారు మళ్లీ అమెరికాలో అడుగుపెట్టకుండా మూడు నుంచి 10 సంవత్సరాల పాటు నిషేధం విధిస్తారు. ఈ క్రమంలో స్టేటస్ (అంటే విద్యార్థిగా చదువుకోడానికి అక్కడ నివాసం ఉండడానికి ఉన్న అర్హత) కోల్పోయిన వారు ఒక్క క్షణం కూడా ఉండరాదు. ఎన్ని రోజులు ఆ స్టేటస్‌ను అతిక్రమిస్తే - దాన్ని బట్టి నిషేధం ఎన్నేళ్లు విధిస్తారన్నది ఉంటుంది. ఉల్లంఘన పీరియడ్ గనక మొదలైతే ఎఫ్-1 నుంచి హెచ్-1బీ కి మారడం కూడా చాలా కష్టం. కాబట్టి స్టేటస్‌ను పూర్తిగా కోల్పోయి నిషేధం వేటుకు గురయ్యే కంటే తిరిగెళ్లిపోయి మళ్లీ తాజాగా వీసా మీద రావడం మంచిది.

అదే సమస్య

అమెరికాలో చదవడానికి అక్కడికి వెళుతున్న భారతీయ విద్యార్థుల్లో చాలామంది ఇక అక్కడే శాశ్వతంగా స్థిరపడాలని భావిస్తూ, అందుకోసం అడ్డదారులు తొక్కడం ఎన్నో సమస్యలకు దారితీస్తోంది. భారతీయ విద్యార్థుల్లో 1,93,274 మంది (85 శాతం) సైన్స్, ఇంజనీరింగ్, గణితం, టెక్నాలజీ (స్టెమ్) కోర్సుల్లోనే ప్రవేశాలు పొందుతున్నారు. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) పూర్తయ్యేలోపు హెచ్1బీ వీసా పొందితే అమెరికాలో ఉండిపోవచ్చు. హెచ్1బీ వీసా ఉంటే శాశ్వతంగా ఉండేందుకు గ్రీన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చు. అందుకే కొందరు విద్యార్థులు అక్కడ కొనసాగేందుకు యూనివర్సిటీ ఆఫ్ ఫార్మింగ్టన్' తరహాలో అడ్డదార్లు తొక్కుతున్నారు. దీంతో ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. గతంలో కూడా ఇటువంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ) విధానం వల్ల సంప్రదాయ డిగ్రీ విద్యార్థులు తమ కోర్సులు పూర్తయ్యాక 12 నెలలు అమెరికాలోని కంపెనీల్లో శిక్షణ పొందే అవకాశముంది. అలాగే స్టెమ్ కోర్సుల విద్యార్థులు గరిష్ఠంగా 36 నెలలు శిక్షణ పొందే వీలు లభిస్తుంది. ఒక నివేదిక ప్రకారం ఓపీటీకి నమోదు చేసుకున్న భారతీయ విద్యార్థుల సంఖ్య 2016-17తో పోల్చితే 2017-18లో 32 శాతం పెరిగింది. 2017-18లో 75,390 మంది విద్యార్థులు ఓపీటీ కోసం నమోదు చేసుకున్నారు. ఇలా ఓపీటీలో చేరడం ద్వారా సదరు వ్యవధిలో రాణించి, సంస్థల నుంచి పూర్తిస్థాయి ఉద్యోగం సొంతం చేసుకోవాలని, తద్వారా హెచ్-1బీ వీసాకు అర్హత పొందాలని విద్యార్థులు భావిస్తున్నారు.

ఇలా చేయాలి

అమెరికా ప్రభుత్వం ఆమోదం ఉన్న విద్యాసంస్థల జాబితాను హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం (డీహెచ్ఎస్) ఆధ్వర్యంలోని స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రాం ద్వారా తెలుసుకుని, ధ్రువీకరించిన సంస్థల్లోనే చేరాలి. అమెరికాలోని గుర్తింపు ఉన్న విశ్వవిద్యాలయాలు, కళాశాలల జాబితాను విద్యార్థులు తప్పనిసరిగా సరి చూసుకోవాలి. గుర్తింపు ఉన్న విశ్వవిద్యాలయాన్ని మాత్రమే ఎంచుకోవాలని ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్ కిరణ్ గల్లా సూచించారు. గుర్తింపులో ముఖ్యంగా రెండున్నాయి. ఒకటి రీజినల్ అక్రెడిటేషన్. ఈ గుర్తింపు ఉంటే ఢోకా లేదు. మరొకటి నేషనల్ అక్రెడిటేషన్. దీన్ని ఒకేషనల్, ఇతర మతపరమైన విద్యాసంస్థలకు ఇస్తారు. ఈ రెండింటి మధ్య తేడాను అర్థం చేసుకోవాలి. వీసా నిబంధనలను పూర్తిగా తెలుసుకోవాలి. చదువుకుంటూ కరిక్యులం ప్రాక్టికల్ ట్రైనింగ్ చేయడం, పూర్తయిన తర్వాత మూడేళ్ల ఓపీటీ తదితర నిబంధనలు తెలుసుకోవాలి. ది కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అక్రెడిటేషన్, యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ద్వారా గుర్తింపు పొందిన సంస్థల వివరాలను తెలుసుకోవచ్చు. అన్ని ప్రముఖ యూనివర్సిటీలు శాట్, జీఆర్ఈ, టోఫెల్ వంటి పరీక్షల స్కోర్ల ఆధారంగా ప్రవేశం కల్పిస్తాయి. ఈ స్కోర్లతో నిమిత్తం లేకుండా అడ్మిషన్ కల్పిస్తుంటే అనుమానించాల్సిందే.

హాట్‌కేక్.. హెచ్1 బీ

అమెరికా జారీ చేసే వీసాల్లో హెచ్1బీ కే అత్యధిక డిమాండ్ ఉంది. ఎక్కువ నైపుణ్యం ఉన్న విదేశీయులను హెచ్1బీ వీసా ద్వారా తాత్కాలిక ప్రాతిపదికన నియమించుకోవడానికి ఈ వీసాను ప్రవేశపెట్టారు. దీని ద్వారా ప్రాథమికంగా మూడేళ్లకు వీసా మంజూరు చేస్తారు. తర్వాత మూడేళ్లు పొడిగించుకోవచ్చు. హెచ్ 1బీ వీసా ఉన్నవారు గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రీన్ కార్డుకు దరఖాస్తు చేసుకుంటే.. ఆ దరఖాస్తు పరిశీలనలో ఉండగానే హెచ్ 1బీ వీసా గడువు ముగిసిపోయిన పక్షంలో గ్రీన్ కార్డుపై నిర్ణయం వెలువడే వరకు వీసా గడువును పొడిగిస్తారు.



అమెరికా డిగ్రీలకే ప్రాధాన్యం



హెచ్1బీ వీసా నిబంధనల్లో అమెరికా ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. ఈ మార్పులు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయని యూఎస్‌సీఐఎస్ (యునైటెడ్ స్టేట్స్ సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్) పేర్కొంది. దీని ప్రకారం అమెరికాలో మాస్టర్ డిగ్రీలు చదివిన విదేశీ విద్యార్థులకే ఇకపై హెచ్1బీ వీసాల జారీలో ప్రాధాన్యత ఇస్తారు. యూఎస్‌సీఐఎస్ నిబంధనల ప్రకారం ఇప్పటివరకు ఏటా 65 వేల హెచ్1బీ దరఖాస్తులను జారీచేస్తున్నారు. అమెరికాలో ఉన్నతవిద్య అభ్యసించే విదేశీయుల కోసం మరో 20 వేల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. అయితే, హెచ్1బీ వీసా ప్రక్రియలో మార్పులతో 65 వేల వీసాల్లో కూడా అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించిన విదేశీ విద్యార్థులకే ప్రాధాన్యం ఇస్తారు. దీనివల్ల ఏటా అమెరికాలో మాస్టర్స్ చేసిన 5,340 మంది విదేశీయులు అదనంగా లబ్ధి పొందుతారు. అయితే భారత్, చైనా వంటి దేశాల్లో ఉన్నత విద్య అభ్యసించి ఉద్యోగం కోసం అమెరికాకు వెళ్లాలనుకునే ఐటీ నిపుణులపై ఈ నిర్ణయం ప్రతికూల ప్రభావం చూపనుంది.

గైడెన్స్ ఇలా

అమెరికాలో అడుగుపెట్టినప్పటి నుంచి సంబంధిత విషయాల్లో గైడ్ చేయడానికి ఎన్నో సంస్థలు ఉంటాయి. అమెరికాలోని తెలుగు సంఘాలు, యూనివర్సిటీ అలూమ్ని వంటివి. కాబట్టి ఏ విషయమైనా తెలియకుంటే వారిని అడిగి నివృత్తి చేసుకోవచ్చు. అమెరికా విద్యపై అవగాహన కల్పించేందుకు అమెరికన్ కాన్సులేట్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఏడు సెంటర్లు ఉన్నాయి. న్యూఢిల్లీ, అహ్మదాబాద్, ముంబై, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతాలలో వీటిని నెలకొల్పారు. ఈ సెంటర్లలో ఎడ్యుకేషన్ యూఎస్ఏ అడ్వైజర్ ఉంటారు. వీరి ద్వారా అమెరికాలో చదువుకు సంబంధించిన అన్ని విషయాలను సమగ్రంగా తెలుసుకోవచ్చు. అమెరికా - భారత్ విద్యార్థులకు పరస్పర సహకారం అందించే ఉద్దేశంతో యూఎస్ - ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (యూఎస్ఐఈఎఫ్) ఏర్పాటైంది. అమెరికా విద్యకు సంబంధించిన సందేహాలను ఈ సంస్థ ద్వారా కూడా నివృత్తి చేసుకోవచ్చు.

రెండో స్థానంలో భారత విద్యార్థులు..

ఒక నివేదిక ప్రకారం అమెరికాలో 2017 - 18 నాటికి మొత్తం విదేశీ విద్యార్థుల సంఖ్య 10,94,792 మంది. ఇందులో సగం మంది చైనా, భారత్‌ల నుంచే ఉంటారు. ఈ జాబితాలో 3,63,341 మంది విద్యార్థులతో చైనా తొలి స్థానంలో ఉంది. రెండో స్థానం భారతీయ విద్యార్థులది. భారతీయ విద్యార్థుల సంఖ్య 1,96,271. అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్తున్న భారత విద్యార్థులు చేరుతున్న కోర్సులను పరిశీలిస్తే.. దాదాపు 80 శాతం మంది స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్) కోర్సుల్లోనే చేరుతున్నట్లు స్పష్టమవుతోంది. 2017 - 18లో అమెరికాలోని యూనివర్సిటీల్లో ప్రవేశం పొందిన భారతీయ విద్యార్థులు దాదాపు 73 శాతం మంది మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ కోర్సులను ఎంచుకున్నారు. కేవలం 10 శాతం మంది మాత్రమే బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరారు. అలాగే 8 శాతం మంది ఫిజికల్ సైన్స్, హెల్త్ సంబంధిత కోర్సుల్లో ప్రవేశం పొందారు.

గత రెండేళ్లలో కోర్సుల వారీగా భారత విద్యార్థులు...

కోర్సు స్థాయి	2016-17	2017-18
అండర్ గ్రాడ్యుయేట్	21,977	23,346
గ్రాడ్యుయేట్	1,04,899	95,651
నాన్-డిగ్రీ	2,259	1,884
ఓపీటీ	57,132	75,390

జాబ్ కార్నర్

ఏపీ పోస్టల్ సర్కిల్

ఖాళీలు 68

ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ గ్రూప్ సీ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు: మెయిల్ గార్డ్ 3, ఎంటీఎస్ 46, పోస్ట్‌మన్ 19
- అర్హత: మెట్రిక్యులేషన్ లేదా తత్సమాన పరీక్ష లేదా ఐటీఐ పూర్తిచేసి ఉండాలి.
- వయసు: ఎంటీఎస్‌లకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య, మిగిలిన పోస్టులకు 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- ప్రొబెషన్: రెండేళ్లు
- దరఖాస్తు ఫీజు: రూ.500 (ఎస్సీ / ఎస్టీ / దివ్యాంగులు/ మహిళలకు రూ.100)
- ప్రైమరీ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 28
- ఫీజు చెల్లించేందుకు ఆఖరు తేదీ: మార్చి 5
- ఫైనల్ సబ్మిషన్‌కు ఆఖరు తేదీ: మార్చి 8
- వెబ్‌సైట్: www.appost.in

ఇంజనీర్లు, క్లర్కులు

ఖాళీలు 73

నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ - కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు: జూనియర్ ఇంజనీర్లు 25, ఎల్‌డీసీ 33, స్టెనోగ్రాఫర్లు 8, జూనియర్ అకౌంటెంట్లు 7
- వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- అర్హత: జూనియర్ ఇంజనీర్లకు డిప్లొమా(సివిల్), జూనియర్ అకౌంటెంట్లకు బీకాం, స్టెనోగ్రాఫర్లకు ఇంటర్, ఎల్‌డీసీలకు పదోతరగతి & టైపింగ్ (హిందీ, ఇంగ్లీషు) సర్టిఫికెట్లు ఉండాలి.
- ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు ఫీజు: రూ.650
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 22
- వెబ్‌సైట్: www.nwda.gov.in

కాంట్రాక్ట్ వర్క్‌మెన్

ఖాళీలు 195

కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ కాంట్రాక్ట్ వర్క్‌మన్ భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు: ఫ్యాబ్రికేషన్ అసిస్టెంట్లు, అవుట్‌ఫిట్ అసిస్టెంట్లు, ఏసీ టెక్నీషియన్లు, ఫైర్‌మెన్, షిప్ డిజైన్ అసిస్టెంట్లు
- అర్హత: ఉద్యోగాన్ని అనుసరించి ఏడో తరగతి, పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా పూర్తిచేసి ఉండాలి.
- వయసు: 30 ఏళ్లు మించకూడదు.
- ఎంపిక: అకడమిక్ మెరిట్, ఆబ్జెక్టివ్ టెస్ట్, ప్రాక్టికల్ టెస్ట్ లేదా స్కిల్ టెస్ట్ ఆధారంగా
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 13
- వెబ్‌సైట్: www.cochinshipyard.com

సేఫ్టీ ఆఫీసర్లు

ఖాళీలు 38

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బీహెచ్ఈఎల్) ఎఫ్‌టీపీ - సేఫ్టీ ఆఫీసర్ల భర్తీకి ఇంజనీర్ల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- అర్హత: బీఈ/ బీటెక్ (మెకానికల్/ ఎలక్ట్రికల్/ సివిల్/ ప్రొడక్షన్/ ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా(ఇండస్ట్రియల్ సేఫ్టీ)చేసి ఉండాలి. కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి.
- ఎంపిక: పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా (1:10 నిష్పత్తిలో అభ్యర్థులను ఇంటర్వ్యూకి ఎంపిక చేస్తారు.)
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 11
- వెబ్‌సైట్: www.bhelpssr.co.in

ఇంజనీరింగ్ అసిస్టెంట్లు

ఖాళీలు 53

రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ జూనియర్ ఇంజనీర్ల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.

- ఉద్యోగం: జూనియర్ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు
- విభాగం: ప్రొడక్షన్
- అర్హత: బీఎస్సీ (ఎంపీసీ) లేదా డిప్లొమా (కెమికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: 2018 డిసెంబరు 31 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- ఎంపిక: ఆన్‌లైన్ ఎగ్జామ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ద్వారా
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 14
- వెబ్‌సైట్: www.nationalfertillizers.com

అసిస్టెంట్లు, ఆపరేటర్లు

ఖాళీలు 77

లఖ్‌నవ్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ అసిస్టెంట్లు, ఆపరేటర్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు: అసిస్టెంట్లు 43, ఆపరేటర్లు 34
- అసిస్టెంట్ పోస్టుల విభాగాలు: అడ్మినిస్ట్రేషన్, అకౌంట్స్, క్యూసీ, ఇన్‌స్పెక్షన్, కమర్షియల్, సివిల్ వర్క్స్
- ఆపరేటర్ విభాగాలు: ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 13
- వెబ్‌సైట్: www.halindia.co.in

క్లర్కులు

ఖాళీలు 60

ముంబైలోని బాబా అటామిక్ రీసెర్చ్ (బార్క్) కింది ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ఉద్యోగాలు: అప్పర్ డివిజన్ క్లర్క్ 47, స్టెనోగ్రాఫర్స్ 13
- అర్హత: క్లర్కులకు డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు టైప్ రైటింగ్, కంప్యూటర్ డేటా ప్రాసెసింగ్ పరిజ్ఞానం ఉండాలి. స్టెనోలకు స్టెనోగ్రఫీతోపాటు టైపింగ్ పరిజ్ఞానం ఉండాలి.
- ఎంపిక: ఆబ్జెక్టివ్ టెస్ట్, డిస్క్రిప్టివ్ టెస్ట్, స్టెనోగ్రఫీ స్కిల్ టెస్ట్ ఆధారంగా
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 25
- వెబ్‌సైట్: www.barc.gov.in

లారస్ హెచ్ఐవీ ఔషధానికి ఎఫ్‌డీఏ ఆమోదం

హైదరాబాద్: హెచ్ఐవీ ఔషధానికి అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ఎఫ్‌డీఏ) నుంచి అనుమతి అందుకున్నట్లు లారస్ ల్యాబ్స్ వెల్లడించింది. టెనోఫోవిర్/లామివుడైన్/డోలుటిగ్రావిర్ (టీఎల్‌డీ) 300/300/50 ఎంజి ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ (ఎఫ్‌డీసీ)కు ఈ అనుమతి లభించిందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం, అచ్యుతాపురంలోని యూనిట్ 2లో ఈ ఔషధాన్ని ఉత్పత్తి చేయనున్నట్లు లారస్ ల్యాబ్స్ తెలిపింది. ఫినిష్డ్ డోసేజ్ విభాగంలోకి అడుగుపెట్టిన కొద్ది రోజులకే ఈ ఔషధానికి అనుమతి లభించటం విశేషమని పేర్కొంది.



ఈసారీ నిరాశేనా?

రేపటి నుంచి ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ భేటీ.. బుధవారం పరపతి విధాన ప్రకటన

న్యూఢిల్లీ: ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) మంగళవారం నుంచి మూడు రోజులపాటు భేటీ అవుతోంది. ఆర్‌బీఐ గవర్నర్‌గా డిసెంబరులో బాధ్యతలు స్వీకరించిన శక్తికాంత దాస్ అధ్యక్షతన తొలిసారిగా ఈ సమావేశం జరుగుతోంది. అయితే ఈ సమావేశంలోనూ ఎంపీసీ వడ్డీ రేట్ల తగ్గింపు జోలికి పోకపోవచ్చని భావిస్తున్నారు. డిసెంబరులో జరిగిన సమావేశంలోనూ, ఎంపీసీ కీలకమైన వడ్డీ రేట్ల జోలికి పోలేదు. అయితే రిటైల్ ద్రవ్యోల్బణం అదుపులో ఉంటే ఫిబ్రవరిలో జరిగే భేటీలో వడ్డీ రేట్ల తగ్గింపు విషయం పరిశీలిస్తామని ప్రకటించింది. డిసెంబరు 2018 నెల రిటైల్ ద్రవ్యోల్బణం 18 నెలల కనిష్ఠ స్థాయి 2.19 శాతానికి దిగొచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2018-19) ప్రభుత్వం నిరేశించిన లక్ష్యానికంటే ఇది చాలా తక్కువ. ఈ ఆర్థిక సంవత్సరంలో నాలుగు శాతానికి రెండు శాతం అటు ఇటుగా రిటైల్ ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయాలని ప్రభుత్వం ఆర్‌బీఐకి నిర్దేశించింది. రిటైల్ ద్రవ్యోల్బణం 18 నెలల కనిష్ఠ స్థాయికి దిగొచ్చినా ద్రవ్య లోటు భయాలు, పెరుగుతున్న ముడిచమురు ధరల నేపథ్యంలో గురువారం ప్రకటించే ద్రవ్య, పరపతి సమీక్షలో ఆర్‌బీఐ కీలకమైన రెపో వడ్డీ రేటు తగ్గింపు జోలికి పోకపోవచ్చని మార్కెట్‌వర్గాల అంచనా.

9న ఆర్‌బీఐ బోర్డు సమావేశంలో గోయల్ ప్రసంగం

ఎంపీసీ సమావేశం ముగిసిన రెండు రోజులకే ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు సమావేశం జరుగుతోంది. ఈ నెల 9న జరిగే ఈ సమావేశంలో కేంద్ర తాత్కాలిక ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ బోర్డు సభ్యులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఏటా బడ్జెట్ సమర్పించాక కేంద్ర ఆర్థిక మంత్రి ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు సభ్యులను ఉద్దేశించి ప్రసంగించడం సంప్రదాయం.

రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడంతో తన ద్రవ్య విధాన వైఖరి మార్చుకునే అవకాశం ఆర్‌బీఐకి ఏర్పడింది. అయితే ద్రవ్య లోటు, పెరుగుతున్న ముడి చమురు ధరల నేపథ్యంలో ఆర్‌బీఐ వడ్డీ రేట్ల తగ్గింపు జోలికిపోకపోవచ్చు.
- సమీర్ నరాంగ్, ప్రధాన ఆర్థికవేత్త, బ్యాంక్ ఆఫ్ బరోడా

అంతర్జాతీయ వృద్ధి రేటు ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. డిమాండ్‌లోనూ పెరుగుదల కనిపిస్తోంది. ఈ పెరుగుదల నుంచి భారత్ ఇంకా ప్రయోజనం పొందలేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ వడ్డీ రేట్ల పెంపు జోలికి పోకపోవచ్చు.
- డీబీఎస్ ఎకనామిక్స్

'జీ' ప్రమోటర్లపై బిగుస్తున్న ఉచ్చు!

మ్యూచువల్ ఫండ్స్, రేటింగ్ ఏజెన్సీల సీఈఓలకు సెబీ సమన్లు • బయటపడిన స్టాక్ ఎక్స్ఛేంజీల డొల్లతనం

న్యూఢిల్లీ: జీ గ్రూప్‌పై చర్యలు తీసుకునేందుకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ సిద్ధమవుతోంది. జీ గ్రూప్ వ్యవహారానికి సంబంధించి నాలుగు మ్యూచువల్ ఫండ్ సంస్థల సీఈఓలు, బ్రిక్‌వర్క్స్ రేటింగ్ కంపెనీ సీఈఓకు సమన్లు జారీ చేసింది. సోమవారం నాడు వీరంతా తమ ముందు హాజరు కావాలని సెబీ సభ్యుడు మదాబీ పురి ఆదేశాలు జారీ చేశారు. జీ ఎంటర్‌టైన్‌మెంట్, డిష్ టీవీ వ్యవహారంలో సెబీ వీరిని ప్రశ్నించనుంది. కాగా మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఈ కేసును శిక్షాత్మక కేసుగా పరిగణిస్తున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇదీ కేసు..

జీ గ్రూప్ ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. గత నెల 25న ఎస్సెల్ గ్రూప్, జీ గ్రూప్ చైర్మన్ సుభాష్ చంద్ర తమ కంపెనీలు సంక్షోభంలో ఉన్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో గ్రూప్ సంస్థలైన జీ ఎంటర్‌టైన్‌మెంట్, డిష్ టీవీ షేర్లు కుప్పకూలాయి. కంపెనీ నిర్వహణలోని జీ ఎంటర్‌టైన్‌మెంట్, డిష్ టీవీల పనితీరుపై ప్రభావం చూపించకుండా చూసేందుకు రుణ దాతలతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు ఎస్సెల్ గ్రూప్ చైర్మన్ సుభాష్ చంద్ర గత నెల 27న ప్రకటించారు. రుణదాతల్లో 96-97 శాతం మంది ఈ ఒప్పందానికి ఆమోదం తెలిపినట్టు ఆ మరుసటి రోజు (సోమవారం) సుభాష్ చంద్ర కుమారుడు తెలిపారు. దీంతో జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్లు రూ.310 నుంచి రూ.380కు దూసుకుపోయాయి. ఇదే అదనుగా షేర్ల తాకట్టుపై జీ గ్రూప్‌నకు అప్పులిచ్చిన ఇద్దరు రుణ దాతలు ఆ షేర్లను మార్కెట్లో విక్రయించి సొమ్ము చేసుకున్నారు. నిజానికి రుణ సెటిల్‌మెంట్ కోసం జీ గ్రూప్ సమర్పించిన ప్రతిపాదనకు ఈ నెల ఒకటో తేదీ నాటికి 10% రుణ దాతలు (బ్యాంకులు, ఆర్థిక సంస్థలు) మాత్రమే ఆమోదం తెలిపారు. అయినా ప్రమోటర్లు జనవరి 27-28 నాటికే రుణదాతలందరూ తమ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారని ప్రకటించడం విశేషం. దీంతో జనవరి 27-28న జీ ప్రమోటర్లు చేసిన ప్రకటనలు మోసపూరిత, తప్పుదారి పట్టించే ప్రకటనలని తేలిపోయింది.



పట్టించుకోని స్టాక్ ఎక్స్ఛేంజీలు..

జీ గ్రూప్ ఆర్థిక సంక్షోభం నేపథ్యంలో స్టాక్ ఎక్స్ఛేంజీల డొల్లతనం మరోసారి బయట పడింది. ఏదైనా ఒక లిస్టెడ్ కంపెనీకి సంబంధించి తీవ్ర పరిణామాలు ఎదురైతే ఆ కంపెనీ షేర్ల లావాదేవీలను, షేర్ల ధర కదలికలను స్టాక్ ఎక్స్ఛేంజీలు నిశితంగా పర్యవేక్షించాలి. అయితే జీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల విషయంలో ఇవి ఏ చర్యలు తీసుకోలేదు. రుణదాతలతో ఒప్పందం కుదిరిందన్న ప్రమోటర్ల ప్రకటన నిజమా? కాదా? అనే విషయాన్ని నిర్ధారించుకునేందుకు స్టాక్ ఎక్స్ఛేంజీలు వారం రోజుల వరకు ప్రయత్నం కూడా చేయలేదని సెబీ దృష్టికి వచ్చినట్టు సమాచారం.

ఎంఎఫ్‌ల బండారం..

జీ ఎంటర్‌టైన్‌మెంట్ సహా జీ గ్రూప్ కంపెనీల షేర్లు, రుణ పత్రాల్లో బిర్లా మ్యూచువల్ ఫండ్, ఐసీఐసీఐ మ్యూచువల్ ఫండ్, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్, రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ సంస్థలు పెద్ద మొత్తంలో మదుపు చేశాయి. తమ గ్రూప్ సంక్షోభంలో కూరుకుపోయిందని జీ గ్రూప్ చైర్మన్ సుభాష్ చంద్ర ప్రకటించేంత వరకు ఈ సంస్థల సీఈఓలకు గ్రూప్ ఆర్థిక స్థితిగతులపై అనుమానం రాలేదు. సంక్షోభం బయటపడిన తర్వాత, రుణదాతలతో ఒప్పందం కుదిరినట్టు ప్రమోటర్లు చేసిన ప్రకటనలను నిర్ధారించుకునేందుకూ ప్రయత్నించలేదు. జీ సంస్థల్లో ఇంత జరుగుతున్నా మదుపరులకు తెలియకుండా, తమ బోర్డుల ఆమోదం లేకుండా, ప్రమోటర్లతో ఏదోలా సెటిల్ చేసుకుని విషయాలను కప్పిపెట్టే ప్రయత్నం చేసినట్టు సెబీ దృష్టికి వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న సెబీ.. ఈ 4 ఫండ్ సంస్థల సీఈఓలు, బ్రిక్‌వర్క్స్ సీఈఓ తమ ముందు హాజరై సమాధానం ఇవ్వాలని సమన్లు జారీ చేసింది. అనంతరం స్టాక్ ఎక్స్ఛేంజీల సీఈఓలకు సమన్లు జారీ అవుతాయని భావిస్తున్నారు. రుణదాతలతో ఒప్పందం కుదుర్చుకోకుండానే కుదిరినట్టు ప్రకటించిన జీ గ్రూప్ ప్రమోటర్లపైనా సెబీ కఠిన చర్యలు తీసుకోవచ్చని భావిస్తున్నారు.

సెప్టెంబరు వరకు గడువుంది

గ్రూప్ రుణభారాన్ని తగ్గించుకునేందుకు సెప్టెంబరు వరకు గడువు ఉందని ఎస్సెల్ గ్రూప్ తెలిపింది. గ్రూప్ ప్రధాన సంస్థ, ఇతర లిస్టెడ్ కంపెనీలకు సంబంధించి షేర్లను తాకట్టు పెట్టేందుకు రుణ దాతలు అంగీకరించారని, అందుకుతగ్గట్టుగానే ప్రకటన చేసినట్లు గ్రూప్ పేర్కొంది. ఈ ఒప్పందం కారణంగా సంబంధిత సంస్థలను డిఫాల్ట్‌గా ప్రకటించకుండా ఉండే అవకాశం లభించిందని తెలిపింది. అంతేకాకుండా సెప్టెంబరు 30 వరకు డిఫాల్ట్ అయినట్లు ప్రకటించకుండా ఉండేందుకు అంగీకారం తెలిపాయని పేర్కొంది. అనుకోని పరిస్థితులు ఏవైనా తలెత్తినా డిసెంబరు వరకు రుణాలను చెల్లించే వెసులుబాటును కల్పించాయని తెలిపింది. రుణదాతల సహకారంతోనే తాము ముందుకు సాగుతున్నామని పేర్కొంది.

ఆస్ట్రో గైడ్

10725 దిగువన బేరిష్

(ఫిబ్రవరి 4-8 తేదీల మధ్య వారానికి)

గత వారం నిఫ్టీ : 10894 (+113)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 10983-10584 పాయింట్ల మధ్యన కదలాడి 113 పాయింట్ల లాభంతో 10894 వద్ద పాజిటివ్‌గా ముగిసింది. ఈ వారంలో కుంభ-మీన రాశుల సంచార సమయంలో ఏర్పడే పరిధి 3 వారాలకు కీలకం. ఇందులో గరిష్ఠ స్థాయిని దాటితే బుల్లిష్‌గాను, కనిష్ఠ స్థాయి కన్నా దిగజారితే బేరిష్‌గాను భావించాలి.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 10824, 10788, 10743, 10845 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- ప్రస్తుతం నిఫ్టీ అన్ని డిఎంఏల కన్నా పైకి వచ్చింది. కాని 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా దిగువనే ఉం డడం (డెత్ క్రాస్) దీర్ఘకాలిక ట్రెండ్ బేరిష్‌గా ఉందనేందుకు సంకేతం.
- స్వల్ప, మధ్యకాలిక ట్రెం డ్ బుల్లిష్‌గా మారింది. దీర్ఘకాలిక ట్రెండ్ మాత్రం బేరిష్‌గా ఉంది. ఈ వారాంతంలో 10725 దిగువనన ము గిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బేరిష్ అవుతుంది.

బ్రేకౌట్ స్థాయి : 11000 బ్రేక్ డౌన్ స్థాయి : 10725

నిరోధ స్థాయిలు: 11050, 11125 (10975 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 10740, 10665 (10815 దిగువన బేరిష్)

ఇన్వెస్టర్లకు సూచన

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

గ్రహగతులివే..

- ★ మకరంలోని శ్రవణం పాదం 1 నుంచి మీనంలోని ఉత్తరాభాద్ర పాదం 1 మధ్యలో చంద్ర సంచారం
- ★ మకరంలోని శ్రవణం పాదం 4 నుంచి ధనిష్ఠ పాదం 1 మధ్యలో రవి సంచారం
- ★ మకరంలోని ధనిష్ఠ పాదం 1 నుంచి కుంభంలోని ధనిష్ఠ పాదం 3 మధ్యలో బుధ సంచారం
- ★ ధనుస్సులోని మూల పాదం 3-4 మధ్యలో శుక్ర సంచారం
- ★ మీనంలోని రేవతి పాదం 4 నుంచి మేషంలోని అశ్విని పాదం 1 మధ్యలో కుజ సంచారం
- ★ ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 3లో తుల నవాంశలో శని సంచారం
- ★ వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 3లో కుంభ నవాంశలో బృహస్పతి సంచారం
- ★ కర్కాటకంలోని పునర్వసు పాదం 4లో రాహువు, మకరంలోని ఉత్తరాషాఢ పాదం 2లో కేతువు సంచారం

ఉదయం సెషన్ మెరుగు

(సోమవారానికి)

తిథి : పుష్య బహుళ అమావాస్య **నక్షత్రం :** శ్రవణం

పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర నక్షత్ర జాతకులు, మకర, వృషభ రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.

ట్రెండ్ మార్పు వేళలు : 9.40

ధోరణి : నిఫ్టీ ఫ్యూచర్స్ మెరుగ్గా ప్రారంభమై 9.30 నుంచి 12.40 మధ్యలో మెరుగ్గానే ఉంటూ తదుపరి చివరి వరకు నిస్తేజంగా మారే ఆస్కారం ఉంది. బడ్జెట్ ప్రతిపాదన దృష్ట్యా అప్రమత్తత అవశ్యం.

ట్రేడింగ్ వ్యూహం: నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30గంటల సమయానికి ప్రారంభ స్థాయి /సగటు (ఎటిపి)కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 12.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. ఒంటి గంట తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవచ్చు.

నిరోధం : 10935, 10970 **మద్దతు స్థాయిలు : 10855, 10820**

గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

25% నెట్‌వర్క్ అనుసంధానం

» వొడాఫోన్ ఐడియా వెల్లడి

న్యూఢిల్లీ: వొడాఫోన్, ఐడియా విలీనం నేపథ్యంలో ఈ రెండు కంపెనీలకు చెందిన మొబైల్ నెట్‌వర్క్ అనుసంధానం వేగవంతంగా జరుగుతోంది. దేశవ్యాప్తంగా ఎనిమిది టెలికాం సర్కిళ్లలో నెట్‌వర్క్ అనుసంధానం పూర్తయినట్టు వొడాఫోన్ ఐడియా తెలిపింది. ఐదు నెలల్లోనే 25 శాతం నెట్‌వర్క్ అనుసంధానం జరిగిందని, దీని మూలంగా 4జీ సర్వీసులు రెండురెట్లు మెరుగుపడినట్టు పేర్కొంది. పశ్చిమబెంగాల్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, అస్సాం, ఈశాన్యం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ (హైదరాబాద్ మినహా), జమ్మూకశ్మీర్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ సర్వీస్ ఏరియాల్లోని వొడాఫోన్, ఐడియా బ్రాండ్ల కస్టమర్లు 2జీ, 3జీ, 4జీపై మెరుగైన సర్వీసులను పొందుతున్నారని కంపెనీ తెలిపింది. గత ఏడాది ఆగస్టు 31న వొడాఫోన్, ఐడియా సెల్యూలార్ మొబైల్ వ్యాపార విలీనం పూర్తయిన విషయం తెలిసిందే.

టెక్ వ్యూ

11000.. దగ్గరే అయినా దూరమే



వి సుందర్ రాజా

గత సోమవారం మరింత కరెక్షన్‌లో పడిన నిఫ్టీ 10600 వరకు దిగజారి రికవరీ సాధించింది. తదుపరి శుక్రవారంనాటికి మానసిక అవధి 11000 వరకు చేరింది. కాని ఆ స్థాయిలో మరోసారి రియాక్షన్‌లో పడి అనిశ్చితంగా ముగిసింది. ఈ నిరోధం ఇప్పటికీ బలంగానే ఉం దనేందుకు ఇది సంకేతం. గత కొద్ది వారాల్లో కూడా ఈ స్థాయిలో ఐదు ప్రయత్నాలు జరిగినా బ్రేకౌట్ సాధించలేకపోతోంది. వీక్లీ చార్టుల్లో కూ డా స్వల్ప అప్రమత్త వైఖరి కనిపించడం ఈ వారంలో మరింత కన్సాలిడేషన్ ఏర్పడవచ్చునేందుకు సంకే తం. అయితే బలమైన రికవరీ కారణంగా మార్కెట్ ధోరణి ఇప్పటికీ ఎగువకే ఉంది. కాని గత 10 వారాలుగా మార్కె ట్ తీవ్ర ఆటుపోట్లతో పరిమిత పరిధిలోనే కదలాడుతోంది. శుక్రవారం అప్రమత్త ముగింపు, అంతర్జాతీయ ధోరణుల కారణంగా కొత్త వారం ప్రారంభం కూడా అప్రమత్తంగానే ఉండవచ్చు.

బుల్లిష్ స్థాయిలు

ఇంట్రాడే నిరోధం 10940. ఇదే గత శుక్రవారం సాధించిన మైనర్ టాప్. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. స్వల్పకాలిక టార్గెట్, ప్రధాన నిరోధం 11000. స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌లో తాజాగా ప్రవేశించాలంటే ఈ స్థాయి కన్నా పైన బలంగా ముగియాలి.

బేరిష్ స్థాయిలు: 10800కన్నా పైన ముగియడంలో విఫలమైతే స్వల్పకాలిక కరెక్షన్ కొనసాగుతుంది. స్వల్పకాలిక ప్రధాన మద్దతు స్థాయిలు 10600, 10450.

సోమవారం స్థాయిలివే...
నిరోధం : 10940, 11000
మద్దతు : 10840, 10800

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచి గత వారం గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు నడుమ బలహీనంగా ముగిసింది. నిరోధ స్థాయి 27400. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. ప్రధాన నిరోధం 27800. దిగువన మద్దతు స్థాయి 26900. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ కొనసాగుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 26400.

స్వల్పకాలిక వ్యూహం : 11000 కన్నా పైన నిలదొక్కుకున్నప్పుడే స్వల్పకాలిక ఇన్వెస్టర్లు గట్టి స్టాప్‌లాస్‌తో స్వల్పకాలిక బై పొజిషన్లు తీసుకోవచ్చు.

పాటర్న్: నిఫ్టీ 11000 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" దగ్గర బ్రేకౌట్ సాధించాలి. అప్పుడే మరింత అప్‌ట్రెండ్‌లో ప్రవేశిస్తుంది. అదే స్థాయిలో "ఏటవాలుగా ఎగువకు కనిపిస్తున్న మరో రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఏర్పడుతోంది.

టైమ్: ఈ సూచి ప్రకారం బుధవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

వాసిరాజు సుందర్ రాజా
www.sundartrends.in

చందా.. దందా 2

ఏమిటిది కామ్రేడ్!?

- » **10 టీవీ పేరిట ఫక్తు వ్యాపారం**
- » **నష్టం వచ్చిందనడం బూటకం**
- » **2016-17లో రూ.2.30 కోట్ల లాభం**
- » **ఒత్తిళ్ల మేరకే చానల్ విక్రయం!?**
- » **నిర్వహణకు ముందుకొచ్చిన ఏపీ శాఖ**
- » **అయినా... పట్టించుకోని నాయకత్వం**

(న్యూఢిల్లీ - ఆంధ్రజ్యోతి)

పెట్టుబడిదారీ విధానం నశించాలి.. అని నినదించే వారే ఫక్తు పెట్టుబడిదారులుగా మారి వ్యాపారం చేశారు!

పలు వాణిజ్య సంస్థలకు బూర్జువా పేరు తగిలించి నిందించే వారే అలాంటి కంపెనీకి 'అమ్ముడుపోయారు'!

కార్మిక, శ్రామిక, ఉద్యోగ వర్గాల తరఫున పోరుబాట సాగించే వారే... వారి శ్రమను పకడ్బందీగా దోచుకున్నారు!

ఉద్యమించి, ప్రభుత్వాలను నిలదీయాలని పిలుపునిచ్చే వారు.. తమ సహచర కామ్రేడ్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలివ్వకుండా తప్పించుకున్నారు!

క్రమశిక్షణకు మారుపేరైన కమ్యూనిస్టులు.. పార్టీ నియమావళికే తూట్లు పొడిచారు!

ఇలా ఒకటీ రెండూ కాదు... 10 టీవీ పేరిట సీపీఎం ఉమ్మడి రాష్ట్ర నాయకత్వం చేసిన అక్రమాలు ఎన్నెన్నో అని స్వయంగా ఆ పార్టీ శ్రేణులు జాతీయ నాయకత్వానికి ఫిర్యాదులు చేశారు. 10 టీవీ అక్రమాలపై 'చందా దందా' శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం ఉభయ రాష్ట్రాల వామపక్ష అభిమానుల్లో కలకలం సృష్టించింది. ఇదే వ్యవహారంపై ఇప్పుడు మరిన్ని సంచలన సంగతులు బయటపడ్డాయి. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్వోసీ) పత్రాలు, పార్టీ కేంద్ర నాయకత్వానికి అందిన ఫిర్యాదుల ప్రకారం...

సీపీఎం అనుబంధ ఉద్యోగ, ఉపాధ్యాయ, బీమా, కార్మిక సంఘాల సభ్యుల నుంచి డబ్బులు వసూలు చేసి 10 టీవీ వార్తా చానల్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. చివరికి వాటాదారులకు కనీస సమాచారం ఇవ్వకుండానే చానల్‌ను విక్రయించారు. నష్టాల లెక్కలు చెప్పారు. కానీ, ఇదో పెద్ద అబద్ధం. 2016-17లో 10 టీవీకి రూ.2,31,06,802 ఆదాయం వచ్చినట్లు సంస్థ ఐదవ వార్షిక నివేదికలో స్పష్టం చేశారు. చానల్‌ను కమ్యూనిస్టు భావజాలంతో సంబంధంలేని ఫక్తు ప్రైవేటు కంపెనీకి విక్రయించేశారు. నిజానికి... రాష్ట్ర విభజన తర్వాత టీవీ చానల్‌ను నడిపేందుకు ఏపీ రాష్ట్ర శాఖ ముందుకొచ్చినప్పటికీ అనుమతించలేదు. దాదాపు వందకోట్ల విలువైన ఆస్తులున్న చానల్‌ను కేవలం 30 కోట్లకే విక్రయించినట్లు కామ్రేడ్లు ఆరోపిస్తున్నారు.

సొంత నియమావళికి తూట్లు

1996-97లో, ఆ తర్వాత 2010లో సీపీఎం కేంద్ర కమిటీ నిర్దేశించిన నియమావళి ప్రకారం... పార్టీ సభ్యులెవరూ రియల్ ఎస్టేట్ వంటి 'స్పెక్యులేటివ్' ఆర్థిక వ్యవహారాలతో సంబంధం పెట్టుకోకూడదు. కానీ... ఇక్కడ ఏకంగా పార్టీ రాష్ట్ర నాయకత్వమే కట్టుతప్పిందని కేంద్ర కమిటీకి ఫిర్యాదులు వచ్చాయి. '10 టీవీ ఏర్పాటు కోసం అవసరానికి మించి నిధులు సేకరించారు.


అదనపు సొమ్మును రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడిగా పెట్టారు. అప్పటి పార్టీ (ఉమ్మడి) రాష్ట్ర కార్యదర్శి బీవీ రాఘవులుకు సన్నిహితులైన కొందరు కామ్రేడ్లు ఈ వ్యవహారాన్ని పర్యవేక్షించారు. పార్టీకి బినామీలుగా హైదరాబాద్ ప్రగతి నగర్, పరిసరాల్లో భూములు కొన్నారు' అని సీపీఎం కేంద్ర కమిటీకి ఫిర్యాదు అందింది.

బదులేదీ కామ్రేడ్!?


- 10 టీవీ ఏర్పాటు చేయాలని నిర్ణయించాక రెండు రాష్ట్రాల్లో 1,82,000 మంది సభ్యుల నుంచి నిధులు వసూలు చేశారు. కానీ... వారి పేర్లను ఆర్వోసీకి ఎందుకు నివేదించలేదు? కేవలం 108 మందినే యజమానులుగా ఎందుకు చూపించారు?
- మూడేళ్లుగా 10టీవీ నిర్వహణలో కష్టనష్టాలు ఎదురైనందున.. దానిని విక్రయించాలనే ప్రతిపాదన పెట్టారు. కానీ, ఈ నష్టాలకు కారకులెవరు, కారణాలేమిటని రాష్ట్ర మహాసభల్లో ఎందుకు చర్చించలేదు?
- వాటాదార్ల పేర్లను మార్చి బూటకపు ఖాతాలు సృష్టించడానికి ఎవరి అనుమతి తీసుకున్నారు? కేంద్ర కమిటీ పంపిన అధ్యయన బృందం సిఫారసు లేకుండానే చానల్‌ను ఎందుకు అమ్మారు?
- 10 టీవీని సీపీఎం ఏపీ కమిటీకి అప్పగించాలన్న మెజారిటీ నిర్ణయాన్ని ఎందుకు ఆమోదించలేదు?
- అసలు... 10 టీవీకి నష్టాలు వచ్చాయనే వాదనలో నిజమెంత? ఆర్వోసీకిచ్చిన నివేదిక ప్రకారం 2016, 2017లో వరుసగా 4.71 లక్షలు, 2.30 కోట్లు లాభం చూపించడం నిజం కాదా!
- 2018 మే నెలలోనే టీవీని అమ్మేసి ఆగస్టులో రాష్ట్ర కమిటీకి సమాచారమివ్వడం ఎంతవరకు సరైనది?
- కనీసం ఎన్నికలయ్యేవరకూ ఆగుదామని తెలంగాణ రాష్ట్ర కమిటీ చేసిన ప్రతిపాదనను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదు?
- అభ్యుదయ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీకి టీవీ ప్రసారాల లైసెన్స్ లేకుండానే 10 టీవీ లోగోతో షేర్లు ఎలా విక్రయించారు? ఆ తర్వాత ప్రసార హక్కులను స్ఫూర్తి కమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అమ్మడం ఎందుకు చేశారు?
- అప్పటి ప్రధాన కార్యదర్శి వీటికి అనుమతించారా? వాటిపై పొలిట్ బ్యూరోలో చర్చించారా?
- 10 టీవీ పేరిట ఎంత మొత్తం వసూలు చేశారు? ఎన్ని షెల్ కంపెనీలు తెరిచి... ఆ తర్వాత కేంద్ర ఆర్థిక శాఖ ఉత్తర్వుల మేరకు మూసివేశారు?

ఆన్‌లైన్‌లో చదివేద్దాం..!

- » **ఒకే క్లిక్.. 40 వేల పుస్తకాలు**
- » **అనంతలో డిజిటల్ లైబ్రరీ**
- » **సిడ్నీ లైబ్రరీ తరహాలో నిర్మాణం**
- » **గ్రంథాలయ సంస్థ ప్రయోగం**
- » **70 కేంద్రాలకు అనుసంధానం**



కంప్యూటర్‌లో పుస్తకాలు చదువుకుంటున్న పాఠకులు



చైర్మన్ గౌస్

గతంలో ఏదైనా పుస్తకం కావాలంటే లైబ్రరీకి వెళితే దొరికేది. కానీ.. ఇప్పుడు పరిస్థితి మారింది. ఓవైపు లైబ్రరీల నిర్వహణ భారమై.. మరోవైపు ఈ-పాఠకుల సంఖ్య పెరుగుతున్న రోజులివి! ఇలాంటి తరుణంలో.. పాఠకులను ఆకర్షించే దిశగా అనంతపురంలోని 'విన్సెంట్ ఫెర్రర్ డిజిటల్ లైబ్రరీ' ముందడుగు వేసింది. ఇటీవలే డిజిటల్ సొబగులద్దుకున్న ఈ గ్రంథాలయం ఒకే ఒక క్లిక్‌తో.. 40 వేల పుస్తకాలను అందిస్తూ ఆధునిక విజ్ఞాన భాండాగారంగా పాఠకాదరణ చూరగొంటోంది!

అనంతపురం సెంట్రల్ లైబ్రరీని ప్రతిరోజూ వెయ్యిమంది పాఠకులు సందర్శిస్తారు. వారికి కావాల్సిన పుస్తకాలు పరిశీలిస్తే.. ఒక్కో పుస్తకం ఒకటిరెండు మాత్రమే ఉండేవి. దీంతో చాలామంది అసంతృప్తిగా వెనక్కి వెళ్లేవారు. దీన్ని గమనించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జిరాయతి గౌస్‌మొహిద్దీన్ మదిలో మెదిలిన ఆలోచనే డిజిటల్ లైబ్రరీ. దానికోసం ఆన్‌లైన్‌లో వెతకగా సిడ్నీ (ఆస్ట్రేలియా)లో నిర్మించిన డిజిటల్ లైబ్రరీ, కోల్‌కతాలోని డిజిటల్ లైబ్రరీ అతన్ని ఆకట్టుకున్నాయి. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాట సాయం, జిల్లాలోని ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయంతో రూ.1.50 కోట్లతో అనంతపురంలో 'విన్సెంట్ ఫెర్రర్ డిజిటల్ లైబ్రరీ' ఏర్పాటైంది.

జాతీయస్థాయిలో రెండోది..

అనంతపురంలోని డిజిటల్ లైబ్రరీ దేశంలోనే రెండోస్థానంలో నిలిచింది. కోల్‌కతా లైబ్రరీలో 50 వేల పుస్తకాలు ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేయ గా.. ఇక్కడ 40 వేల పుస్తకాల అనుసంధా నానికి పనులు వేగం గా జరుగుతున్నాయి. ఇప్పటికే 40 వేల పుస్తకాలను డౌన్‌లోడ్ చేసి సుమారు 20వేల పుస్తకాలను అప్‌లోడ్ చేశారు. 64 టెరాబైట్స్ ర్యామ్‌తోపాటు 2 లక్షల పుస్తకాలు నిల్వ చేసే సామర్థ్యంగల సర్వర్‌ను ఏర్పాటు చేశారు. పోటీ పరీక్షలకు సమాయత్తమయ్యే నిరుద్యోగులకు ఈ లైబ్రరీ వరంగా మారింది. దీన్ని గమనించిన చైర్మన్ వారి కోసం 250 మంది సామర్థ్యం గల డిజిటల్ ఆడిటోరియం నిర్మించారు. నిపుణులైన బోధకులను ఏర్పాటు చేసి గ్రూప్-1కు ఉచిత కోచింగ్ ఇప్పిస్తున్నారు. వారికి ఆయన సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

నిమిషానికి 60 పేజీల స్కానింగ్..

ఈ డిజిటల్ లైబ్రరీలో నిమిషానికి 60 పేజీలు స్కానింగ్ చేయగల అత్యాధునిక స్కానర్‌ను ఏర్పాటుచేశారు. పిన్స్ విప్పి స్కానింగ్‌లో ఉంచిన పుస్తకాన్ని నిమిషానికి 60 పేజీల ప్రకారం తనంతట తానే స్కాన్ చేసుకునే సామర్థ్యం ఈ స్కానర్ ప్రత్యేకం. అలా స్కాన్ చేసిన పుస్తకాలను ఆన్‌లైన్‌లో అందరికీ అందుబాటులో ఉంచుతారు. జిల్లాలోని 70 గ్రంథాలయాలకు అనుసంధానించే ఏర్పాటు చేస్తున్నారు. తద్వారా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని లైబ్రరీల్లో 40 వేల పుస్తకాలు ఆన్‌లైన్‌లో వీక్షించే అవకాశం కలుగుతుంది.

- అనంతపురం, ఆంధ్రజ్యోతి





కావలి రూరల్ మండలం కొత్తపల్లి ఎస్సీ కాలనీలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు, అరకు నియోజకవర్గం హుకుంపేట మండలం కొట్నాపల్లిలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు, కర్నూలులో జరిగిన పింఛన్ల పంపిణీకి హాజరైన లబ్ధిదారులు

రెండో రోజూ అదే సంబరం

జోరుగా పసుపు-కుంకుమ, పింఛన్లు

(ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్)

సంక్రాంతి వెళ్లిపోయినా.. నవ్యాంధ్రలో ఇంకా పండుగ వాతావరణమే కొనసాగుతోంది. ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెంచిన పింఛన్లు నగదు రూపంలో, పసుపు-కుంకుమకు చెక్కుల పంపిణీ ఆదివారం వరుసగా రెండోరోజూ సంబరంలా జరిగింది. పెరిగిన పింఛను రూ.2వేలకు తోడు జనవరి నెలలో ఇవ్వాల్సిన రూ.1,000తో కలిపి కలిపి రూ.3వేల చొప్పున వృద్ధులు, వితంతువులకు అందజేస్తున్నారు. దివ్యాంగులకు రూ.4,500 చొప్పున, డ్వాక్రా మహిళలకు రూ.10 వేల విలువ చేసే మూడేసి చెక్కులు ఇస్తున్నారు. తమ సంక్షేమానికి, ఆర్థికంగా చేయూతనందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాలకు లబ్ధిదారులు పలు చోట్ల క్షీరాభిషేకం చేశారు. అంతే కాదు.. కొందరు దివ్యాంగులు, వృద్ధులు తమ పింఛన్ల మొత్తంలో కొంత రాజధాని నిర్మాణానికి విరాళాలుగా అందిస్తుండడం విశేషం. శ్రీకాకుళం జిల్లాలో ఆదివారం 15,912 సంఘాలకు రూ.51.71కోట్ల చెక్కులను మంత్రులు అచ్చెన్నాయుడు, కిమిడి కళావెంకట్రావు, ఎమ్మెల్యేలు పంపిణీ చేశారు. పింఛన్ల కింద రూ.19.21 కోట్లు అందజేశారు. విశాఖపట్నం జిల్లాలో పలుచోట్ల పసుపు-కుంకుమ చెక్కులు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్ము పంపిణీని ఉత్సవంలా నిర్వహించారు. మంత్రులు అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, కిడారి శ్రావణ్‌కుమార్, టీడీపీ ఎమ్మెల్యేలు, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తమ నియోజవర్గాల్లో పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో రెండోరోజు 15,430 డ్వాక్రా సంఘాల్లో 1,38,870 మంది సభ్యులకు రూ.13.88 కోట్లు పంపిణీ చేశారు. 1,41,058 మందికి పింఛన్ల కింద రూ.42.82 కోట్ల చెక్కులు అందించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో మంత్రులు పితాని సత్యనారాయణ, కె.ఎస్.జవహర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కృష్ణా జిల్లాలో 302 గ్రామాలు, వివిధ పట్టణాల్లోని 103వార్డుల్లో 2.13 లక్షల మంది సభ్యులకు రూ.213 కోట్లను చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. మహిళలకు మిఠాయిలు పంచిపెట్టారు. కొన్ని వార్డుల్లో భోజనాలు పెట్టి మరీ చెక్కులు అందజేశారు. పింఛన్లు కూడా అందజేశారు. మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు గొల్లపూడి సభలో పాల్గొనగా.. వివిధ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు చెక్కులు అందజేశారు. గుంటూరు జిల్లాలో ఇప్పటి వరకు పింఛన్ల కింద లక్షా 61వేల మందికి రూ.49 కోట్లు పంపిణీ చేశారు. పసుపు-కుంకుమ కింద 3.5 లక్షల గ్రూపులకు సుమారు రూ.375 కోట్లు చెక్కుల రూపంలో అందజేశారు. గురజాల, రేపల్లె, సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో 6వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్థానిక ఎమ్మెల్యేలు తెలిపారు. ప్రకాశం జిల్లాలో349 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో మరో మూడోవంతు వార్డుల్లో చెక్కులు, పింఛన్లు పంపిణీ చేశారు. ఒంగోలులోని మినీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో పేద లబ్ధిదారులు తమ ఔదార్యం చాటుకున్నారు. చెరువుకొమ్ముపాలెంనకు చెందిన దివ్యాంగుడు జాజుల మోహన్‌రావు రాజధాని నిర్మాణానికి పింఛను సొమ్ములో రూ.1,000 బలరాంకు అందజేశారు. దాంతో పలువురు మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు మొత్తం రూ.1.19 లక్షలను విరాళంగా అందజేశారు. మోహన్‌రావును ఎమ్మెల్సీ బలరాం, ఎమ్మెల్యే జనార్దన్ సత్కరించారు. ఒంగోలు మండలం దేవరంపాడు డ్వాక్రా మహిళలు, పెన్షనర్లు రూ.1.60 లక్షలు సమీకరించి రాజధానికి విరాళంగా అందజేశారు. చెక్కులు, పింఛన్ల సొమ్ము పంపిణీ నెల్లూరు జిల్లావ్యాప్తంగా వేడుకగా జరిగింది.

రాయలసీమలో..

అనంతపురం జిల్లాలో పింఛన్లు, పసుపు కుంకుమ పంపిణీ పండుగ అట్టహాసంగా కొనసాగింది. మంత్రులు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహా అందరు శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, ఎంపీలు తమ తమ నియోజకవర్గాల్లో వేడుకగా చెక్కుల పంపిణీ నిర్వహించారు. లేపాక్షి. చిలమత్తూరులో ఆదివారం నిర్వహించిన పసుపు-కుంకుమ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి బాలకృష్ణ దంపతులు హాజరయ్యారు. కర్నూలు జిల్లాలో కరువుబారిన పడిన పల్లెల్లో పింఛన్లు, చెక్కుల పంపిణీతో కోలాహలం నెలకొంది. మంత్రులు ఫరూక్, అఖిలప్రియ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు లబ్ధిదారులకు పింఛన్లు, డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు. కడప జిల్లా రైల్వేకోడూరు నియోజకవర్గం నగిరిపాడు పంచాయతీ జెట్టివారిపల్లె గ్రామంలో డ్వాక్రా మహిళలు, పింఛన్ల లబ్ధిదారులు మొత్తం రూ.2.40 లక్షలు, గ్రామం తరపున మరో రూ.60 వేలు చందాగా వేసుకుని.. మొత్తం రూ.3 లక్షలను రాజధాని నిర్మాణానికి అందజేయాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగాను, అటు చిత్తూరు జిల్లాలోనూ వేడుకగా పింఛన్ల సొమ్ము, పసుపు-కుంకుమ చెక్కుల పంపిణీ జరిగింది.



తాడేపల్లిగూడెంలో మహిళలతో ఆనందోత్సాహాన్ని పంచుకుంటున్న జడ్పీ చైర్మన్ బాపిరాజు

ఇక డబ్బు తీసుకోండి

- 36 బ్యాంకుల్లో రూ.2,345 కోట్లు జమ
- వెలుగు సిబ్బందికి జమ సర్టిఫికెట్ల ప్రతులు
- 'పసుపు-కుంకుమ'పై ప్రభుత్వం జాగ్రత్తలు
- కొత్తగా చేరిన సభ్యులకూ చెక్కులు
- జనవరి 18 నాటికి చేరిన అందరికీ డబ్బు
- స్తబ్దుగా ఉన్న సంఘాలకూ కానుక వర్తింపు
- సభ్యులు చనిపోయినా చెల్లించాలి : సీఎం

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): 'పసుపు-కుంకుమ' కింద డ్వాక్రా మహిళలకు ఇస్తున్న చెక్కుల్లో తొలి విడతకు అవసరమైన డబ్బు బ్యాంకులకు చేరింది. చెక్కుల పంపిణీకి ముందే రూ.2345కోట్లను మొత్తం 36 బ్యాంకుల్లో డిపాజిట్ చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. దీనికి సంబంధించి ఆయా బ్యాంకు అధికారుల నుంచి తీసుకున్న సర్టిఫికెట్ల ప్రతులను వెలుగు సిబ్బందికి పంపారు. తమకు ఇంకా డబ్బు రాలేదని స్థానికంగా ఉండే బ్యాంక్ మేనేజర్లు సాకులు చెప్పే అవకాశం లేకుండా వాటిని పంపినట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు. డ్వాక్రా మహిళలకు మొత్తం మూడు చెక్కులు ఇస్తున్నారు. ఇందులో ఒకదాన్ని వెంటనే బ్యాంకులో వేసి డబ్బు తీసుకొనే అవకాశం కల్పించారు. మిగిలిన రెండు చెక్కుల్లో ఒకదానిపై మార్చి 8, రెండోదానిపై ఏప్రిల్ 5వ తేదీ వేశారు. ఆ తేదీలకు కొద్దిగా ముందుగా అవసరమైనంత డబ్బును బ్యాంకులకు అందిస్తామని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 'రాష్ట్రం మొత్తం మీద ఒక్క చెక్కు కూడా తిరస్కారం కాకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. బ్యాంకులకు డబ్బు కూడా వెళ్లింది. శనివారం ఇచ్చిన చెక్కులను ఇప్పటికే కొందరు బ్యాంకుల్లో వేసుకొని నగదు తీసుకొన్నారు. అధికారులు నిశితంగా పర్యవేక్షిస్తున్నారు' అని ఒక సీనియర్ అధికారి వెల్లడించారు.

కొత్తవారికీ కానుక

డ్వాక్రా సంఘాల్లో కొత్తగా చేరిన సభ్యులకు కూడా పసుపు-కుంకుమ కానుక వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కానుకపై విధాన నిర్ణయం తీసుకున్న జనవరి 18వ తేదీని కటాఫ్‌గా తీసుకొని ఆ రోజుకు సభ్యులుగా చేరినవారందరికీ రూ.పది వేల కానుక ఇవ్వనున్నారు. గత మూడు నాలుగు నెలల్లో కొత్తగా చేరినవారు దాదాపు 3లక్షల మంది ఉంటారని అంచనా. ప్రస్తుతం వారి ఆధార్, బ్యాంక్ ఖాతాల వివరాలు సేకరిస్తున్నారు. ఒక వారంలో వారికి కూడా ఈ కానుక అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం మరికొంత అదనపు నిధులు అవసరమైతే ఇవ్వడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. కాగా, డ్వాక్రా సంఘాల్లో ప్రస్తుతం ఉన్న సభ్యుల్లో ఒకరిద్దరు చనిపోయినా చెక్కులు ఇవ్వడం ఆపొద్దని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సభ్యులు మరణించిన సంఘాలకు శనివారం కొన్నిచోట్ల చెక్కుల పంపిణీని నిలిపివేశారు. దీనిపై ఆదివారం జరిగిన టెలి కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడుతూ 'ఒకరిద్దరు సభ్యులు చనిపోతే మిగిలినవారికి కానుక ఆపాల్సిన అవసరం లేదు. చెక్కులు ఇచ్చేయండి. చనిపోయిన సభ్యుల పేరు మీద జారీ అయిన మొత్తం ఇతరులు తీసుకోకుండా జాగ్రత్త వహించండి. వాటిపై తర్వాత నిర్ణయిద్దాం' అని సూచించారు. అలాగే ఏ కార్యకలాపాలూ లేకుండా స్తబ్దుగా ఉన్న సంఘాల సభ్యులకూ కానుక ఇవ్వాలని మరో నిర్ణయం తీసుకొన్నారు. దీని వల్ల ఆ సంఘాలు క్రియాశీలమై అందులోని సభ్యులకు ప్రయోజనం కలిగే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది.

ఆదివారం నాటికి పసుపు-కుంకుమ కింద 9.5లక్షల సంఘాలకుగాను 5.7లక్షల సంఘాలకు చెక్కులు జారీ చేశారు. ఒక్కో సంఘానికి మూడు పోస్ట్ డేటెట్ చెక్కులు ఇచ్చారు. ఇక పెరిగిన పింఛన్లు 54లక్షల మందికి వర్తిస్తుండగా అందులో 24,07,930మందికి ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున బ్యాంకులో దాదాపు రూ.732కోట్లు డిపాజిట్ చేశారు.

'పసుపు-కుంకుమ' భగ్నానికి కుట్ర

- చెక్కులు చెల్లవనే దుష్ప్రచారం నమ్మొద్దు
- నేటి నుంచే డబ్బులు తీసుకోవచ్చు
- మహిళలు డబ్బు దుర్వినియోగం చేయరు
- అందుకే ఓ అన్నగా నేనిచ్చే కానుక
- పింఛను రెట్టింపుతో వృద్ధులకు భరోసా
- నేను రోజూ ప్రజల్లోనే!
- జగన్ ప్రతి వారం కోర్టుకే
- 2 పార్టీలను ప్రజలే బేరీజు వేసుకోవాలి
- ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మొన్న 'జన్మభూమి'ని భగ్నం చేయాలని చూసిన వైసీపీ.. ఇప్పుడు పసుపు-కుంకుమ భగ్నం చేసేందుకు కుట్ర పన్నుతోందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. ఇందులో భాగంగానే పసుపు-కుంకుమ పంపిణీ సందర్భంగా నిరసనలు తలపెట్టారని ఆరోపించారు. వారికి మహిళలే బుద్ధి చెప్పాలని పిలుపిచ్చారు. ఆదివారం ఉదయం తన నివాసం నుంచి టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కులమతాలకు అతీతంగా పింఛన్ల పండుగ జరుగుతోందన్నారు. రాజకీయాలకు అతీతంగా పసుపు-కుంకుమ పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఏమన్నారో ఆయన మాటల్లోనే..

2,400 కోట్లు డిపాజిట్ చేశాం..

'మహిళలు డబ్బు దుర్వినియోగం చేయరు. అందుకే ఒక్కో డ్వాక్రా మహిళకు రూ.20 వేలు ఇచ్చాం. మొత్తంగా మహిళలకే రూ.24 వేల కోట్లు ఇస్తున్నాం. చెక్కులు చెల్లవనే దుష్ప్రచారాన్ని నమ్మొద్దు. సోమవారం నుంచే డబ్బులు తీసుకోవచ్చు. తొలి విడత రూ.2,400 కోట్లు బ్యాంకుల్లో డిపాజిట్ కూడా చేశాం. ఒక అన్నగా నేనిచ్చిన కానుకకు మహిళల్లో సంతృప్తి కనిపిస్తోంది. పాతికేళ్ల క్రితం నేను నెలకొల్పిన డ్వాక్రా సంఘాలివి. పెద్ద కొడుకుగా, అన్నగా నన్ను ఆదరించారు. వారిని ఆదుకోవడం నా బాధ్యత. పాదయాత్రలో వృద్ధులు, మహిళల కష్టాలు చూశాను. వారి బాధలకు చలించిపోయి, పింఛనును రూ.200 నుంచి రూ.1,000కి పెంచాను. ఇప్పుడు రూ.2వేలు చేశాను. పెద్దకొడుకు రూ.2వేల పింఛను ఇస్తున్నాడన్న ఆనందం వృద్ధుల్లో ఉంది. వారి ఆరోగ్యం మెరుగుపడింది. కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయత, అనుబంధాలు పెరిగాయి. పేదలకు బతుకుపై ఆత్మవిశ్వాసం పెరిగింది. దీనిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలి. ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి. పసుపు-కుంకుమ ఒక అన్నగా నేనిచ్చే కానుక. దీనిని అడ్డుకునే హక్కు ఎవరికీ లేదు. పింఛన్ల పెంపు అనుత్పాదక వ్యయం కాదు. పసుపు-కుంకుమ ఉత్పాదక వ్యయం. రాష్ట్రంలో 95 లక్షల మంది మహిళలు నా అక్క చెల్లెళ్లే. నా ఇంట్లో మహిళలకు సాధికారిత ఇచ్చాను. సాధికారత రాష్ట్రంలో ప్రతి మహిళకూ రావాలి. వైసీపీ నేతలకు డ్వాక్రా మహిళలే బుద్ధి చెప్పాలి.'

అన్ని వర్గాల మద్దతూ మనకే రావాలి..

'ప్రతి ఆటో కార్మికుడికి అండగా నిలవాలనే జీవితకాల పన్ను తొలగించాం. ట్రాక్టర్లపై పన్ను తొలగింపుతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ప్రతి ఆటోపై, ప్రతి ట్రాక్టరుపై టీడీపీ జెండా ఎగరాలి. అన్ని వర్గాలూ మనకు మద్దతుగా నిలిచేలా చూడాలి.'

జనంలో అవగాహన పెంచాలి..

'ప్రతి శుక్రవారం కోర్టుకు పోయేది జగన్. ప్రతి రోజూ ప్రజల్లో ఉండేది చంద్రబాబు అని ప్రజల్లో అవగాహన కల్పించాలి. నమ్మకానికి నిదర్శనం తెలుగుదేశం పార్టీ. అపనమ్మకానికి ప్రతీక వైసీపీ. ప్రజల నమ్మకాన్ని టీడీపీ నిలబెట్టింది. మన నమ్మకాన్ని నిలబెట్టాల్సింది వాళ్లే. టీడీపీని నమ్మితే నష్టం రాదనే రూ.50 వేల కోట్ల విలువైన భూములను రైతులు ప్రభుత్వానికి ఇచ్చారు. బ్రహ్మాండమైన రాజధాని నగరాన్ని నిర్మిస్తున్నాం. రూ.50 వేల కోట్ల విలువైన పనులు పూర్తవుతున్నాయి. అధికారుల ప్రతిష్ఠను టీడీపీ పెంచింది. కానీ వారిని వైసీపీ జైలు పాల్జేసింది. రాష్ట్రానికి వచ్చిన వోక్స్ వ్యాగన్‌ను తరిమేసింది వైసీపీ నేతలే. మనం 'కియా'ను రాష్ట్రానికి తెచ్చాం. పోగొట్టేది వైసీపీ.. రాబట్టేది టీడీపీ. రెండు పార్టీల పనితీరును ప్రజలే బేరీజు వేసుకోవాలి.'

మోదీ ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారు?

'బీజేపీయేతర రాష్ట్రాలపై ప్రధాని మోదీ నిర్లక్ష్యం చూపారు. నిధులు ఇవ్వరు, ఉద్రిక్తతలు సృష్టిస్తారు. బెంగాల్లో కుట్రలు చేస్తున్నారు. హిందూ, ముస్లింల మధ్య ఉద్రిక్తతలు పెంచుతున్నారు. ఆంధ్ర, కేరళల్లోనూ కుట్రలు పన్నుతున్నారు. విభజనతో నష్టపోయిన మనకు నిధులివ్వకుండా అభివృద్ధికి అడ్డంకులు కల్పిస్తూ.. ఏ ముఖం పెట్టుకుని మోదీ రాష్ట్రానికి వస్తున్నారో చెప్పాలి. పేదల సంక్షేమం కుంటుపడేలా కుతంత్రాలు చేస్తున్నారు. బీజేపీ, వైసీపీ కుట్రలకు జనమే జవాబిస్తారు.'

పొదుపు సంఘాలు కీలకం

దేశవ్యాప్తంగా మహిళా సంఘాల సభ్యుల్లో 3,050మంది బ్యాంకింగ్ కరస్పాండెంట్ ఏజెంట్లుగా మారి గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలందిస్తున్నారు. డిపాజిట్లు, అప్పులివ్వడం, జమ చేసుకోవడం, పెన్షన్లు, స్కాలర్‌షిప్పులు, ఉపాధి వేతనాల పంపిణీ, బీమామిత్రలుగా పని చేస్తున్నారు. గత ఏడాది నవంబరుకు రూ.185కోట్ల మేర 16లక్షల లావాదేవీలు పూర్తి చేశారు. మన రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో 3లక్షల మంది మహిళా రైతులు అదనంగా సేంద్రియ సేద్యంలోకి ప్రవేశించారు. ప్రకృతి సేద్యంలో కూడా రాష్ట్రం ఆదర్శంగా నిలిచింది. డ్వాక్రా గ్రూపుల ఆధ్వర్యంలో అన్న సంజీవని పేరుతో జనరిక్ మెడికల్ షాపులు నడుస్తున్నాయి. ఉపాధి హామీ పథకంలో అవెన్యూ ప్లాంటేషన్‌ను వీటి ద్వారా నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలో, వార్డుల్లో ప్రభుత్వ పథకాలు పేదల దరి చేర్చేందుకు ప్రతి 33కుటుంబాలకు ఒక సాధికారమిత్రను నియమించి మన రాష్ట్ర ప్రభుత్వం వారికి గుర్తింపునిచ్చింది. చంద్రన్న పెళ్లికానుకను అందించేందుకు కల్యాణమిత్రలుగా ఎంపికయ్యారు. కోటిమంది స్వయం సహాయక సభ్యులతో పాటు రెండున్నర కోట్ల అసంఘటిత రంగ కార్మికుల బీమాకు సంబంధించి చంద్రన్న బీమా పథకం ద్వారా పేదలకు సేవలందిస్తున్నారు.

'స్వయం' సాధికారం!

- మహిళల జీవనచిత్రం మార్చేసిన ఎస్‌హెచ్‌జీలు
- దేశానికి ఆదర్శంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్
- బ్రూకింగ్ ఇన్‌స్టిట్యూషన్ ప్రచురణలో ప్రస్తావన

అమరావతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో దారిద్ర్య నిర్మూలనకు స్వయం సహాయక బృందాల ఏర్పాటే మూలకారణమని ప్రముఖ సర్వేలు పేర్కొంటున్నాయి. గ్లోబల్ మల్టీ డెమన్షనల్ పావర్టీ ఇండెక్స్-2018 ప్రకారం బ్రూకింగ్ ఇన్‌స్టిట్యూషన్ ప్రచురించిన నోట్‌లో ఈ సంఘాల ఏర్పాటు వల్లనే దారిద్ర్య నిర్మూలన ఇటీవల కాలంలో వేగవంతమైందని పేర్కొంది. అట్టడుగు వర్గాలకు చెందిన మహిళలను సంఘటితం చేయడం ద్వారా ఆర్థికాభివృద్ధికి పునాది పడిందని భావిస్తున్నారు. వాస్తవానికి డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు చైతన్యం మన రాష్ట్రంలోనే ప్రారంభమైంది. చంద్రబాబు తొలిసారి ఉమ్మడి రాష్ట్ర సీఎం అయినప్పుడు వేసిన పునాదులు వేళ్లూనుకుని మహిళా సంఘాలు ఆర్థికరంగానికి ఊతంగా నిలిచాయని నిపుణులు పేర్కొంటున్నారు. దేశంలో 9కోట్ల కుటుంబాలను స్వయం సహాయక సభ్యులుగా మారేందుకు స్ఫూర్తినిచ్చింది మన రాష్ట్రమేనని చెప్పవచ్చు. రాష్ట్రంలోనే 94 లక్షల మంది సభ్యులు పొదుపు గ్రూపులుగా ఏర్పడి ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ కుటుంబాలను పేదరికం నుంచి గట్టెక్కించుకుంటున్నారు. గ్రామీణ మహిళల్లో సామర్థ్య పెంపుదల నిరంతర ప్రక్రియగా చేపట్టడంతో వారి సామాజిక, రాజకీయ సాధికారత పెరిగి అనేక ప్రభుత్వ కార్యక్రమాల్లో కీలకంగా మారారని సర్వేలు పేర్కొంటున్నాయి.

2014 నుంచి...

నెల్లూరు జిల్లాల్లో ప్రారంభమైన పొదుపు సంఘాలు రాష్ట్రమంతా విస్తరించి చివరకు సారా ఉద్యమం లాంటి సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చాయి. దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలు, 5 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 612జిల్లాల్లో 5,123 మండలాల్లో పొదుపు గ్రూపులు ఏర్పాటయ్యాయి. మన రాష్ట్రంలోని 654 మండలాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ ప్రతి ఇంట్లో కనీసం ఒక స్వయం సహాయక సభ్యురాలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దేశంలో 3కోట్ల మందికి పైగా పేద మహిళలు 26.9లక్షల గ్రూపులుగా ఏర్పడితే అందులో ఒక్క మనరాష్ట్రంలో 10లక్షల మందికి పైగా ఈ నాలుగేళ్లలో నమోదయ్యారు. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా పొదుపు సంఘాలకు బ్యాంకులు రూ.1.96లక్షల కోట్లు రుణాలుగా ఇచ్చాయంటే వాటి ప్రభావం ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. సకాలంలో రుణాలు తిరిగి చెల్లించడంతో బ్యాంకుల్లో నాన్ పెర్ఫార్మెన్స్ అసెట్ రేట్ కూడా 2.64శాతానికి పడిపోయింది. ఒకప్పుడు గ్రామీణ పేదలకు రుణాలివ్వాలంటే భయపడే బ్యాంకులు ఇప్పుడు సంఘటిత శక్తిగా ఉన్న డ్వాక్రా గ్రూపులకు రుణాలివ్వడానికి రెడ్ కార్పెట్ పరుస్తున్నాయి. మన రాష్ట్రంలో డిసెంబరు 2018 నాటికి 3.32 లక్షల డ్వాక్రా బృందాలకు రూ.10,752కోట్లు రుణాలిచ్చాయి. బలీయమైన శక్తిగా ఆవిర్భవించిన డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఒక్కో సభ్యురాలికి రూ.10వేల పెట్టుబడి నిధిని మూడు విడతల్లో పంపిణీ చేయగా, తాజాగా పసుపు-కుంకుమ కానుకగా మరో రూ.10వేలు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారు.

దేశవ్యాప్తంగా రైతు రుణమాఫీ!

- బిహార్ సభలో రాహుల్ ప్రకటన
- మోదీ సర్కారు రూ.6 వేల హామీకి కౌంటర్!



పట్నా, ఫిబ్రవరి 3: లోక్‌సభ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ప్రజలపై హామీల వర్షం కురిపిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ.. మరో అతిపెద్ద హామీని ప్రకటించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలోని రైతులందరి రుణాలనూ మాఫీ చేస్తామన్నారు. ఆదివారం బిహార్‌లోని పట్నాలో ఓ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. "కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశ వ్యాప్తంగా రైతుల రుణాలు మాఫీ చేస్తాం. ప్రధాని మోదీ బిహార్‌తోపాటు దేశంలోని రైతులందరినీ అవమానపరిచారు. అందుకు రైతులు సరైన సమాధానం ఇస్తారు. వారు 'మాకు కాంగ్రెస్సే కావాలి.. బీజేపీ వద్దు' అంటున్నారు" అని అన్నారు. ఇంతకుముందు దేశంలోని నిరుపేదలందరికీ కనీస ఆదాయ పథకాన్ని అమలు చేస్తామని రాహుల్ ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, రెండు రోజుల క్రితం ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో.. దేశ వ్యాప్తంగా 5 ఎకరాల లోపు భూమి కలిగిన రైతులకు రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించిన నేపథ్యంలో రాహుల్ వెంటనే దేశవ్యాప్త రుణమాఫీని తెరపైకి తేవడం గమనార్హం. అంతేకాదు.. రూ.6 వేల సాయంపైనా రాహుల్ మరోసారి విమర్శలు గుప్పించారు. మోదీ ప్రభుత్వం అవినీతిపరులకు కోట్ల రూపాయలు కట్టబెడుతోందని, పేద రైతులకు మాత్రం రోజుకు 17 రూపాయలే ఇస్తానంటోందని విమర్శించారు. బీజేపీ హామీలు మాత్రమే ఇస్తుందని, కాంగ్రెస్ మాత్రం తమ హామీలను నిలబెట్టుకుంటుందని చెప్పారు. ప్రధాని మోదీ చెప్పినట్లుగా ఏ ఒక్కరి బ్యాంకు ఖాతాలోనైనా రూ.15 లక్షలు జమ అయ్యాయా? అని ప్రశ్నించారు. ఇటీవల కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు ఉత్తరాది రాష్ట్రాలు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో రైతు రుణాలను మాఫీ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బిహార్‌లో నితీశ్‌కుమార్ నేతృత్వంలోని బీజేపీ-జేడీయూ ప్రభుత్వం.. తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోతుందని చెప్పారు. కాగా పట్నాలోని గాంధీ మైదాన్‌లో నిర్వహించిన ఈ సభను లోక్‌సభ ఎన్నికలకు తొలి ప్రచార సభగా పరిగణిస్తున్నారు. ఆర్జేడీ నేత తేజస్వియాదవ్, జేడీయే రెబల్ వర్గం నేత శరద్ యాదవ్, ఆర్ఎల్ఎస్పీ, హెచ్ఏఎం నేతలతోపాటు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యూపీలో ఫ్రంట్ ఫుట్ ఆడతాం


లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ ఫ్రంట్ ఫుట్ ఆడుతుందని రాహుల్‌గాంధీ అన్నారు. 'యూపీలో మేం బ్యాక్ ఫుట్ ఆడబోం. తేజస్వియాదవ్, లాలూ యాదవ్‌తో కలిసి ఫ్రంట్ ఫుట్ ఆడతాం. సిక్సర్ కొడతాం' అని వ్యాఖ్యానించారు.

గాంధీ మైదాన్‌లో 28 ఏళ్ల తరువాత..

పట్నాలోని గాంధీ మైదాన్‌లో 28 ఏళ్ల సుదీర్ఘ విరామం అనంతరం ఏఐసీసీ అధ్యక్షుడు బహిరంగ సభలో పాల్గొన్నారు. 1989లో అప్పటి ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ ఇక్కడ సభకు హాజరయ్యారు. మళ్లీ ఇన్నాళ్లకు ఆదివారం రాహుల్ గాంధీ 'ప్రజా ఆకాంక్ష సభ' పేరిట సభ నిర్వహించారు.

'మాఫీ' మోసం!

- ఎన్నికలప్పుడే కాంగ్రెస్‌కు ఈ జ్వరం
- 2009లోనూ ఇలాగే చేశారు
- మొన్న 3 రాష్ట్రాల్లో ఇలాగే గెలిచారు: మోదీ



లేహ్, శ్రీనగర్, ఫిబ్రవరి 3: 'అధికారంలోకి వస్తే రైతులందరికీ రుణమాఫీ' అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ చేసిన ప్రకటనపై ప్రధాని మోదీ మండిపడ్డారు. కేవలం ఎన్నికల్లో గెలవడానికి ఈ జపం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ తీరు ముందు రోగం తెప్పించి.. తర్వాత మందు వేస్తున్నట్లుగా ఉందని ధ్వజమెత్తారు. ఆదివారం మోదీ లేహ్, జమ్ము, శ్రీనగర్‌లలో పర్యటించారు. వివిధ ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్నిటికి శంకుస్థాపన చేశారు. ఆయా సందర్భాల్లో జరిగిన సభల్లో ప్రసంగించారు. ఐదెకరాల లోపు రైతులకు సంవత్సరానికి రూ.6 వేల చొప్పున సాయం చేయాలని తాము తీసుకున్న నిర్ణయాన్ని ఎద్దేవాచేసిన రాహుల్‌ను తూర్పారబట్టారు. "ఢిల్లీలో ఏసీ గదుల్లో కూర్చునేవారికి ఆరు వేల విలువ ఏం తెలుస్తుంది? మారుమూల ప్రాంతాల్లోని పేద రైతులకు రూ.6వేలతో జరిగే మేలు ఎలా తెలుస్తుంది? ఇప్పుడు... ఎన్నికల్లో విజయం కోసమే కాంగ్రెస్ రుణమాఫీ జపం చేస్తోంది. గత నెలలో మూడు రాష్ట్రాల్లో ఈ హామీతోనే గెలిచింది. 2008-09లో కూడా ఇలాగే రుణమాఫీ గిమ్మిక్కు చేసింది. అప్పట్లో రూ.6లక్షల కోట్లు రద్దు చేయాల్సి ఉంది. కానీ, కేవలం రూ.52 వేల కోట్లే మాఫీ చేసి రైతులను మోసం చేసింది. అందులోనూ, 35 లక్షల మంది అనర్హులకు రుణమాఫీ లబ్ధి చేకూరిందని కాగ్ దర్యాప్తులో బట్టబయలైంది. మధ్యప్రదేశ్‌లో రుణమాఫీ హామీతో అధికారంలోకి వచ్చి... 13 రూపాయల చెక్కులిచ్చారు. రాజస్థాన్‌లో అధికారంలోకి వచ్చాక.. రుణమాఫీ చేయలేమని చేతులెత్తేశారు. మాఫీలతో రైతుల కష్టాలు తీరవు' అని తెలిపారు. ఐదెకరాల్లోపు రైతులకు రూ.6వేల చొప్పున పంపిణీ చేసే 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి'కి ఏటా రూ.75 వేల కోట్లు కేటాయిస్తామని మోదీ తెలిపారు.

ఈ నెలలోనే రైతులకు 2 వేలు

పీఎం-కిసాన్ పథకం కింద చిన్న రైతులకు ప్రకటించిన పెట్టుబడి సాయాన్ని ఈ నెలలోనే పంపిణీ చేయనుంది. తొలి విడతగా రూ.2 వేల చొప్పున పంపిణీ చేయనున్నట్లు, లబ్ధిదారుల వివరాలు కూడా సిద్ధంగా ఉన్నట్లు కేంద్రఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ తెలిపారు.

సాయం పెంచుతాం: జైట్లీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: చిన్న, సన్నకారు రైతులకు అందించే పెట్టుబడి సాయాన్ని భవిష్యత్తులో మరింత పెంచుతామని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. పథకం ఈ ఏడాదే ప్రారంభమైందని, భవిష్యత్తులో వనరులను బట్టి.. ఒక్కో రైతుకు నెలకు రూ.500 కంటే ఎక్కువగా పెట్టుబడిసాయం అందిస్తామని చెప్పారు. ప్రస్తుతం అనారోగ్యంతో అమెరికాలో చికిత్స పొందుతున్న జైట్లీ.. ఆదివారం తన బ్లాగులో అభిప్రాయాలు పంచుకున్నారు. రైతుకు రోజుకు రూ.17 చొప్పున పెట్టుబడి సాయం అందిస్తున్నారంటూ రాహుల్‌గాంధీ ఎగతాళి చేయడం పట్ల మండిపడ్డారు.

అమరావతిలో 'న్యాయ శకం'

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్, తెలంగాణ హైకోర్టు సీజే రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీజేఐ గొగోయ్ మాట్లాడారు. 'న్యాయం, నైతిక విలువలు కలిసి ప్రయాణం చేస్తాయి. ఇచ్చిన తీర్పులను న్యాయమూర్తులు తమకు తాముగా సమర్థించుకోవడం కాదు. రాజ్యాంగం సమర్థించేలా ఉండాలి. ఒకప్పుడు బహిరంగంగా విచారించి, బహిరంగ ప్రదేశాల్లోనే తీర్పులిచ్చేవారు. క్రమంగా భవంతులొచ్చాయి. అమరావతిలో ఇప్పుడు భారీ భవంతిలో హైకోర్టు ప్రారంభమైంది. మనం చూడాల్సింది భవంతి ఎంత పెద్దదని కాదు. ఇది న్యాయానికి ప్రతీకగా ఉండేలా చేయాలి' అని జస్టిస్ గొగోయ్ పిలుపిచ్చారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

బాబును పొగడను.. ఎందుకంటే..!

'ఇది సంతోష సమయం. జస్టిస్ నగరానికి పునాది వేయడం, తాత్కాలిక హైకోర్టు భవనానికి ప్రారంభోత్సవం చేయడం ఆనందదాయకం. దీనికోసం అహర్నిశలు పనిచేసిన న్యాయవాదులు, అధికారులు, ప్రజలకు అభినందనలు. నేను సీఎం చంద్రబాబును పొగడను. ఎందుకంటే హైకోర్టు ఏర్పాటుకు సదుపాయాలు కల్పించాల్సిన రాజ్యాంగ బాధ్యతను ఆయన నెరవేర్చారు. ఆయనకు ధన్యవాదాలు చెప్తాను. ఎందుకంటే.. రాజ్యాంగ ధర్మాన్ని ఆయన బాగా నిర్వర్తించారు. బాగా చేశారు. ప్రభుత్వాలు ప్రజల్ని బాగా చూసుకుంటున్నాయా? విచక్షణ చూపుతున్నాయా? అన్నది న్యాయవ్యవస్థ చూడాలి. న్యాయమూర్తులు, న్యాయవాదులు కలిసి న్యాయవ్యవస్థ ప్రతిష్ఠ పెంచాలని బార్ న్యాయవాదులకు అప్పీల్ చేస్తున్నాను.'

పెండింగ్‌కు ఇలా పరిష్కారం!

'దేశవ్యాప్తంగా 3 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. కానీ నాణేనికి ఇంకోవైపు కూడా చూద్దాం. ఈ 3 కోట్లలో 81లక్షల కేసులు ఏడాదిలోపువే. అంటే వీటి విషయంలో ఆందోళన అక్కర్లేదు. అదేసమయంలో చిన్న జరిమానా విధించే చిన్న కేసులు మరో 50 లక్షలు. ఆందోళన కలిగించేవి ఏమిటంటే.. పదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న 25లక్షల కేసులు. ఈ కేసుల పరిష్కారం తక్షణ బాధ్యత. మరోవైపు న్యాయవ్యవస్థలో చాలా ఖాళీలు ఉన్నాయి. 5వేల ఖాళీలు జిల్లాల స్థాయి న్యాయవ్యవస్థలో ఉన్నాయి. వీటిని భర్తీ చేస్తాం. దేశవ్యాప్తంగా హైకోర్టుల్లో 392 జడ్జిల పదవులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో హైకోర్టు కొలీజియంలు సిఫార్సు చేయక 270 పోస్టుల భర్తీ ఆగిపోయింది. 100 మంది న్యాయమూర్తుల నియామకం సుప్రీంకోర్టు ముందుంది. మరో 14 మాత్రమే కేంద్ర, రాష్ట్రాల దగ్గర ఉన్నాయి. ఎవరినీ నిందించవద్దు. న్యాయమూర్తుల నియామక ప్రక్రియ హైకోర్టుల దగ్గరే ఎక్కువగా ఆగిందని అర్థమవుతోంది. ప్రతిపాదనలు త్వరగా పంపాలి. సుప్రీంకోర్టు దగ్గర ఉన్నవి తొందర్లో చేసేస్తాం. ఇది పెండింగ్ కేసుల సమస్యను పరిష్కరించేందుకు మార్గం. ఏపీ ప్రజలకు ఈ హైకోర్టును అంకిత చేస్తున్నాను.'

ప్రజలకు దగ్గరగా: జస్టిస్ లావు నాగేశ్వరరావు

హైకోర్టు భవనం ప్రారంభోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. 'మద్రాసు రాష్ట్రం నుంచి వేరుపడి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు కర్నూలులో రాజధాని, గుంటూరులో హైకోర్టు పెట్టారు. కోకా సుబ్బారావు తొలి ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వరకు ఆయన ఎదిగారు. ఎన్నో అద్భుత తీర్పులు ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హైకోర్టు ఏర్పాటైంది. తొలిరోజుల్లో కొన్ని సదుపాయాల లోటు ఉండొచ్చు. ఏదైనా ఇప్పుడు ప్రజలకు దగ్గరగా హైకోర్టు వచ్చింది' అని ఆయన అన్నారు.

బాబు దక్షత చూపించారు: జస్టిస్ సుభాష్‌రెడ్డి

'సీఎం చంద్రబాబు తన దక్షతను చూపించారు. నూతన హైకోర్టు ముందు 1.7 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. తెలంగాణలో కూడా ఇంతే సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రజలకు సత్వర న్యాయమే లక్ష్యంగా పనిచేయాలి' అని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ సుభాష్‌రెడ్డి అన్నారు.

మళ్లీ ఆ వైభవం: జస్టిస్ ప్రవీణ్‌కుమార్

అమరావతి ఒక విశిష్ట ప్రాంతం. ఇక్కడే సంస్కృతి, ధర్మం విలసిల్లింది. ఇప్పుడు మళ్లీ పూర్వవైభవం వస్తోంది. హైకోర్టు ఏర్పాటు ఏపీ ప్రజల కల. భవనాలు, మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్రం తన బాధ్యత నెరవేర్చింది. ఈ కోర్టును దేశంలో అత్యుత్తమం చేయాలి' అని ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు.

సాఫీగా విభజన: జస్టిస్ రాధాకృష్ణన్

ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కూడా నేను పనిచేశాను. ఆ హోదాలో ఉండగానే ఉమ్మడి హైకోర్టు విభజన ప్రక్రియ ప్రారంభించాం. గత ఆరునెలలుగా విభజన ప్రక్రియను సాఫీగా పూర్తయ్యేలా చేశాం. అని తెలంగాణ హైకోర్టు సీజే రాధాకృష్ణన్ అన్నారు.

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు సీజే

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం సాయంత్రం సుప్రీంకోర్టు సీజే జస్టిస్ రంజన్‌గొగోయ్ దర్శించుకున్నారు. ఆయన వెంట సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ వచ్చారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో ఈవో, జేఈవోలు లడ్డూ ప్రసాదాలు అందజేశారు.



హైకోర్టు భవన ప్రారంభోత్సవంలో సీజే, ఇతర న్యాయమూర్తులు





భారత న్యాయవ్యవస్థ

జ్యుడీషియల్ కాంప్లెక్స్, హైకోర్టు నమూనాల పరిశీలన

శక్తిమంతం

- వ్యక్తుల భావోద్వేగాలు వ్యవస్థల్ని ప్రభావితం చేయకూడదు
- కోర్టులు అన్నివేళలా ప్రజల పక్షానే
- హైకోర్టు ప్రారంభోత్సవంలో జస్టిస్ ఎన్వీ రమణ
- 'తెలుగువాడి తెలివితేటలకు జైజై'.. అంటూ కవిత

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'వ్యక్తుల భావోద్వేగాలు వ్యవస్థల్ని ప్రభావితం చేయడానికి ప్రయత్నించడం విచారకరం. ఇటీవల కాలంలో ఆ సమస్యల్ని ధీటుగా ఎదుర్కొన్నాం' అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పేర్కొన్నారు. ఆదివారం అమరావతిలో నూతన హైకోర్టు భవనం ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. 'భారత న్యాయవ్యవస్థ శక్తిమంతం కావడానికి న్యాయమూర్తులు, న్యాయవాదుల సమష్టి కృషే కారణం. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా న్యాయవ్యవస్థ మరింత బలపడడానికి కారణం.. ప్రజాస్వామ్యానికి నాయకులైన ప్రజలు ఈ వ్యవస్థను వెన్నంటి కాపుకాయడమే. న్యాయవ్యవస్థ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలిచింది. మనం పాత, కొత్త తరాల మధ్య సంధికాలంలో ఉన్నాం. అన్ని పరీక్షల్లోను భారత న్యాయవ్యవస్థ తన స్వయం ప్రతిపత్తిని కాపాడుకోవడానికి ప్రజలు మద్దతునివ్వడమే కాకుండా, దానిపై ఉన్న ప్రబల విశ్వాసంతోనే తీర్పులు ఆలస్యమైనా కోర్టులకే అగ్రతాంబూలం ఇస్తున్నారు. కోర్టులు సైతం అన్ని వేళలా ప్రజల పక్షానే నిలుస్తున్నాయి. ఇది న్యాయవ్యవస్థకూ, ప్రజలకూ మధ్యగల పరస్పర విశ్వాసానికి రుజువు. మానవ సంబంధాలు, రాజ్యాంగంలోని వివిధ వ్యవస్థల మధ్య అధికారం కోసం పెరిగిపోతున్న ఆరాటం ముప్పేట దాడి చేయడంతో అప్పుడప్పుడు న్యాయవ్యవస్థ విమర్శలకు గురై, వేగం మందగిస్తోంది. ప్రజాస్వామ్య దేశంలో ఇది సహజమే. ఇలాంటి సందర్భాల్లో వ్యక్తుల భావోద్వేగాలు మొత్తం వ్యవస్థను ప్రభావితం చేయబోవడం విచారకరం. ఈ సమస్యల్ని మనం ధీటుగా ఎదుర్కొన్నా.. న్యాయవ్యవస్థలోని చిన్న వ్యవస్థాగత సమస్యల్ని భూతద్దంలో చూపించి ప్రతిష్ఠను దిగజార్చే ప్రయత్నాలను మనం సమష్టిగా ఎదుర్కోవాలి' అని జస్టిస్ రమణ అన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

కొత్త అధ్యాయానికి రచయితలం!

'భారత ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ భవనం నుంచే ఇక రాష్ట్రంలో న్యాయపాలన జరగనుండడం సంతోషం. ఎందరో మహనీయుల అత్యున్నత అభివృద్ధికి బాటలు వేసిన బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యుడిగా ఈ మహోత్సవంలో పాల్గొనడం నాకు గర్వంగా ఉంది. పవిత్ర కృష్ణా తరంగాల సవ్వడిలో, తెలుగు సంస్కృతి పవనాల వీచికతో పరవశించే ఈ నేలపై రాజధానితోపాటు హైకోర్టు నిర్మాణం కావడం చారిత్రకం. ఈ అమరావతి రెండువేల ఏళ్ల క్రితమే ప్రసిద్ధి చెందింది. ఈ గడ్డ నూతన రాష్ట్ర పాలనకు కేంద్రం కావడం, ఈ బృహత్తర పరిణామానికి మన తరం భాగస్వాములు కావడం మనందరి అదృష్టం. రెండువేల ఏళ్ల ఘనచరిత్ర గల అమరావతికి, ఇప్పుడు మొదలైన కొత్త అధ్యాయానికి మనమంతా రచయితలవడం గర్వకారణం. అతి స్వల్ప వ్యవధిలో అటు రాజధాని నిర్మాణం జరుపుతూ, ఇటు హైకోర్టు భవనాన్ని సిద్ధం చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎం చంద్రబాబు కార్యదక్షతనూ అభినందిస్తున్నాను. రాజధాని నిర్మాణానికి తల్లి లాంటి తమ భూములను ఇచ్చిన రైతులు, ఈ ప్రాంత ప్రజల ఉదారతను, త్యాగాన్ని ముందు తరాలు గుర్తుపెట్టుకుంటాయి. నేను రైతు బిడ్డను. భూమితో రైతు అనుబంధం విడదీయరానిది. ఈ ప్రాంత రైతులు, ప్రజలే వాస్తవానికి రాజధాని నిర్మాతలు. శ్రీశ్రీ చెప్పినట్లు తాజ్‌మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలదే చరిత్ర. అలాగే రాష్ట్ర రాజధాని అమరావతి చరిత్రలో ఈ ప్రాంత ప్రజలు భాగస్వాములు. వారికి అభినందనలు.'

ఓర్పుకు, సహనానికి పేరొందినవాళ్లం

'ఇక్కడ కొత్తగా హైకోర్టు ఏర్పడింది. కొత్తలో కొన్ని ఇబ్బందులు తప్పవు. తెలుగువాళ్లం.. ఓర్పుకు, సహనానికి పేరొందినవాళ్లం కదా..! మన హైకోర్టు నిర్వహణ మెరుగుపర్చుకునేందుకు ఈ తాత్కాలిక ఇబ్బందులను తట్టుకోలేమా. ప్రజలు, న్యాయవాదులు సహకరిస్తే త్వరలోనే ఇక్కడి వసతుల మెరుగుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, వారి సహచరులు తగిన చర్యలు చేపట్టగలరు. కాలానుగుణంగా మారే న్యాయప్రక్రియ ఔన్నత్యాన్ని కాపాడేందుకు అడ్డుతగిలే ఆటంకాలన్నీ న్యాయవాదులు సమష్టిగా ఎదుర్కోవాలి. మన రాష్ట్ర న్యాయవ్యవస్థను అత్యున్నత స్థాయిలో నిలిపేందుకు కృషిచేద్దాం. మన తర్వాతి తరాలకు ఒక గొప్ప న్యాయవ్యవస్థను వారసత్వంగా ఇద్దాం. మనమధ్య చెలరేగే భేదాభిప్రాయాలు, వాదోపవాదాలు, పరిష్కారాలూ న్యాయవ్యవస్థ విలువలను దెబ్బతీయడం కాక ఇంకా బలీయం చేయగలగాలి. మూడోవ్యవస్థ మనమీద పెత్తనం చెలాయించే అవకాశానికి చోటివ్వకూడదు'.

తెలుగువాడు దేనికైనా సైసై

తెలుగువారి ధీశక్తి
తెలుగువారి క్రియాశక్తి
నలుదెసలా రహించాలి
తెలుగుతనం జయించాలి
కోట్లాది తెలుగుజాతి హర్షించాలి

తెలుగువాడి తెలివితేటలకు జైజై
తెలుగువాడు దేనికైనా సైసై
తెలుగువారి నెదురాడు వాడు సైసై

ప్రసంగం చివర జస్టిస్ ఎన్వీ రమణ రెండు చిరు కవితలు చెప్పి ఆకట్టుకున్నారు.



శాశ్వత హైకోర్టుకు శంకుస్థాపన చేస్తున్న భారత ప్రధాన న్యాయమూర్తి



హైకోర్టును ప్రారంభించి లోపలికి వస్తున్న సీజే, సీఎం, న్యాయమూర్తులు

న్యాయం చేయకపోతే కనుమరుగే

- కేసీఆర్, జగన్, ఎంఐఎంలతో ఫెడరల్ డ్రామా
- రాజకీయ కక్షే మీ ప్రధాన లక్ష్యం
- అమిత్ షాకు కళా వెంకట్రావు బహిరంగ లేఖ

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'ఒకప్పుడు విలువలు, సిద్ధాంతాలకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చిన బీజేపీ ఇప్పుడు అవకాశవాద రాజకీయాలు, వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ కక్ష ధోరణులను లక్ష్యంగా మార్చుకుంది. అవినీతిని ప్రోత్సహించే పార్టీగా మారింది' అని టీడీపీ ఏపీ అధ్యక్షుడు, మంత్రి కిమిడి కళావెంకట్రావు విమర్శించారు. పథకాల అమలుకంటే ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తున్నారని, గత 45ఏళ్లలో ఎప్పుడూలేని విధంగా రికార్డుస్థాయిలో రూపాయి విలువ పడిపోవడం నిరుద్యోగం తదితర విపత్కర పరిస్థితులకు బీజేపీ పాలనే కారణమని ఆక్షేపించారు. ఆంధ్రకు న్యాయం చేయకపోతే మీ పార్టీ కనుమరుగేనని విమర్శించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాకు పలు ప్రశ్నలు సంధిస్తూ ఆదివారం బహిరంగ లేఖ రాశారు. 'మీ ప్రభుత్వం ఆర్బీఐ, సీబీఐల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసింది. చివరికి సీబీఐ మూతపడే దుస్థితి తీసుకొచ్చింది. అన్ని రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని దెబ్బతీసింది' అని కళా వెంకట్రావు ఆరోపించారు. బీజేపీ, వైసీపీల కుట్రను రాష్ట్ర ప్రజలు అర్థంచేసుకున్నారని, తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. లేఖలో ప్రశ్నలు ఇలా ఉన్నాయి...

- కేంద్ర తాజా బడ్జెట్ ఏపీ ప్రజల ఆశలకు అనుగుణంగా ఉందని మీరు భావిస్తున్నారా? విభజన చట్టంలోని అంశాలు, పార్లమెంటులో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా 5కోట్ల మంది ప్రజలను అవమానించారు. మీ కక్ష పూరిత రాజకీయాలకు ఇది నిదర్శనం కాదా?
- రూ.43వేల కోట్ల అక్రమాలకు పాల్పడి, 12 కేసుల్లో ఏ1 ముద్దాయిగా ఉన్న జగన్ ఎలా స్నేహితుడయ్యారు? అవినీతిని ప్రోత్సహించడం ద్వారా మీ పార్టీ సిద్ధాంతాలను వదిలేస్తున్నారనేదానికి ఇది ఉదాహరణ కాదా?
- మహారాష్ట్రకు రూ.4,714 కోట్లు కరువు సాయం ప్రకటించి, ఏపీకి రూ.900 కోట్లే ప్రకటించడం వివక్ష కాదా?
- రూ.38వేల కోట్ల విలువైన నిర్మాణాలు చేపట్టిన అమరావతికి రూ.1500కోట్లు ఇవ్వడం కక్ష కాదని అనగలరా?
- జేపీ నేతృత్వంలోని స్వతంత్ర నిపుణు ల కమిటీ రాష్ట్రానికి రూ.80వేల కోట్లు రావాలని తేల్చింది. పవన్ ఆధ్వర్యంలోని ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ కూడా 75వేల కోట్లు రావాలని అంచనా వేసింది. రాష్ట్ర ప్రజలంతా ప్రత్యేకహోదా, విభజన హామీల గురించి బడ్జెట్‌లో పొందుపరుస్తారని ఎదురుచూశారు. కానీ, ఆంధ్రకు అన్యాయం చేస్తూ మీ ఆర్థిక మంత్రి పెట్టిన బడ్జెట్‌ను మీరు ఆమోదించగలరా?
- కేవలం రూ.15వేల కోట్లు ఇచ్చి, విభజన చట్టం ప్రకారం రూ.లక్షల కోట్లు ఇచ్చామని చెప్పడం అవాస్తవం కాదా?
- కేసీఆర్, జగన్, ఎంఐఎంలతో కలిసి బీజేపీ వ్యతిరేక పార్టీలను అస్థిరపర్చాలని ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుచేయడం మీ డ్రామాలో భాగం కాదా?

మా ఓట్లు తొలగిస్తున్నారు: జగన్

అమరావతి/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ సానుభూతిపరుల ఓట్లను టీడీపీ ప్రభుత్వం అక్రమంగా జాబితా నుంచి తొలగిస్తోందని వైసీపీ అధ్యక్షుడు జగన్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నారు. ఆదివారం రాత్రే ఆయన ఢిల్లీ చేరుకున్నారు. ఆయన వెంట వైసీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, మాజీ ఎంపీ మిథున్‌రెడ్డి ఉన్నారు. సోమవారం ఉదయం 11.30కి ఎన్నికల ప్రధాన కమిషనర్ సునీల్ అరోరాను కలుస్తారు.

ఆర్బిట్రేషన్ C/o అమరావతి!

- లండన్, సింగపూర్, హాంకాంగ్ వెళ్లక్కర్లేదు
- సుప్రీంకోర్టు సహకరిస్తే సాధ్యం
- భూమిస్తాం.. ఏపీలోనూ 'నల్సార్' కావాలి
- సీజే గొగోయ్‌ను కోరిన సీఎం చంద్రబాబు
- అద్భుతంగా జస్టిస్ సిటీని నిర్మిస్తాం
- హైకోర్టు సిబ్బందికి ఉచిత నివాసం, రవాణా
- ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'ప్రపంచవ్యాప్తంగా ఆర్బిట్రేషన్(మధ్యవర్తిత్వం)కు లండన్, సింగపూర్, హాంకాంగ్ వెళ్తారు. కానీ సుప్రీంకోర్టు సహకరించి.. ఆర్బిట్రేషన్‌లో అమరావతిని ప్రసిద్ధి చేయాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఆదివారం హైకోర్టు ప్రారంభోత్సవం, శాశ్వత హైకోర్టు భవనానికి జరిగిన భూమిపూజలో పాల్గొన్న సీఎం.. ఆ తర్వాత ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. 'మా అమరావతి ప్రపంచంలోని ఐదు గొప్పనగరాల్లో ఒకటిగా నిర్మిస్తాం. అదేవిధంగా నవనగరాల్లో ఒకటైన జస్టిస్ సిటీని అత్యద్భుతంగా చేస్తాం. హైకోర్టు, ఆర్బిట్రేషన్ కోర్టులు, ట్రైబ్యునళ్లు, న్యాయ లైబ్రరీలు, న్యాయ విశ్వవిద్యాలయం, చివరకు న్యాయమూర్తులకు ఇళ్లు అన్నీ ఇందులోనే ఉంటాయి. ఇక్కడ నల్సార్ యూనివర్సిటీ పెట్టాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కోరుతున్నాను. దానికి కావాల్సిన భూమిని కేటాయిస్తాం. గతంలో నేను హైదరాబాద్‌లో నల్సార్ విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించాను. ఇక్కడ కూడా ప్రారంభించేందుకు సహకరించాలి. హైకోర్టు సిబ్బందికి ఉచిత నివాసం, రవాణా సౌకర్యం కల్పిస్తాం. ఇక్కడ అత్యుత్తమ సౌకర్యాలు కల్పిస్తామని న్యాయమూర్తులు, న్యాయవాదులకు హామీ ఇస్తున్నాను. మనం చేసే పనులే మన భవిష్యత్‌ను నిర్ణయిస్తాయి. నిన్న చేసిన పనులు ఈ రోజును.. ఈరోజు చేసే పనులు భవిష్యత్‌ను నిర్ణయిస్తాయన్న స్వామి వివేకానంద మాటలు ఆదర్శంగా తీసుకుని కష్టపడుతున్నాం' అని చంద్రబాబు అన్నారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

పర్యావరణాన్ని కాపాడుతూనే..!

'రైతుల త్యాగాల వల్లే ఇక్కడున్నాం. 34వేల ఎకరాలు భూసమీకరణ కింద ఇచ్చారు. ప్రపంచంలోనే ఎక్కడా ఇలా జరిగిన దాఖలాల్లేవు. రూ.50వేల కోట్లను మౌలిక సదుపాయాలకు ఖర్చుచేస్తున్నాం. ఆంధ్రప్రదేశ్ అద్భుతమైన రాష్ట్రం. వెయ్యి కిలోమీటర్ల సముద్రతీర ప్రాంతం ఉంది. నదులున్నాయి. మేం పర్యావరణాన్ని కాపాడతాం. గత నాలుగున్నరేళ్లలో అటవీ విస్తీర్ణం పెంచడంలో దేశంలోనే ముందున్నాం. అందమైన సముద్రతీరాలను పర్యాటక ప్రాంతాలుగా మలచాలి. పర్యావరణాన్ని కాపాడుతూనే సముద్రతీర ప్రాంతాలను పర్యాటకంగా ఉపయోగించుకునే విషయంలో న్యాయవ్యవస్థ కూడా సానుకూలంగా ఆలోచించాలి.'

హోదా ఇవ్వాల్సిందే

'రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు, రాజ్యసభలో హామీ ఇచ్చిన ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చి తీరాలి. మా కష్టంతో మేం అభివృద్ధి సాధిస్తున్నాం. వయాడక్ట్ విధానంతో ముందుకెళ్తున్నాం. అదే సమయంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ముందున్నాం. ఈజ్ ఆఫ్ లివింగ్.. అంటే ఒక్క స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు. ప్రభుత్వ, ప్రైవేటు సేవలు అందేలా ఏర్పాటు చేస్తున్నాం. టెక్నాలజీ సాయంతో ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నాం. ఇక్కడ చేస్తున్న ప్రకృతి వ్యవసాయం ప్రపంచానికే ఆదర్శం. ప్రపంచవ్యాప్తంగా 0.3శాతం, దేశంలో 0.6శాతం ప్రకృతి సేద్యం చేస్తుంటే.. ఏపీలో మాత్రం 8శాతం భూముల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నారు.'

భవనం బాగుంది: సీజే

'హైకోర్టును ప్రారంభించిన భవనం విస్తీర్ణం 2.65లక్షల చదరపు అడుగులు. అంతటి విస్తీర్ణం కలిగిన భవనాన్ని ఎల్అండ్‌టీ సంస్థ కేవలం 6నెలల్లోనే పూర్తిచేసింది. 2వేల మంది కార్మికులు నిరంతరం దీని కోసం పనిచేశారు. నాతోపాటు సీఆర్‌డీఏ అధికారులు పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేశారు' అని చంద్రబాబు అన్నారు. కాగా, జస్టిస్ గొగోయ్‌కు సీఎం చంద్రబాబు హైకోర్టు భవనాన్ని చూపించారు. ఈ సందర్భంగా వివరాలు అడిగి తెలుసుకున్న సీజే.. భవనం బాగుందని కితాబిచ్చారు. నిర్మాణం ఎలా జరిగిందో సీఆర్డీయే కమిషనర్ శ్రీధర్ వివరించారు. జస్టిస్ సిటీ విశేషాలను న్యాయమూర్తులకు తెలిపారు.

వైసీపీ X టీడీపీ!

- ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయాలేంటి?
- చెవిరెడ్డి ప్రసంగంపై టీడీపీ అభ్యంతరం
- వేదిక ముందు బైఠాయించి ఎమ్మెల్యే నిరసన
- తోపులాట.. సొమ్మసిల్లిన భాస్కరరెడ్డి



తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 3: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీలో ఆదివారం జరిగిన పసుపు-కుంకుమ కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వైసీపీకి చెందిన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన అనుచరులతో అక్కడకు చేరుకున్నారు. సభలో ప్ర సంగిస్తూ... జగన్ అధికారంలోకి రాగానే పింఛన్లు రెట్టింపు చేస్తామనడంతో టీడీపీ నాయకు లు అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమంలో రాజకీయ ప్రసంగం వద్దని వారించారు. దీంతో చెవిరెడ్డి వేదిక ముందు బైఠాయించి నిరసన తెలిపారు. దీనిపై అసహనానికి గురైన మహిళలు, టీడీపీ నాయకులు 'చెవిరెడ్డి గో బ్యాక్, డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి చెవిరెడ్డిని అదుపులోకి తీసుకునే క్రమంలో తోపులాటలు జరిగా యి. ఈ క్రమంలో అస్వస్థతకు గురైన చెవిరెడ్డిని రుయా ఆస్పత్రికి తరలించారు. ఇదే సమయంలో టీడీపీ నాయకులు రామచంద్రాపురం-తిరుపతి రహదారిపై బైఠాయించి చెవిరెడ్డి తీ రును నిరసించారు. జిల్లాలో పలు చోట్ల వైసీపీ శ్రేణులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. వైసీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి, చెవిరెడ్డి భార్య లక్ష్మి వైసీపీ కార్యకర్తలతో తిరుపతి అర్బన్ పోలీస్ కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. టీడీపీ గూండాలను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. చివరికి వేదాంతపురం సంఘటన రాజకీయ రంగు పులుముకొని ఎన్నికల వాతావరణాన్ని తలపించింది. రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చెవిరెడ్డిని వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు.

కాంగ్రెస్‌కు కురువృద్ధులు గుడ్‌బై

- మొన్న కోట్ల .. నిన్న కిశోర్ చంద్రదేవ్

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కాకలు తీరిన కాంగ్రెస్‌వాదులు.. ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేస్తున్నారు. ఇటీవల కర్నూలు జిల్లాకు చెందిన కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి పార్టీని వీడగా... ఆదివారం నాడు విజయనగరం జిల్లాకు చెందిన గిరిజన నేత, కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్ కూడా కాంగ్రెస్‌కు టాటా చెప్పారు. వీరిద్దరికీ కాంగ్రెస్‌తో వారసత్వ అనుభవం ఉంది. 125 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన జాతీయ కాంగ్రెస్ పార్టీలో ఐదు దశాబ్దాలకుపైగా కార్యకర్తలుగా, ప్రజా ప్రతినిధులుగా, మంత్రులుగా, క్రియాశీల వ్యక్తులుగా, జాతీయస్థాయి నిర్ణయాల సమయంలో కీలక సలహాదారులుగా వ్యవహరించిన వీరు... ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత రాజకీయంగా కనుమరుగైపోయే స్థితికి వచ్చారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూశాక... 2019 నాటికి కాంగ్రెస్ కొంతమేర కోలుకుంటుందని ఈ నేతలు విశ్వసించారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టం అమలుపై ఇస్తున్న హామీలతో కొంత సానుకూల వాతావరణం ఏర్పడుతున్నా... ఈ బలం ప్రజాప్రతినిధులుగా తమ విజయానికి ఏమాత్రమూ సరిపోదని సీనియర్ కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఒకప్పుడు తన నీడ కింద ఎవరూ ఎదగకుండా చేసిన కాంగ్రెస్‌కు ఇప్పుడు రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీల ఊతం కావాల్సిన పరిస్థితి నెలకొంది. తెలంగాణలో మాదిరిగానే రాష్ట్రంలోనూ కాంగ్రెస్‌తో తెలుగుదేశం పొత్తు పెట్టుకుంటుందని భావించారు. కానీ, ఒంటరిగానే పోటీకి వెళ్లాలని కాంగ్రెస్ నిర్ణయించడంతో సీనియర్ నేతలలో పొత్తు ఆశలు ఆవిరైపోయాయి. ఈ నేపథ్యంలో రాజకీయంగా మనుగడ సాధించాలంటే బలమైన ప్రాంతీయ పార్టీని ఎన్నుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వైసీపీలో చేరాలంటే గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డితో ఉన్న వైరం, తమకు జరిగిన అవమానాలు గుర్తుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఫ్యాన్‌కంటే సైకిలే బెటరని సీనియర్లు భావిస్తున్నారు.



ఆదిశేషగిరిరావుకు మిఠాయిలు తినిపిస్తున్న టీడీపీ ప్రజా ప్రతినిధులు

రాష్ట్ర ప్రయోజనాలే నాకు ముఖ్యం

- 7న చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి ఆదిశేషగిరిరావు
- బుర్రిపాలెంలో టీడీపీ నేతలతో భేటీ

తెనాలి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): 'జన్మనిచ్చిన రాష్ట్రం అప్పుల ఊబినుంచి బయటపడాలంటే మరోసారి సీఎంగా చంద్రబాబే సమర్థుడని నమ్మాను. ఆయన అందిస్తున్న పథకాలే దీనికి నిదర్శనం. వాటికి ముగ్ధుడనై చంద్రబాబు వెంట నడవాలని నిర్ణయించాను' అని హీరో కృష్ణ సోదరుడు, నిర్మాత ఘట్టమనేని ఆదిశేషగిరిరావు చెప్పారు. ఈ నెల 7న టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. వైసీపీకి రాజీనామా చేసిన ఆయన ఇటీవల సీఎం చంద్రబాబును కలిసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదిశేషగిరిరావును పార్టీలోకి ఆహ్వానించేందుకు టీడీపీ ప్రజాప్రతినిధులు బుద్దా వెంకన్న, గద్దె రామ్మోహన్‌రావు, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ వర్ల రామయ్య ఆదివారం గుంటూరు జిల్లా బుర్రిపాలెం వచ్చారు. గంటన్నరసేపు ఆయనతో చర్చలు జరిపారు. మంచి వ్యక్తిత్వం ఉన్న హీరో కృష్ణ కుటుంబం టీడీపీతో కలిస్తే గౌరవంగా ఉంటుందని చంద్రబాబు భావించి, ఆదిశేషగిరిరావు దగ్గరకు పంపారని పార్టీ నేతలు మీడియాకు తెలిపారు. 'ఈ నెల 7న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్నాను. 2 రోజుల నుంచి రాష్ట్రంలోని కృష్ణ, మహేశ్‌బాబు అభిమానులతో మాట్లాడాను. 40 ఏళ్ల నుంచి ఎన్టీఆర్, కృష్ణ అభిమాన సంఘాల మధ్య పోటీ ఉండేది. ఇకపై రెండు సంఘాలు కలసి నడుస్తాయి. ఈ రెండు సంఘాలు కలయికతో రాష్ట్రంలో ప్రభంజనమే సృష్టించవచ్చు. అన్నయ్య ఆశీసులు కూడా తీసుకున్నాను' అని ఆదిశేషగిరిరావు విలేకరులకు తెలిపారు. మహేశ్‌బాబుకు రాజకీయాలతో సంబంధంలేదని, ఆయన ప్రచారాలకు రారని తేల్చిచెప్పారు.

కాంగ్రెస్‌కు కిశోర్‌చంద్ర వీడ్కోలు

- పార్టీలో సీనియర్లకు గౌరవం లేదు.. అందుకే రాజీనామా: వైరిచర్ల

విజయనగరం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్‌చంద్రదేవ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆదివారం కురుపాంకోటలో మీడియాకు ఆయన ఈ విషయం ప్రకటించారు. రాజీనామా లేఖను పార్టీ జాతీయ అధ్యక్షుడికి పంపించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కిశోర్ చంద్ర కీలక వ్యాఖ్యలు చేశారు. 'కాంగ్రెస్‌లో సీనియర్లకు గౌరవం లభించడం లేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ చురుకైన పాత్ర పోషించడం లేదు. ఈ పరిస్థితుల్లో పార్టీలో ఉన్నా ఫలితం ఉండదు. అందుకే కాంగ్రెస్‌ను వీడాలని నిర్ణయించుకున్నా. త్వరలో ఏ పార్టీలో చేరుతానో స్పష్టం చేస్తా' అన్నారు. లోక్‌సభ సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా అనేక ప్రజోపయోగ పనులకు ప్రాధాన్యమిచ్చానని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీతో 45 ఏళ్ల సుదీర్ఘ అనుబంధాన్ని తెంచుకోవడం బాధగా ఉందన్నారు. గత ఎన్నికల్లో రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీ ప్రజాగ్రహాన్ని చవిచూసిందన్నారు. నాడు ఓటమి తప్పదని తెలిసినా అరకు ఎంపీ స్థానానికి పోటీ చేసిన విషయం గుర్తుచేశారు. బీజేపీ ఓటమికి వ్యతిరేకంగా పనిచేస్తానన్నారు.

మా కుటుంబమంతా రాజప్ప వెంటే..

- ఉప ముఖ్యమంత్రి సోదరుడు జగ్గయ్య నాయుడు వెల్లడి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 3: మా కుటుంబమంతా సోదరుడైన ఉప ముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప వెంటే ఉంటుంది.. అని పీఏసీఎస్ అధ్యక్షుడు నిమ్మకాయల జగ్గయ్యనాయుడు ప్రకటించారు. అమలాపురం హోంమంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. 'మా అన్న లక్ష్మణమూర్తి(బాబోజీ) ఏనాడూ క్రియాశీల రాజకీయాల్లో లేరు. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఆయనకు టీడీపీ సభ్యత్వం కూడా లేదు. ప్రజాసేవలోగానీ, పార్టీ కార్యక్రమాల్లోగానీ ఏనాడూ పాల్గొనని బాబోజీ నచ్చిన పార్టీలోకి వెళ్లడం ఆయన వ్యక్తిగత విషయం. దీనివల్ల టీడీపీకి ఇబ్బందిలేదు' అని స్పష్టం చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి, ప్రాంతాభివృద్ధికి చినరాజప్ప కృషిచేస్తున్నారని వివరించారు. స్థానికంగా ఉండే కొందరు కావాలనే బాబోజీని వేరే పార్టీలోకి ఆహ్వానించి ఉండవచ్చునన్నారు.



"రాజీవ్ కుమార్ ప్రపంచంలోనే అత్యుత్తమ పోలీసు అధికారి. ఎలాంటి వారెంటు లేకుండా పోలీస్ కమిషనర్ ఇంటికి వచ్చే ధైర్యం సీబీఐకి ఎవరిచ్చారు?"
- మమత



రాజ్యాంగాన్ని రక్షించాలంటూ ధర్నా చేస్తున్న బెంగాల్ సీఎం మమత. కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్‌కుమార్ ఇంటిపై సీబీఐ దాడుల అనంతరం ఆమె ఇలా నిరసనకు దిగారు.



సీబీఐ అధికారులను అడ్డుకుని వాహనంలో తరలిస్తున్న కోల్‌కతా పోలీసులు

బెంగాల్ యుద్ధం



(మొదటి పేజీ తరువాయి)

సిటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓ కేసులో విచారణకు వచ్చిన సీబీఐ అధికారులను సిటీ పోలీసులు అదుపులోకి తీసుకోవడం దేశంలో బహుశా ఇదే తొలిసారి. దీంతో కేంద్రం, బెంగాల్ సర్కారు మధ్య యుద్ధం తారస్థాయికి చేరింది.

పోలీసు కమిషనర్ కనిపించడం లేదు

కోల్‌కతా పోలీసు కమిషనర్, 1989 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన రాజీవ్ కుమార్ 'పరారీ'లో ఉన్నారని, ఆయన కోసం 'గాలిస్తున్నామ'ని శనివారం సీబీఐ ప్రకటించింది. శారదా, రోజ్‌వ్యాలీ స్కాంల దర్యాప్తును ఆయన నీరుగార్చారని, నత్త నడకన విచారిస్తున్నారని ఆరోపించింది. దర్యాప్తులో కీలక డాక్యుమెంట్లు గల్లంతయ్యాయని ఆరోపించింది. ఈ కేసుల దర్యాప్తులో ఆయనను 'అనుమానితుడి'గా పేర్కొంది. విచారణకు రావాలని రెండేళ్లుగా నోటీసులు ఇచ్చామని, ఆయన తమకు సహకరించడం లేదని సీబీఐ వర్గాలు తెలిపాయి. ఆయన అరెస్టు తప్పదనే సంకేతాలు ఇచ్చాయి. ఇవే కేసుల్లో ఇటీవల ఓ సినీ నిర్మాత సహా తృణమూల్ నాయకుడిని సీబీఐ అరెస్టు చేసింది.

40 మందికిపైగా అధికారులు

చిట్‌ఫండ్ స్కామ్‌ల కేసుల్లో విచారించడానికి ఏకంగా 40 మందికిపైగా సీబీఐ అధికారులు ఆదివారం కోల్‌కతాలోని రాజీవ్ కుమార్ నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా అక్కడ హైడ్రామా కొనసాగింది. సీబీఐ అధికారులను సీపీ ఇంటి వద్ద ఉన్న సెంట్రీలు అడ్డుకున్నారు. వారిని లోపలికి వెళ్లనివ్వలేదు. అంతలోనే, వివిధ పోలీసు స్టేషన్ల నుంచి సీనియర్ పోలీసు అధికారులు పెద్దఎత్తున తరలి వచ్చారు. వారంట్లు ఉన్నాయా అని ప్రశ్నించారు. సీపీని విచారించడానికి మీ వద్ద ఉన్న కాగితాలు ఏమిటని నిలదీశారు. సీబీఐ అధికారులు ఎటువంటి వారంట్లు చూపించలేదని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో సీబీఐ అధికారులు, సిటీ పోలీసుల మధ్య ఘర్షణ జరిగింది. ముఖాముఖి తలపడ్డారు. కొంతమంది సీబీఐ అధికారులను బలవంతంగా అదుపులోకి తీసుకుని పార్క్ స్ట్రీట్, షేక్ స్పియర్ పోలీసు స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా, పోలీసు స్టేషన్లకు రావడానికి సీబీఐ అధికారులు నిరాకరించడంతో బలవంతంగా జీపుల్లోకి ఎత్తి పడేశారు. దీంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అయినా, ఆదివారం రాత్రి వరకూ కొంతమంది సీబీఐ అధికారులు పోలీసు కమిషనర్ ఇంటి బయటే ఉండడం గమనార్హం. మరి కొందరికె సిటీ పోలీసులు అక్కడికి రావడంతో ఘర్షణ వాతావరణం తీవ్రమైంది. సీబీఐ అధికారులను సిటీ పోలీసులు అరెస్టు చేశారనే ప్రచారం జరిగింది. అయితే, ఆదివారం రాత్రి కోల్‌కతా జాయింట్ కమిషనర్ ప్రవీణ్ త్రిపాఠీ విలేకరులతో మాట్లాడారు. సీబీఐ అధికారులను అరెస్టు చేయలేదని, విచారించి పోలీసు స్టేషన్ల నుంచి వదిలేశామని తెలిపారు. ఓ సీక్రెట్ ఆపరేషన్ నిమిత్తం వచ్చామని వాళ్లు చెప్పారని, కానీ, అదేంటో తమకు వివరించలేదని అన్నారు. కాగా, "చిట్‌ఫండ్ స్కాం కేసుల్లో కొన్ని డాక్యుమెంట్లు, ఫైళ్లు మిస్సయ్యాయి. దీనిపై రాజీవ్ కుమార్‌ను విచారించాల్సి ఉంది. ఆయనకు నోటీసులు జారీ చేసినా స్పందించలేదు. ఈ అంశంపై ఇప్పుడు మేమేమీ మాట్లాడం. ఏం జరుగుతుందో చూద్దాం" అని సీబీఐ అధికారులు వ్యాఖ్యానించారు.

సిటీ పోలీస్ వర్సెస్ కేంద్ర బలగాలు

కోల్‌కతా సీపీ రాజీవ్ కుమార్ ఇంటికి సీబీఐ అధికారులు రావడంతో సాల్ట్ లేక్‌లో ఉన్న సీబీఐ కార్యాలయాన్ని, జాయింట్ డైరెక్టర్ శ్రీవాత్సవ నివాసాన్ని మరికొందరు సిటీ పోలీసులు చుట్టుముట్టారు. సమాచారం అందుకున్న కేంద్రం.. కేంద్ర భద్రతా బలగాలను రంగంలోకి దింపింది. కోల్‌కతాలోని సీబీఐ కార్యాలయాలు అన్నిటికీ తరలించింది.

నేడు సుప్రీంకు వెళతాం

కోల్‌కతా పోలీసుల తీరుపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని సీబీఐ ప్రకటించింది. సీపీని విచారించడానికి వెళ్లిన అధికారులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్లకు తరలించారని, దీనిపై సోమవారమే పిటిషన్ దాఖలు చేస్తామని తెలిపింది. తమ వద్ద అన్ని కాగితాలూ ఉన్నా, వాటిని అంగీకరించడానికి పోలీసులు సిద్ధంగా లేరని పేర్కొంది. స్టేషన్ల నుంచి విడుదలైన సీబీఐ అధికారులు గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠీని కలవాలని భావిస్తున్నారు. కోల్‌కతా హైకోర్టులోనూ సీబీఐ కేసు దాఖలు చేసినట్లు తెలిసింది.

ప్రజాస్వామ్యం అపహాస్యం

- రాజ్యాంగాన్ని అగౌరవపరచిన మమత: బీజేపీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: సీబీఐ అధికారులను కోల్‌కతా పోలీసులు అరెస్టు చేయడంపై బీజేపీ భగ్గుమంది. పశ్చిమబెంగాల్‌లో ప్రజాస్వామ్యం అపహాస్యానికి గురైందని, రాజ్యాంగాన్ని మమతా బెనర్జీ ప్రభుత్వం అగౌరవపరిచిందని ఆరోపించింది. సీబీఐ అధికారులను అడ్డుకోవడం మమత నియంతృత్వ ధోరణికి నిదర్శనమని బీజేపీ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఈ చర్య ద్వారా తాను ప్రమాణం చేసిన రాజ్యాంగాన్ని తానే ఉల్లంఘించారని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు చేస్తున్న సీబీఐ పట్ల వ్యవహరించిన తీరు సర్వోన్నత న్యాయస్థానాన్ని ధిక్కరించేదిగా ఉందన్నారు. పశ్చిమ బెంగాల్‌లో నెలకొన్న పరిస్థితులు ఆ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దెబ్బతిన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని బీజేపీ మరో అధికార ప్రతినిధి నళిన్ కోహ్లీ అన్నారు. కోల్‌కతా పోలీసులు పూర్తిగా హద్దులు దాటి ప్రవర్తించారన్నారు. సీబీఐ వంటి దర్యాప్తు సంస్థల విధులకు ఇలా ఆటంకం కలిగించడమన్నది దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి ఇదే మొదటిసారి అని మరో నేత కైలాష్ విజయ్‌వర్గియా అన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

మోదీపై దీదీ గుస్సా

- కోల్‌కతాలో అర్ధరాత్రి ధర్నా
- నేటి బడ్జెట్ కూడా అక్కడ్నుంచే..!
- నా ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర
- మోదీ, షాపై ధ్వజమెత్తిన మమత
- కోల్‌కతా సీపీకి సంపూర్ణ మద్దతు

కోల్‌కతా, ఫిబ్రవరి 3: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అపర కాళిగా మారారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీపై శివాలెత్తారు. మోదీపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేసిన దీదీ.. వీధి పోరాటానికి దిగారు. ఆదివారం రాత్రి కోల్‌కతాలో ధర్నాకు దిగారు. మోదీ, అమిత్ షా కలిసి తన ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. దేశంలో ప్రస్తుతం ఎమర్జెన్సీ కంటే దారుణ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. కోల్‌కతా సీపీ రాజీవ్ కుమార్ ఇంటికి సీబీఐ అధికారులు వచ్చారని తెలిసిన వెంటనే ఆమె హుటాహుటిన అక్కడికి వెళ్లారు. రాజీవ్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన ఇంటి బయటే విలేకరులతో మాట్లాడారు. రాజీవ్‌ను ప్రపంచంలోనే అత్యుత్తమ పోలీసు అధికారిగా అభివర్ణించారు. ఎలాంటి వారెంటు లేకుండా పోలీస్ కమిషనర్ ఇంటికి వచ్చే ధైర్యం వారికి ఎవరిచ్చారని నిలదీశారు. "ప్రధాని మోదీ డైరెక్షన్‌లో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సీబీఐకి ఆదేశాలు ఇచ్చి కోల్‌కతాకు పంపించారు. పోలీసులపై చర్యలకు తెగబడడం దారుణం. సీబీఐ, ఈడీలకు ఆదేశాలు ఇచ్చి నన్ను వేధిస్తున్నారు. రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. నా ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు బీజేపీ కుట్ర పన్నుతోంది. ఇది రాజ్యాంగంపై దాడి. నేను రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ధర్నా చేస్తున్నా. సోమవారం ప్రవేశపెట్టాల్సిన రాష్ట్ర బడ్జెట్‌ను ధర్నా ప్రదేశం నుంచే ప్రవేశపెడతా. ఎన్నికల్లో ఎదుర్కోలేకనే ఇలా చేస్తున్నారు. మోదీ, అమిత్ షాల తీరు సిగ్గుచేటు" అని మమత దుయ్యబట్టారు. ఈ ధర్నాలో మమత వెంట సీపీ రాజీవ్‌కుమార్ కూడా ఉన్నారు. బీజేపీ బెంగాల్‌ను వేధిస్తోందని, తాను బ్రిగేడ్ ర్యాలీ నిర్వహించడమే ఇందుకు కారణమని చెప్పారు. సీబీఐ దాడులు జరుగుతాయని తమకు ముందే తెలుసన్నారు. తనను బెదిరిస్తున్నట్లుగా శనివారం ప్రధాని మాట్లాడిన భాషను చూశారు కదా! అని వ్యాఖ్యానించారు. మమత ధర్నా నేపథ్యంలో సీబీఐ కార్యాలయాల వద్ద సీఆర్పీఎఫ్ బలగాలను మోహరించారు. మరోవైపు పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ 'పరారీ'లో ఉన్నారంటూ సీబీఐ చెప్పేవన్నీ అబద్ధాలని కోల్‌కతా పోలీసులు స్పష్టం చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ అనుమతి అవసరమా!?

ఢిల్లీ స్పెషల్ పోలీసు ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద సీబీఐ పని చేస్తుంది. అందుకే, ఏ రాష్ట్రంలో అయినా తనిఖీలు, దర్యాప్తులు, అరెస్టులు చేయాలంటే ఆ రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. అయితే, 1989లో అప్పటి వామపక్ష ప్రభుత్వం సీబీఐకి జనరల్ కన్సెంట్ ఇచ్చింది. దాంతో, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక అనుమతి తీసుకోకుండానే ఏ కేసులోనైనా విచారణ చేపట్టే అధికారం సీబీఐకి దఖలు పడింది. సీబీఐకి ఇచ్చిన జనరల్ కన్సెంట్‌ను గత ఏడాది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. ప్రధాని మోదీతో ఘర్షణ నేపథ్యంలో గత నవంబరులో మమత సర్కారు కూడా సీబీఐకి ఇచ్చిన జనరల్ కన్సెంట్‌ను ఉపసంహరించుకుంది. దాంతో, కోర్టు ఆదేశించిన కేసుల్లో మినహా మిగిలిన కేసుల విచారణ, సోదాలకు సీబీఐ రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సిందే. కాగా, చిట్‌ఫండ్ కేసుల విచారణ బాధ్యతను సుప్రీం కోర్టు సీబీఐకి అప్పగించడం గమనార్హం.



సీబీఐ దాడులకు నిరసనగా రైల్‌రోకో చేస్తున్న తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు

ఫెడరల్ స్ఫూర్తిపై దాడి

- మమతపై ద్వేషంతో సీబీఐ ద్వారా కుట్ర: కాంగ్రెస్
- ప్రజాస్వామ్యానికి ముప్పుగా మోదీ-షా: కేజ్రీవాల్
- పరాకాష్టకు చేరిన వ్యవస్థల దుర్వినియోగం: చంద్రబాబు

న్యూఢిల్లీ/కోల్‌కతా/అమరావతి, ఫిబ్రవరి 3: పశ్చిమబెంగాల్ ఘటనకు సంబంధించి ప్రతిపక్షాలు కేంద్రంలోని మోదీ సర్కారుపై తీవ్రంగా విరుచుకుపడ్డాయి. ఎన్డీయే ప్రభుత్వం ఫెడరల్ స్ఫూర్తిపై దాడి చేస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై ద్వేషంతోనే సీబీఐ ద్వారా కుట్ర చేసిందని ఆ పార్టీ అధికార ప్రతినిధి అభిషేక్ మనుసింఘ్వీ అన్నారు. బీజేపీ, ప్రధాని మోదీ కలిసి రాష్ట్రంలో వివాదం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని, వారి విభజన సిద్ధాంతం ద్వారా లోక్‌సభ ఎన్నికల్లో కొన్ని ఓట్లయినా పొందవచ్చని భావిస్తున్నారని విమర్శించారు. కాగా ప్రధాని మోదీ-అమిత్‌షా ద్వయం ప్రజాస్వామ్యానికి, భారత్‌కు ముప్పుగా పరిణమించారని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ట్విటర్‌లో ఆరోపించారు. మమతా బెనర్జీ ధర్నాకు సంఘీభావం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ.. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతిపక్షాలన్నీ ఏకమై పోరుబాట పట్టడంతో మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం నిరాశా నిస్పృహల్లో కూరుకుపోతోందన్నారు. కోల్‌కతాలో పోలీసులు, సీబీఐ మధ్య చోటుచేసుకున్న పరిణామాలను ఆదివారం రాత్రి ఆయన ట్విటర్‌లో ఖండించారు. వ్యవస్థలను కేంద్రం దుర్వినియోగం చేయడం పరాకాష్టకు చేరిందన్నారు. కాగా బీజేపీ ప్రభుత్వ దోపిడీ విధానాలు, సీబీఐని రాజకీయంగా దుర్వినియోగం చేస్తున్న తీరుతో రాజ్యాంగం, ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రమాదంలో పడ్డాయని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ట్విటర్‌లో విమర్శించారు. మరోవైపు బీజేపీకి సీబీఐ భాగస్వామ్య పక్షంగా మారిపోయిందని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. సీబీఐ రాజకీయ నిర్ణయాలు తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వాలను రెచ్చగొడుతోందని ఆరోపించారు. ఇంకా ఆలస్యం కాకముందే అంతా మేల్కొనాలని, మోదీ-షా ద్వయం చర్యలను అడ్డుకోవాలని బీజేపీ మాజీ నేత యశ్వంత్‌సిన్హా అన్నారు. కోల్‌కతాలో బీజేపీ, తృణమూల్ కలిసి డ్రామా ఆడాయని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోపించారు. ఏ సిద్ధాంతం కోసమో కాకుండా వారి అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే పోట్లాడుతున్నాయన్నారు. తృణమూల్ ప్రభుత్వంపై ఉన్న అవినీతి కేసు ఎన్నో ఏళ్లుగా ఉన్నదేనని, ప్రధాన నిందితుడు బీజేపీలో చేరడంతో కేంద్రం ఇన్నాళ్లుగా మౌనంగా ఉండిపోయిందని పేర్కొన్నారు.

ఆశ చూపి మోసం: రోజ్ వ్యాలీ

అధిక వడ్డీల ఆశ చూపడం... కోట్లకు కోట్లు రాబట్టడం... చివరికి బోర్డు తిప్పేయడం! ఇవే... 'పోంజీ' స్కామ్‌లు! రోజ్‌వ్యాలీ, శారదా చిట్‌ఫండ్ స్కామ్‌లూ ఇలాంటివే! అందమైన 'రోజ్ వ్యాలీ' పేరు వినగానే తృణమూల్ పార్టీయే గుర్తుకొస్తుంది. ఎందుకంటే ఆ పార్టీ ముఖ్యనేతలైన తపస్ పాల్, సుదీప్ బంధోపాధ్యాయలకు ఈ స్కామ్‌లతో సంబంధముందని సీబీఐ తేల్చింది. రోజ్‌వ్యాలీ పేరిట రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్, హోటల్, వినోద వ్యాపారాన్ని ప్రారంభించారు. 'కొంత పెట్టుబడికి బండెడు లాభాలు' అని ఊదరగొట్టారు. బెంగాల్‌తోపాటు తూర్పు భారతంలోని అనేక రాష్ట్రాల నుంచి రూ.15వేల కోట్లు ప్రజల నుంచి వసూలు చేశారు. ఇది 'సామూహిక పెట్టుబడి పథకం' (సీఐఎస్) కిందికి వస్తుందని, అనుమతి లేకుండానే సొమ్ములు వసూలు చేశారని 2013లో 'సెబీ' పేర్కొంది. జనం సొమ్ము వెనక్కి చెల్లించాలని ఆదేశించింది. ఈ స్కామ్‌పై ఈడీ కూడా దర్యాప్తు చేస్తోంది.

ఇది శారదా స్కీమ్

పేరుకే ఇది 'శారదా చిట్‌ఫండ్' కుంభకోణం! కానీ.. దీని అవతారాలు ఎన్నెన్నో. బెంగాలీలకు ఆరాధ్యుడైన రామకృష్ణ పరమహంస సతీమణి 'శారద' పేరిట ఈ కంపెనీ ఏర్పాటైంది. ఇది దాదాపు 240 అనుబంధ కంపెనీల సమాహారం! చిట్‌ఫండ్స్, రియల్ ఎస్టేట్స్, హోటళ్లు, రిసార్టులు, వినోదం, మీడియా.. ఇలా అనేక రంగాల్లోకి విస్తరించింది. అదికూడా జనం డబ్బులతో! 'రెండేళ్లలోనే రెట్టింపు సొమ్ము' పేరిట ఊరూరా డిపాజిట్లు సేకరించారు. దాదాపు 40 శాతం కమీషన్‌గా ఇస్తుండటంతో ఏజెంట్లు ఉత్సాహంగా కలెక్షన్ల పంట పండించారు. 2008లో మొదలైన ఈ వసూళ్ల దందా 2013 వరకు కొనసాగింది. దాదాపు 2500 కోట్లు జనం నుంచి రాబట్టారు. 2013లో సెబీ జోక్యం చేసుకుంది. కలెక్షన్లు నిలిపి వేయాలని ఆదేశించింది. అప్పటికే వసూలు చేసిన డబ్బు వెనక్కి ఇవ్వాలని స్పష్టం చేసింది. సంస్థ ప్రమోటర్లు సుదీప్తో సేన్, దేవ్‌జనీ ముఖర్జీ అరెస్టయ్యారు.

ఎవరీ రాజీవ్ కుమార్?



'ఆయన ప్రపంచంలోనే అత్యుత్తమ పోలీసు అధికారి. 24 గంటలూ ప్రజల రక్షణలోనే ఉంటారు. ఇటీవల ఒకే ఒక్క రోజు సెలవు పెట్టారు'.. కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌పై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కురిపించిన ప్రశంసల వర్షమిది! ఆదివారం రాత్రి కోల్‌కతాలో జరిగిన హైడ్రామా మొత్తం రాజీవ్ కుమార్ కేంద్రంగానే నడిచింది. దీంతో.. ఎవరీ రాజీవ్ అనే ప్రశ్న మొదలైంది. ఆయన 1989 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. 2016లో కోల్‌కతా కమిషనర్‌గా నియమితులయ్యారు. తృణమూల్ నేతలు ఆరోపణలు ఎదుర్కొంటున్న శారదా చిట్‌ఫండ్, రోజ్‌వ్యాలీ స్కామ్‌లపై ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) ఆయనే నేతృత్వం వహించారు. 2013లో మమత సర్కారు ఈ సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ మోసాలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని బాధితులు సుప్రీంకోర్టునుఆశ్రయించారు. 2014లో సుప్రీంకోర్టు దీనిపై ఆదేశాలు జారీ చేసింది. అప్పటి నుంచి సీబీఐ దర్యాప్తు మొదలైంది. ఈ రెండు స్కామ్‌లకు సంబంధించిన కీలక పత్రాలు గల్లంతైనట్లు సీబీఐ గుర్తించింది. ఈ కేసుల దర్యాప్తులో ఎన్నిసార్లు సమన్లు పంపినా పట్టించుకోలేదని, గల్లంతైన పత్రాల వివరాలూ ఇవ్వలేదని సీబీఐ చెబుతోంది. రాజీవ్ కుమార్ చాలారోజులుగా 'ఢిల్లీ'కి ముఖం చాటేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై గురువారం ఈసీ నిర్వహించిన సమావేశానికి డుమ్మా కొట్టారు. ఢిల్లీలో అడుగు పెట్టగానే సీబీఐ తనను అరెస్టు చేస్తుందనే కారణంతోనే ఇలా చేసినట్లు భావిస్తున్నారు. ఆయనను అరెస్టు చేయనున్నట్లు శనివారమే ఊహాగానాలు వెలువడ్డాయి. ఆదివారం రాత్రి సీబీఐ అధికారులు నేరుగా రాజీవ్ ఇంటికే వెళ్లారు. కానీ, 'బెంగాల్ తిరుగుబాటు'తో సీబీఐకి ఎదురుదెబ్బ తగిలింది.

ఆధారాలను ధ్వంసం చేశారు

- సీబీఐ డైరెక్టర్ నాగేశ్వరరావు

చిట్‌ఫండ్ కుంభకోణం కేసులో ఆధారాలను కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్ ధ్వంసం చేశారని సీబీఐ తాత్కాలిక డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు ఆరోపణ చేశారు. ఈ కేసులో పత్రాలు, ఆధారాలు అన్నింటినీ ఆయన స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. "సుప్రీం కోర్టు ఆదేశాలతోనే చిట్‌ఫండ్ కేసులో మేం దర్యాప్తు చేస్తున్నాం. సుప్రీం ఆదేశాలకు ముందే బెంగాల్ ప్రభుత్వం రాజీవ్‌కుమార్ నేతృత్వంలో సిట్‌ను నియమించింది. ప్రస్తుతం ఆయన కోల్‌కతా పోలీసు కమిషనర్‌గా ఉన్నారు" అని పేర్కొన్నారు.



భగ్గుమన్న బెంగాల్

మోదీ ప్రభుత్వం సీబీఐని ఉసిగొల్పుతూ కక్ష సాధింపు చర్యలకు దిగుతోందంటూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రవ్యాప్తంగా తృణమూల్ కాంగ్రెస్ శ్రేణులు కదంతొక్కాయి. ప్రజాస్వామ పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి మమతా బెనర్జీ దీక్షకు దిగిన దరిమిలా కార్యకర్తలు పెద్దఎత్తున రోడ్లపైకి వచ్చారు. పలు ప్రాంతాల్లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. కొన్నిచోట్ల రైళ్ల రాకపోకలను అడ్డుకున్నారు. జల్‌పాయ్‌గురి, రిష్డా, టీటాగఢ్, అసన్‌సోల్‌లో రైల్వే పట్టాలపై వారు బైఠాయించారు.

నాలుగో వన్డేలో చెత్త ప్రదర్శన తర్వాత ఈసారి కలిసికట్టుగా రాణిద్దామని సహచరులకు చెప్పా. అయితే ఆరంభంలోనే 4 వికెట్లు పడ్డాక ఎవరో ఒకరు నిలవాల్సిన అవసరం ఏర్పడింది. ఆ బాధ్యతలను రాయుడు, విజయ్ శంకర్ అద్భుతంగా నిర్వర్తించారు. చివర్లో జాదవ్, హార్దిక్ ఆడిన తీరు మమ్మల్ని మ్యాచ్‌లో నిలబెట్టింది. మా బౌలర్లు కూడా ప్రతిభ కనబరిచారు. ఛేదన సులువే అనిపించినా కివీస్‌ను నిలువరించారు. ఈ సిరీస్ విజయం మరుపురానిది **- రోహిత్ శర్మ**

ఆల్‌రౌండ్ షో ఇది

ఆస్ట్రేలియా x శ్రీలంక

రెండో టెస్ట్- ఐదో రోజు

ఉ. 5 గం. నుంచి

సోనీ సిక్స్‌లో...

ప్రొ వాలీబాల్‌లో నేడు

అహ్మదాబాద్ X హైదరాబాద్

రాత్రి 7 గం. నుంచి

సోనీ సిక్స్, సోనీ టెన్-3లో...



కివీస్ గడ్డపై తొలిసారి..

1967 నుంచి భారత జట్టు కివీస్‌లో పర్యటనకు వెళుతోంది. అయితే 52 ఏళ్లుగా అక్కడ సిరీస్‌లు ఆడుతున్నా కూడా తొలిసారి టీమిండియా 4-1తో అతిపెద్ద విజయాన్ని అందుకుంది. 2008-09 పర్యటనలో 3-1తో గెలవడమే ఇప్పటిదాకా జట్టు ఉత్తమ సిరీస్ విజయంగా ఉంది. తాజా గెలుపుతో నయా చరిత్ర సృష్టించినట్టయింది.

మాజీ సైనికునికి గౌతీ అండ



న్యూఢిల్లీ: సామాజిక సమస్యలపై స్పందిస్తూ, ఆపన్నులకు చేయూతనిచ్చే మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్.. ఓ మాజీ సైనికుడికి అండగా నిలిచాడు. పీతాంబరన్ అనే మాజీ సైనికుడు ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో భిక్షాటన చేస్తుండగా చలించిన గౌతీ.. ఆ విషయాన్ని ట్విటర్ ద్వారా రక్షణ శాఖ దృష్టికి తీసుకుపోయాడు. అతడి వద్ద ఉన్న గుర్తింపు కార్డు ప్రకారం..పీతాంబరన్ 1965 నుంచి 1971 వరకూ సైన్యంలో పని చేశాడని తెలిపాడు. గంభీర్ స్పందనను అభినందించిన రక్షణశాఖ ప్రతినిధి.. సాధ్యమైనంత త్వరగా పీతాంబరన్‌ను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఘనంగా ముగించారు

అంబటి అండతో..



అంబటి రాయుడు (90)

న్యూజిలాండ్‌పై భారత్ అద్భుత విజయం

తొలిసారి 4-1తో సిరీస్ కైవసం ● పాండ్యా మెరుపులు

పట్టుమని పది ఓవర్లయినా పూర్తికాలేదు.. 18 పరుగులకే భారత్ నాలుగు వికెట్లు కోల్పోయింది.. ఆదుకుంటాడనుకున్న ధోనీ ఒక్క పరుగుకే బౌల్డ్ అయ్యాడు. ఇంకేముంది.. నాలుగో వన్డేలాగే మరో దారుణ పరాజయం ఖాయమేనని అంతా భావించారు. కానీ ఈసారి జట్టు మిడిలార్డర్ క్రీజులో పాతుకుపోయింది. అంబటి రాయుడు కొంతకాలం తర్వాత అదిరే ఆటను ప్రదర్శించగా వన్డేల్లో 'తొలిసారి' బ్యాటింగ్‌కు దిగిన విజయ్ శంకర్‌తో పాటు కేదార్ జాదవ్ అతడికి సహకారం అందించారు. చివర్లో హార్దిక్ పాండ్యా సిక్సర్ల హోరుతో జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపాడు. ఆ తర్వాత బౌలర్లు ఎప్పటిలాగే ప్రత్యర్థిని చాపచుట్టేయడంతో కివీస్ గడ్డపై తొలిసారి టీమిండియా 4-1తో సిరీస్‌ను దక్కించుకుంది.

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ గడ్డపై భారత జట్టు అతిపెద్ద సిరీస్ విజయాన్ని అందుకుంది. తెలుగు తేజం అంబటి రాయుడు (113 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 90), హార్దిక్ పాండ్యా (22 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 45), విజయ్ శంకర్ (64 బంతుల్లో 4 ఫోర్లతో 45) ఆటతీరుతో పాటు బౌలర్ల రాణింపుతో ఐదో వన్డేలో భారత్ 35 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో ఈ సిరీస్‌ను 4-1తో గెలుచుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49.5 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌటైంది. కేదార్ జాదవ్ (45 బంతుల్లో 3 ఫోర్లతో 34) ఆకట్టుకున్నాడు. హెన్రీకి 4, బౌల్ట్‌కు 3 వికెట్లు దక్కాయి. లక్ష్యఛేదనలో కివీస్ 44.1 ఓవర్లలో 217 పరుగులకు ఆలౌటైంది. నీషమ్ (44), విలియమ్సన్ (39), లాథమ్ (37) మినహా అంతా విఫలమయ్యారు. చాహల్‌కు మూడు, షమి, పాండ్యాకు రెండేసి వికెట్లు దక్కాయి. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా రాయుడు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా షమి నిలిచారు.

టాపార్డర్ ఫట్: బౌలింగ్‌కు అనుకూలించే పిచ్‌పై ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. హామిల్టన్ పిచ్ మాదిరే ఇక్కడా బంతి స్వింగ్ కావడంతో కివీస్ పేస్ ద్వయం హెన్రీ నికోల్స్, ట్రెంట్ బౌల్ట్ చెలరేగారు. 18 పరుగులకే రోహిత్ (2), ధవన్ (6), గిల్ (7), ధోనీ (1) పెవిలియన్‌కు చేరారు. ఏడో ఓవర్‌లోనే క్రీజులోకి వచ్చిన ధోనీ.. బౌల్ట్ అద్భుత బంతికి క్లీన్‌బౌల్డయ్యాడు.

ఆదుకున్న రాయుడు, విజయ్: 9.3 ఓవర్లలోనే జట్టు పరిస్థితి ఇలా ఉండడంతో ఈసారి కనీసం 50 పరుగులైనా చేయగలుగుతుందా అనిపించింది. ఈసమయంలో అంబటి రాయుడు, విజయ్ శంకర్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ఆరంభంలో రాయుడు ఆచితూచి ఆడగా, విజయ్ శంకర్ ఆత్మవిశ్వాసంతో కనిపించాడు. భాగస్వామ్యం 50 పరుగులు దాటగానే రాయుడు జోరు పెంచాడు. గ్రాండ్‌హోమ్ బౌలింగ్‌లో 4, 6తో కదం తొక్కాడు. అయితే 32వ ఓవర్‌లో సమన్వయలోపంతో విజయ్ శంకర్ రనౌటయ్యాడు. చివరి బంతిని షార్ట్ మిడ్ వికెట్‌లోకి తరలించిన విజయ్ సింగిల్ కోసం రాయుడును పిలిచాడు. అయితే ముందుగా నిరాకరించిన రాయుడు ఆ తర్వాత వేగంగా ముందుకు కదిలాడు. అటు రన్ కోసం సిద్ధంగా లేని విజయ్ కాస్త ఆలస్యంగా పరుగు తీయగా, అప్పటికే నాన్‌స్ట్రయిక్ ఎండ్‌లోని వికెట్లను మన్రో పడగొట్టాడు. దీంతో ఐదో వికెట్‌కు 98 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో రాయుడు వేగం పెంచి వరుసగా రెండు బౌండరీలతో 86 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 40వ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాదిన రాయుడు సెంచరీకి పది పరుగుల దూరంలో వెనుదిరిగాడు. జాదవ్‌తో కలిసి ఆరో వికెట్‌కు 74 రన్స్ జత చేశాడు.



పాండ్యా అదిరె: 44వ ఓవర్‌లో హార్దిక్ పాండ్యా క్రీజులోకి వచ్చేసరికి జట్టు స్కోరు 190/6. కొద్దిసేపటికే జాదవ్ అవుట్ కావడంతో జట్టు బ్యాటింగ్ బాధ్యతను తానే తీసుకొని కివీస్ బౌలర్లకు సిక్సర్లతో చుక్కలు చూపించాడు. ఆస్లే వేసిన ఇన్నింగ్స్ 47వ ఓవర్‌లో వరుసగా 6, 6, 6తో ఆకాశమే హద్దుగా చెలరేగి 18 రన్స్ రాబట్టాడు. ఆ మరుసటి ఓవర్‌లోనూ సిక్స్ బాదగా.. 48వ ఓవర్‌లో 4, 6, 4తో విశ్వరూపం ప్రదర్శించి చివరి బంతికి బౌల్ట్ అద్భుత క్యాచ్‌తో వెనుదిరిగాడు. అప్పటికే జట్టు స్కోరును పటిష్ఠ స్థితికి చేర్చి ఎనిమిదో వికెట్‌కు 45 రన్స్ జోడించాడు.

కివీస్ తడబాటు: ఛేదనలో కివీస్ మరో 35 బంతులు మిగిలి ఉండగానే కుప్పకూలింది. ఓపెనర్లు నికోల్స్ (8), మన్రో (24)లను పేసర్ షమి అవుట్ చేయగా రాస్ టేలర్ (1)ను పాండ్యా అవుట్ చేయడంతో 38 రన్స్‌కే 3 వికెట్లు కోల్పోయింది. అయితే కెప్టెన్ విలియమ్సన్, లాథమ్ కలిసి ఐదో వికెట్‌కు 67 పరుగులు జోడించారు. విలియమ్సన్‌ను జాదవ్ అవుట్ చేశాడు.

ధోనీ మరోసారి..

ఆరో నెంబర్ బ్యాట్స్‌మన్ నీషమ్ ధాటైన బ్యాటింగ్‌తో భారత శిబిరంలో ఆందోళన పెంచాడు. అయితే అతడిని ధోనీ తన మార్కు కీపింగ్‌తో అవుట్ చేసి మ్యాచ్‌ను భారత చేతుల్లోకి తెచ్చాడు. 37వ ఓవర్‌లో జాదవ్ వేసిన బంతిని నీషమ్ స్వీప్ ఆడేందుకు ప్రయత్నించగా అది ధోనీ పక్క నుంచి కాస్త దూ రం వెళ్లింది. అయితే నీషమ్ పరుగు కోసం ముందుకు వెళ్లి వెంట నే వచ్చినా అప్పటికే బంతిని అందుకున్న ధోనీ రెప్పపాటులో వికెట్లపైకి విసిరి రనౌట్ చేశాడు. ఆ తర్వాత మిగతా బ్యాట్స్‌మెన్ క్యూ కట్టడంతో భారత్ సులువుగా నెగ్గింది.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (బి) హెన్రీ 2; ధవన్ (సి) హెన్రీ (బి) బౌల్ట్ 6; గిల్ (సి) శాంటర్న్ (బి) హెన్రీ 7; రాయుడు (సి) మన్రో (బి) హెన్రీ 90; ధోనీ (బి) బౌల్ట్ 1; విజయ్ శంకర్ (రనౌట్) 45; జాదవ్ (బి) హెన్రీ 34; పాండ్యా (సి) బౌల్ట్ (బి) నీషమ్ 45; భువనేశ్వర్ (సి) టేలర్ (బి) బౌల్ట్ 6; షమి (రనౌట్) 1; చాహల్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 49.5 ఓవర్లలో 252 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-8, 2-12, 3-17, 4-18, 5-116, 6-190, 7-203, 8-248, 9-252, 10-252. **బౌలింగ్:** హెన్రీ 10-1-35-4; బౌల్ట్ 9.5-2-39-3; నీషమ్ 5-0-33-1; గ్రాండ్‌హోమ్ 7-0-33-0; మన్రో 10-0-47-0; శాంటర్న్ 3-0-18-0; ఆస్లే 5-0-35-0.

న్యూజిలాండ్: మన్రో (బి) షమి 24; నికోల్స్ (సి) జాదవ్ (బి) షమి 8; విలియమ్సన్ (సి) ధవన్ (బి) జాదవ్ 39; టేలర్ (ఎల్బీ) పాండ్యా 1; లాథమ్ (ఎల్బీ) చాహల్ 37; నీషమ్ (రనౌట్) 44; గ్రాండ్‌హోమ్ (ఎల్బీ) చాహల్ 11; శాంటర్న్ (సి) షమి (బి) పాండ్యా 22; ఆస్లే (ఎల్బీ) చాహల్ 10; హెన్రీ (నాటౌట్) 17; బౌల్ట్ (సి) షమి (బి) భువనేశ్వర్ 1; **ఎక్స్‌ట్రాలు: 3; మొత్తం: 44.1 ఓవర్లలో 217 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-18, 2-37, 3-38, 4-105, 5-119, 6-135, 7-176, 8-194, 9-204, 10-217. **బౌలింగ్:** భువనేశ్వర్ 7.1-0-38-1; షమి 8-0-35-2; పాండ్యా 8-1-50-2; విజయ్ 4-0-19-0; చాహల్ 10-0-41-3; జాదవ్ 7-0-34-1.



మ్యాచ్ అనంతరం మైదానంలో ధవన్ డ్యాన్స్

'హౌజ్ ద జోష్'

వెల్లింగ్టన్: 'హౌజ్ ద జోష్' అంటూ న్యూజిలాండ్‌పై గ్రాండ్ విక్టరీని టీమిండియా సెలబ్రేట్ చేసుకుంది. ఇటీవల విడుదలైన బాలీవుడ్ మూవీ 'ఉరి-ద సర్జికల్ స్ట్రయిక్'లో 'హౌజ్ ద జోష్' డైలాగ్ చాలా ఫేమస్ అయింది. ఆ సినిమాలో విక్కీ కౌశల్ పోషించిన పాత్ర తరహాలో.. ట్రోఫీ అందుకున్న తర్వాత బ్యాట్స్‌మన్ కేదార్ జాదవ్ 'హౌజ్ ద జోష్' అంటూ అరిస్తే.. మిగతా జట్టు సభ్యులు 'హై సర్' అని బిగ్గరగా రిప్లై ఇచ్చారు. 'జట్టులో 'జోష్'.. హై సర్' అనే క్యాప్షన్‌తో జట్టు సంబరాల వీడియోను బీసీసీఐ షేర్ చేసింది. నటుడు విక్కీ కూడా బోర్డు వీడియోను పోస్టు చేశాడు. 'దేశం మొత్తం జోష్‌ను తన వెంటే ఉంచుకునే భారత జట్టు.. అందర్నీ గర్వపడేలా చేస్తోంది. అద్భుత విజయానికి శుభాకాంక్షలు' అని ట్వీట్ చేశాడు.

సిరీస్ విండీస్ వశం

నార్త్‌సౌండ్: ఇంగ్లండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌ను ఆతిథ్య వెస్టిండీస్ మరో మ్యాచ్ మిగిలుండగానే 2-0తో కైవసం చేసుకుంది. రెండో టెస్టులో విండీస్ 10 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. జేసన్ హోల్డర్ (4/43), కీమర్ రోచ్ (4/52) చెరో నాలుగు వికెట్లతో చెలరేగడంతో మూడో రోజే మ్యాచ్‌ను ముగించింది. విండీస్ బౌలర్ల దెబ్బకు ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 132 పరుగులకే కుప్పకూలింది. విండీస్ ముందు కేవలం 14 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఉంచింది. రెండో ఇన్నింగ్స్‌లో బరిలోకి దిగిన విండీస్ ఓపెనర్లు క్రెయిగ్ బ్రాత్‌వైట్ (5), జాన్ క్యాంప్‌బెల్ (11) 2.1 ఓవర్లలో 17/0తో ఛేదించారు. సుమారు పదేళ్ల తర్వాత విజ్డెన్ ట్రోఫీని విండీస్ హస్తగతం చేసుకుంది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 187 పరుగులు చేయగా.. వెస్టిండీస్ 306 పరుగుల స్కోరు చేసింది.

విదర్భ 200/7

సౌరాష్ట్రతో రంజీ ఫైనల్

నాగపూర్: రన్‌మెషీన్ వసీం జాఫర్ (23)ను తక్కువ స్కోరుకే పెవిలియన్ చేర్చడంతో.. డిఫెండింగ్ చాంప్ విదర్భతో రంజీ ఫైనల్ తొలిరోజు సౌరాష్ట్ర ఆధిపత్యం ప్రదర్శించింది. ఆదివారం మొదలైన ఈ మ్యాచ్‌లో సౌరాష్ట్ర బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టడంతో విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 200/7 పరుగుల స్కోరు చేసింది. ఆట ముగిసేసరికి అక్షయ్ కర్నేవర్ (31), అక్షయ్ వాఖరే (0) క్రీజులో ఉన్నారు. అక్షయ్ వాడ్కర్ (45) టాప్ స్కోరర్‌గా నిలవగా, మోహిత్ కాలే 35, గణేష్ సతీష్ 32 పరుగులు చేశారు. మ్యాచ్ ఆసాంతం కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో నిలకడగా బౌలింగ్ చేసిన ఉనాద్కట్ (2/26) కీలకమైన జాఫర్‌తో పాటు మరో వికెట్ తీసి విదర్భను ఇబ్బందుల్లోకి నెట్టాడు.

లంక లక్ష్యం 516 పరుగులు

కాన్‌బెర్రా: ఉస్మాన్ ఖవాజా (101 నాటౌట్) అజేయ శతకంతో అదరగొట్టడంతో.. రెండో టెస్టులో శ్రీలంక ముందు ఆస్ట్రేలియా 516 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఖవాజాతో పాటు ట్రావెస్ హెడ్ (59 నాటౌట్) హాఫ్ సెంచరీ చేయడంతో.. ఆసీస్ 196/3 వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం లంక ఆదివారం ఆటముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 17 పరుగులు చేసింది. దిముత్ కరుణరత్నే (8), లాహిరు తిరుమన్నె (8) క్రీజులో ఉన్నారు. అంతకుముందు 123/3తో మూడోరోజు ఆటను కొనసాగించిన లంక తొలి ఇన్నింగ్స్‌లో 215 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌ను 534/5 వద్ద డిక్లేర్ చేసిన ఆసీస్‌కు 319 పరుగుల ఆధిక్యం లభించింది.

థ్రిల్లింగ్ ఫైట్‌లో పాక్ ఓటమి

సిరీస్ దక్షిణాఫ్రికాదే ● రెండో టీ20లో 7 రన్స్‌తో గెలుపు



మిల్లర్

జొహాన్నెస్‌బర్గ్: ఉత్కంఠభరితంగా జరిగిన రెండో టీ20లో ఆతిథ్య దక్షిణాఫ్రికా 7 పరుగుల తేడాతో పాకిస్థాన్‌పై నెగ్గింది. దీంతో మూడు టీ20ల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 189 పరుగుల లక్ష్య ఛేదనలో పాక్ ఓవర్లన్నీ ఆడి 181/7 స్కోరు మాత్రమే చేసింది. చివరి ఓవర్‌లో విజయం కోసం 15 రన్స్ అవసరమవగా.. ఫెలుక్వాయో (3/36) 7 పరుగులిచ్చి షోయబ్ మాలిక్ (6), హసన్ అలీ (1)లను అవుట్ చేసి.. పాక్‌కు విజయాన్ని దూరం చేశాడు. బాబర్ ఆజమ్ (90), హుస్సేన్ తలాట్ (55) అర్ధ శతకాలు వృథా అయ్యాయి. అంతకుముందు మిల్లర్ (65 నాటౌట్) సుడిగాలి ఇన్నింగ్స్‌తో.. దక్షిణాఫ్రికా 188/3 పరుగులు చేసింది. ఈ ఓటమితో పాకిస్థాన్ వరుసగా 11 టీ20 సిరీస్‌ల వరల్డ్ రికార్డు విజయాలకు బ్రేక్ పడింది.

ఐర్లాండ్‌కు భారత అమ్మాయిల షాక్

మార్సియా (స్పెయిన్): భారత హాకీ మహిళలు అద్భుత విజయం సాధించారు. ప్రపంచ కప్ రజత పతక విజేత అయిన ఐర్లాండ్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించారు. ఆదివారం జరిగిన తమ రెండో ఫ్రెండ్లీ మ్యాచ్‌లో భారత్ 3-0 గోల్స్ తేడాతో ఐర్లాండ్‌ను కంగుతినిపించింది. నవ్‌జ్యోత్ కౌర్, రీనా ఖోకర్, గుర్జీత్ కౌర్ తలా ఓ గోల్ సాధించి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించారు. తొలి మ్యాచ్‌ను 1-1తో డ్రాగా ముగించిన భారత అమ్మాయిలు.. చివరిదైన రెండోమ్యాచ్‌లో విజయం సాధించి స్పెయిన్ పర్యటనను దిగ్విజయంగా ముగించారు. ఐర్లాండ్‌తో మ్యాచ్‌లకు ముందు ఆతిథ్య స్పెయిన్‌తో నాలుగుమ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 2-2తో సమం చేసిన సంగతి తెలిసిందే.





ముంబైలో ఆదివారం జరిగిన ఓ ఫ్యాషన్ షోలో బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ర్యాంప్ వాక్

కాలికట్.. అదుర్స్

● చెన్నైపై గెలుపు ● ప్రొ.వాలీబాల్ లీగ్



కొచ్చి: ప్రొ.వాలీబాల్ లీగ్‌లో మరో స్థానిక జట్టు కాలికట్ హీరోస్ అద్భుత బోణీ చేసింది. ఆదివారం జరిగిన లీగ్ రెండో మ్యాచ్‌లో కాలికట్ 4-1 (15-8, 15-8, 13-15, 15-11, 15-11) సెట్ల తేడాతో చెన్నై స్పార్టన్స్‌పై సునాయాసంగా గెలుపొందింది. ఈ విజయంతో హీరోస్ రెండు పాయింట్లు కూడా సాధించింది. కాలికట్ జట్టులో యువ అటాకర్ అజిత్‌లాల్ (14)) అద్భుత ఆటతో అదరగొట్టాడు. చెన్నైలో రూడీ వెరోఫ్ అత్యధికంగా ఎనిమిది పాయింట్లు స్కోర్ చేశాడు. తొలి రెండు సెట్లను కాలికట్ అలవోకగా నెగ్గింది. కానీ తర్వాత పుంజుకున్న చెన్నై మూడో సెట్‌ను కైవసం చేసుకుంది. అయితే తర్వాతి రెండు సెట్లలో మళ్లీ సత్తా చూపిన కాలికట్ మ్యాచ్‌ను కైవసం చేసుకుంది.

ఖాజాకు మరో రెండు పతకాలు




ఇస్తాంబుల్: అంతర్జాతీయ వింటర్ మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన షేక్ ఖాజా మొహియుద్దీన్ మరో రెండు పతకాలను సొంతం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన పురుషుల ఫ్రీ స్టయిల్ 50, 200 మీటర్ల పోటీల్లో ఖాజా రెండోస్థానంలో నిలిచి రజత పతకాలను దక్కించుకున్నాడు.

● ఏడుగురు క్రికెట్ బుకీల అరెస్టు

కాకినాడ (క్రైం): తెలుగు రాష్ట్రాలు కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ముఠాను తూర్పుగోదావరి జిల్లా పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నిందితులు ప్రవీణ్ కుమార్, కల్యాణ్, జగదీష్ ప్రసాద్, శివ ధర్మతేజల నుంచి రూ. 11 లక్షలు, 15 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ విశాల్ తెలిపారు.

జీవనశైలి వల్లే కేన్సర్

20 ఏళ్లలో 3 రెట్లు పెరిగిన వ్యాధి



1.81 కోట్లు	ప్రపంచవ్యాప్తంగా కేన్సర్ బాధితుల సంఖ్య
96 లక్షలు	ప్రపంచవ్యాప్తంగా గత ఏడాది కేన్సర్‌తో మరణించిన వారి సంఖ్య
22.58 లక్షలు	భారత్‌లో ప్రస్తుతం కేన్సర్ బాధితుల సంఖ్య
11.57 లక్షలు	ఏటా కొత్తగా నమోదవుతున్న కేన్సర్ కేసులు
7.84 లక్షలు	2018లో కేన్సర్ కారణంగా సంభవించిన మరణాలు
3.17 లక్షలు	పొగాకు ఉత్పత్తుల కారణంగా ఏటా మరణిస్తున్న వారి సంఖ్య
50 శాతం	మనదేశంలో కేన్సర్ బాధితుల్లో మహిళలు
30 శాతం	భారత్‌లో నమోదవుతున్న కేసుల్లో నోటి కేన్సర్ల వాటా
2.77 లక్షలు	తెలంగాణలో కేన్సర్ బాధితుల సంఖ్య

నేడు ప్రపంచ కేన్సర్ దినం

కేన్సర్.. ఈ పేరు వింటేనే ప్రపంచం వణికిపోతోంది. ఎవరికి.. ఎప్పుడు.. ఎలావస్తుందో తెలియక మనిషి హడలిపోతున్నాడు. ఈ ప్రశ్నలకు సమాధానం తెలిస్తే కేన్సర్ మహమ్మారిని ఎదుర్కోవడం సులువే అని వైద్యులు అంటున్నారు. అనువంశిక జన్యువుల వల్ల 10% మంది, జీవన శైలి వల్ల 90% మంది కేన్సర్ బారిన పడుతున్నారని అన్నారు. 1990ల్లో పోలియో లాంటి అంటువ్యాధులు దేశాన్ని పట్టి పీడించాయి. ఇప్పుడు కేన్సర్ మహమ్మారి మనఇంట్లో, మన ఒంట్లోకి వచ్చి కూర్చుంటోంది. ప్రస్తుతానికి అమెరికా లాంటి దేశాలతో పోల్చితే భారత్‌లో కేన్సర్ మరణాలు తక్కువే. వ్యాధిగ్రస్తుల రేటు మాత్రం 1990తో పోల్చితే 2016 నాటికి మూడు రెట్లు పెరిగింది. అమెరికాలోని నేషనల్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ రీసెర్చ్ ఫెలో, భారత సంతతి శాస్త్రవేత్త శ్రీకృష్ణ ప్రకారం పాశ్చాత్య దేశాల ఆహారపు అలవాట్ల వల్ల కేన్సర్ వస్తోంది. ప్రపంచ కేన్సర్ దినం సందర్భంగా ఈ వ్యాధి గురించి మరికొన్ని నిజాలు...



మరిన్ని అంశాలు..

- గుండె జబ్బుల తర్వాత మనిషి మరణాలకు రెండో అతిపెద్ద కారణం కేన్సర్.
- గర్భాశయ ముఖద్వార కేన్సర్‌తో ప్రతి 8 నిమిషాలకు ఒక మహిళ మరణిస్తుంది.
- పోగాకు ఉత్పత్తుల కారణంగా రోజుకు 2500 మంది మరణిస్తున్నారు.
- ఊపిరితిత్తుల, నోటి కేన్సర్లతో 25% మంది పురుషులు చనిపోతున్నారు.
- రొమ్ము, నోటి, గర్భాశయ ముఖద్వారా కేన్సర్లతో 40% మంది స్త్రీలు మరణిస్తున్నారు.
- ప్రపంచవ్యాప్తంగా నోటి కేన్సర్ బాధితుల్లో మూడో వంతు భారత్‌లోనే ఉన్నారు.
- ప్రతి వంద మందిలో 8-11 మందిలో ఈ మహమ్మారి బాధితులే.

టాప్ 5 కేన్సర్లు: రొమ్ము, గర్భాశయ ముఖద్వారా, నోటి, కాలేయ, పేగు కేన్సర్

కేన్సర్‌కు కారణాలు: ఆహారపుటలవాట్లు, వాతావరణ కాలుష్యం, అతినీల లోహిత కిరణాల ప్రభావం, పురుగుమందులు, హానికర రసాయనాలు, ప్లాస్టిక్, రేడియేషన్, ధూమపానం, మసాలాలతో కూడిన నాన్‌వెజ్, ఫ్రై ఫుడ్.

అడ్డుకట్ట ఎలా: కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి. కేన్సర్ పరిశోధన, చికిత్సలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి. వ్యాక్సినేషన్ తయారీకి కృషి చేయాలి.

- సెంట్రల్ డెస్క్





లెఫ్ట్‌ఫ్రంట్ ర్యాలీ వేదికపై సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్‌రెడ్డి, ర్యాలీకి భారీగా హాజరైన ప్రజలు

రాఫెల్ లూటీ ఎలక్టోరల్ బాండ్లుగా మార్పు: ఏచూరి

కోల్‌కతా, ఫిబ్రవరి 3: రాఫెల్ కుంభకోణంలో నిధులన్నీ ఎలక్టోరల్ బాండ్ల రూపంలో బీజేపీ ఖాతాలోకి చేరిపోయాయని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోపించారు. 95% బాండ్లు బీజేపీకే దక్కడం ఇందుకు నిదర్శనమన్నారు. ఆదివారం ఆయన కోల్‌కతాలో జరిగిన లెఫ్ట్‌ఫ్రంట్ ర్యాలీనుద్దేశించి మాట్లాడారు. "మోదీ సర్కారు ఐదేళ్లుగా దేశాన్ని దోచుకుని.. ఇప్పుడు రాయితీల జపం చేస్తోంది. ఈ చౌకీదార్ సేవలు ఇక వద్దు. తొలగించేద్దాం" అనిపిలుపునిచ్చారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మోదీ సర్కారు ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్ ఓ మాయ అన్నారు. కాగా.. సీపీఎం కురువృద్ధుడు బుద్ధదేవ్ భట్టాచార్‌జీ మూడేళ్ల తర్వాత లెఫ్ట్‌ఫ్రంట్ ర్యాలీ ద్వారా ప్రజల ముందుకు వచ్చారు.



కనీసం 50% వీవీప్యాట్లు లెక్కించాలి

- మెజారిటీ 5శాతంలోపుంటే పూర్తిగా గణించాలి
- బీజేపీ యేతర పక్షాల డిమాండ్
- సుప్రీంకోర్టు తలుపు తట్టే చాన్స్
- 15న అమరావతిలో 24 పార్టీల సదస్సు!
- ఎజెండాలో మూడు ప్రధానాంశాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఈవీఎంల పారదర్శకతపై నెలకొన్న అనుమానాల నేపథ్యంలో బీజేపీ యేతర పార్టీలు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 50శాతం వీవీప్యాట్లను లెక్కించే విధంగా ఆదేశాలివ్వాలని కోరుతూ సుప్రీం కోర్టు తలుపు తట్టే అవకాశాలను పరిశీలిస్తున్నాయి. ఏదైనా నియోజకవర్గంలో గెలుపోటముల్లో తేడా 5శాతం లోపు ఉంటే.. అక్కడ వీవీప్యాట్లను పూర్తిగా లెక్కించాలనే డిమాండ్‌నూ పరిశీలిస్తున్నాయి. ఈ మేరకు కాంగ్రెస్, బీఎస్పీ ఎస్పీ, టీఎంసీ సహా 24 పార్టీల మధ్య చర్చ కోసం టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఫిబ్రవరి 13న బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత 15న ఏపీ రాజధాని అమరావతి వేదికగా విపక్షాల మధ్య మొట్టమొదటి సదస్సు జరగనుంది. ప్రధానంగా మూడు అంశాలు.. వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగ సమస్య, ప్రజాస్వామ్య సంస్థలపై జరుగుతున్న దాడులపై ఈ సదస్సులో చర్చించనున్నారు. విలువైన సూచనలు చేసేందుకు కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన నిపుణులను, సామాజిక కార్యకర్తలను ఆహ్వానించనున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని సమష్టిగా ఎదుర్కొనే దిశగా ఈ కార్యక్రమం విపక్షాలకు గొప్ప ప్రేరణనిస్తుందని భావిస్తున్నారు.

చిదంబరం విచారణకు అనుమతి

ఐఎన్‌ఎక్స్ కేసులో మరో మలుపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3: ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరంను విచారించేందుకు సీబీఐకి న్యాయ శాఖ అనుమతి లభించినట్లు విశ్వసనీయ సమాచారం. గత నెలలోనే సీబీఐ కేంద్రాన్ని అనుమతి కోరింది. చిదంబరం ఆర్థిక మంత్రిగా ఉండగా విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎఫ్ఐపీబీ)లో అక్రమాలు జరిగాయంటూ 2017 మే 15న సీబీఐ కేసు నమోదు చేసింది. 2007లో ఐఎన్ఎక్స్ మీడియాకు రూ.300 కోట్ల విదేశీ నిధులు వచ్చేలా నిబంధనలు ఉల్లంఘించి అనుమతి ఇచ్చారన్నది అభియోగం. ఈ వ్యవహారంలో రూ.10 లక్షలు ముట్టాయన్న ఆరోపణపై చిదంబరం తనయుడు కార్తి చిదంబరాన్ని గతంలోనే ఆరెస్టు చేశారు.

పట్టాలు తప్పిన సీమాంచల్

బిహార్‌లో ఆరుగురి మృతి

సోన్‌పూర్, ఫిబ్రవరి 3: సీమాంచల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు బిహార్‌లోని జోగ్‌బని నుంచి ఢిల్లీకి వెళ్తుండగా వైశాలి జిల్లాలో సహదాయ్ బుజుర్గ్ వద్ద ఆదివారం తెల్ల వారుజామున పట్టాలు తప్పింది. వేగంగా వెళ్తున్న రైలులో 11 బోగీలు పట్టాలు తప్పడంతో భారీ శబ్దంతో ప్రయాణికులంతా బెర్తులపై నుంచి కిందపడిపోయారు. ఆరుగురు ప్రయాణికులు నిద్రలోనే మృత్యు ఒడిలోకి జారుకున్నారు. పట్టాలు విరగడంతో ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికా రులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఒక జనరల్ బోగీ, ఒక ఏసీ బోగీ, మూడు స్లీపర్ కోచ్‌లు ధ్వంసమయ్యాయని.. మరో ఆరు బోగీలు కూడా పట్టాలు తప్పాయని తూర్పు మధ్య రైల్వే పీఆర్‌వో రాజేశ్‌కుమార్ తెలిపారు. 29 మంది గాయపడ్డారని, వారిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయని తూర్పు మధ్య రైల్వే పీఆర్‌వో రాజేశ్‌కుమార్ తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని అందించనున్నట్లు రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు అందజేస్తామని, వైద్య ఖర్చులన్నీ రైల్వే శాఖే భరిస్తుందని వెల్లడించారు. ప్రమాద ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. బిహార్ ప్రభుత్వం కూడా మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం ప్రకటించింది. రైలు ప్రమాదంపై ప్రధాని మోదీ, బిహార్ సీఎం నితీశ్‌కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ రైలు ప్రమాదంపై విచారం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి రాంవిలాస్ పాసవాన్, ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ సంతాపం తెలిపారు. ఈ ప్రమాదంపై స్వతంత్ర విచారణ జరిపించాలని మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు.



వైశాలి జిల్లాలో ఆదివారం పట్టాలు తప్పిన సీమాంచల్ ఎక్స్‌ప్రెస్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.